మార్గదర్శకులు
రూ।। 120/-
పేజీలు: 130


నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



**కేరళ స్థానిక సంస్థల్లో యుడిఎఫ్‌కు ఆధిక్యత**

జిల్లా పరిషత్‌లలో సగం గెలుచుకున్న ఎల్‌డిఎఫ్

తిరువనంతపురం కార్పొరేషన్‌లో ఎన్‌డిఏ అనూహ్య విజయం **05**



సంపుటి 09, సంచిక: 18 | ఆదివారం | 14-12-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## మెస్సీతో సిఎం ఫ్రెండ్లీ మ్యాచ్

# రేవంత్‌రెడ్డి గోల్



### అభిమానుల కేరింతలతో హోరెత్తిన ఉప్పల్ స్టేడియం

**అలరించిన మ్యూజికల్ నైట్, లేజర్ షో**

**ప్రేక్షకులను ఉర్రూతలూగించిన రాహుల్ సిప్లిగంజ్ నాటు పాట**

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉప్పల్ స్టేడియంలో సింగరేణి ఆర్ఆర్, అపర్ణ మెస్సీ జట్ల మధ్య ఫ్రెండ్లీ మ్యాచ్ జరిగింది. సిఎం రేవంత్ రెడ్డి సింగరేణి, మెస్సీ అపర్ణ జట్లు పోటీ పడ్డాయి. ఈ మ్యాచులో మ్యాచ్ 18వ నిమిషంలో గ్రౌండ్‌లోకి దిగిన సిఎం రేవంత్ రెడ్డి వచ్చి రాగానే గోల్ కొట్టి అలరించాడు. యువకులతో పోటీ పడి మరీ సిఎం రేవంత్ రెడ్డి గోల్ కొట్టడంతో అభిమానుల కేరింతలతో ఉప్పల్ స్టేడియం దద్దరిల్లింది. అనంతరం గ్రౌండ్‌లోకి దిగిన మెస్సీ కాసేపు సిఎం రేవంత్‌తో గేమ్ ఆడారు. ఆ తర్వాత ప్లేయర్స్‌తో కలిసి ఫోటో దిగారు. అనంతరం బాల్స్‌ను స్టేడియం స్టాండ్స్‌లోకి కిక్ చేశారు మెస్సీ. అంతకుముందు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ,


తరువాయి 2లో

## మహాత్మాగాంధీ పేరులో

# తప్పేముంది?

- ఉపాధిహామీ పథకం పేరులో ‘గాంధీ’ని తొలగించడంపై విరుచుకుపడిన కాంగ్రెస్
- ‘విప్లవాత్మక పథకానికి క్రెడిట్ పొందడం కోసమే ఈ చర్య’ అని మండిపాటు
- పథకాలకు పేర్లు మార్చడంలో మోదీ ప్రభుత్వం దిట్ట అని విమర్శ
- ప్రజలకు చేకూరే ప్రయోజనం ఏమిటని నిలదీత






**న్యూఢిల్లీ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పేరు మారుస్తూ శుక్రవారం కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. పథకం పేరులో గాంధీ పేరును తొలగించడంపై కాంగ్రెస్ మండిపడింది. పథకాలకు పేర్లు మార్చడంలో మోదీ ప్రభుత్వం దిట్ట అని విమర్శించింది. ఈ చర్యను ఎందుకు తీసుకున్నారని, మహాత్మాగాంధీ పేరులో ఉన్న తప్పు ఏమిటని నిలదీసింది. ఈ చర్యపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ మాట్లాడుతూ పథకాలు, చట్టాలకు పేర్లు మార్చడంలో మోదీ ప్రభుత్వం దిట్ట అని

తరువాయి 2లో

## 13 వేల సర్పంచ్‌లు.. 78 వేల వార్డు సభ్యులు


# పట్టం ఎవరికో?

- 3,911 గ్రామాల్లో నేడు రెండో విడత పంచాయతీ ఎన్నికలు
- పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసిన అధికారులు
- బరిలో 13,128 సర్పంచ్ అభ్యర్థులు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రెండో విడుత పంచాయతీ ఎన్నికలను సర్వం సిద్ధమైంది. నేడు (ఆదివారం) రాష్ట్ర వ్యాప్తంగా 3,911 గ్రామాల్లో రెండవ దశ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. 13,128 సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉండగా, 29,903 వార్డులకు 78,158 వార్డు సభ్యులు బరిలో నిలిచారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ పూర్తయిన వెంటనే భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టనున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఎన్నికల అధికారులు ఫలితాలను ప్రకటిస్తారు. ఓట్ల లెక్కింపు అనంతరం వార్డు సభ్యుల నుంచి ఒకరిని ఉప సర్పంచ్‌గా ఎన్నుకుంటారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా అధికారులు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లలో సిబ్బందికి పోలింగ్ సామగ్రిని

తరువాయి 2లో



## ‘ఓట్ చోరీ’పై

# ఢిల్లీలో నేడు ర్యాలీ

- కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ కుమ్మక్కుపై నిలదీయనున్న కాంగ్రెస్
- ఓట్‌చోరీపై సంతకాల సేకరణ మెమోరాండంను రాష్ట్రపతికి సమర్పించే అవకాశం

**న్యూఢిల్లీ :** ‘ఓట్‌చోరీ’పై ప్రచారాన్ని కాంగ్రెస్ పార్టీ ఉధృతం చేయనుంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ చేపట్టనుంది. ఎన్నికలను రిగ్గింగ్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ కుమ్మక్కయ్యారనే ఆరోపణలపై వాటిని నిలదీయాలని భావిస్తోంది. ర్యాలీలో అనంతరం నిర్వహించే సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రసంగించే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ వాద్రా, కెసి వేణుగోపాల్, జైరాం రమేష్,

తరువాయి 2లో

# పనితీరు భేష్



- రాష్ట్రంలో ప్రభుత్వ పాలన, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం పట్ల రాహుల్‌గాంధీ సంతృప్తి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలకు అభినందనలు
- ఓట్ చోరీపై మరింత పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో రెండేళ్ళ కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, పార్టీ పనితీరు, గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం పట్ల లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఎఐసిసి అగ్ర నాయకులు రాహుల్ గాంధీ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ విజయాలను సాధించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, క్షేత్ర కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు. ఒక రోజు పర్యటన నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన రాహుల్ గాంధీకి సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వసలహాదారు హర్కర వేణు గోపాల్ తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయం నుంచి

తరువాయి 2లో

## విభజన రాజకీయాలకు

# మేం వ్యతిరేకం

- వాటికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా అసెంబ్లీ ఎన్నికలకు వెళతాం
- ఎఐ టెక్నాలజీతో బిజెపిని ఓడిస్తాం
- విజన్ ఇండియా సమ్మిట్‌లో యుపి మాజీ సిఎం అఖిలేశ్ యాదవ్
- అభివృద్ధి, ప్రగతిశీల రాజకీయాలే ధ్యేయంగా విజన్ ఇండియాలో పనిచేస్తామని వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

సమాజ్ వాదీ పార్టీ విభజన రాజకీయాలకు వ్యతిరేకమని, దానికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎఐ టెక్నాలజీని ఉపయోగించుకొని బిజెపి ఓడిస్తామని పార్టీ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ తెలిపారు. పరిపాలనలో సాంకేతికత వినియోగం, భవిష్యత్తులో సాంకేతికత రూపాంతరం వంటి అంశాలపై యువతలో అవగాహన కల్పించాలన్న లక్ష్యంగా సమాజ్ వాది పార్టీ అధ్యర్యంలో శనివారంహైదరాబాద్ లో జరిగిన విజన్ ఇండియా సమ్మిట్ లో అఖిలేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సానుకూల, అభివృద్ధి, ప్రగతిశీల రాజకీయాలే తమ ధ్యేయంగా విజన్ ఇండియా ద్వారా పని చేస్తామని తెలిపారు. రైతులకు, మౌలిక సదుపాయాల కల్పనకు, పట్టణీకరణ, పట్టణాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ట్రాఫిక్ సమస్య పరిష్కారం, ఆరోగ్య, తదితర రంగాల్లో ఏఐ టెక్నాలజీని

తరువాయి 2లో

# కొత్త నిబంధనలొద్దు




- హెచ్1బి వీసా లక్ష డాలర్ల ఫీజుపై కోర్టుకెక్కిన 19 అమెరికా రాష్ట్రాలు
- కార్మికుల కొరత, టెక్ సంస్థలు, పరిశ్రమలు సంక్షోభంలో చిక్కుకుంటాయని ఆందోళన

న్యూయార్క్/వాషింగ్టన్

హెచ్ 1 బి వీసా దరఖాస్తులపై ఏకమొత్తంగా లక్ష డాలర్లు వసూలు చేయాలని ట్రంప్ యంత్రాంగం విధించిన కొత్త నిబంధనలను అమెరికాలోని 19 రాష్ట్రాలు కోర్టుల్లో సవాలు చేశాయి. ఇప్పటికే ఈ వీసా నిబంధనలపై అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కోర్టులో సవాలు చేసింది. అడ్మినిస్ట్రేటివ్ ప్రొసిడ్యూర్ యాక్ట్, ఇమ్మిగ్రేషన్–నేషనాలిటీ యాక్ట్‌లను ఉల్లంఘించి లక్ష డాలర్లు చెల్లించాలనే కొత్త నిబంధన ట్రంప్ తెచ్చారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ నిబంధనలవల్ల అమెరికాలో కార్మికుల కొరత వస్తుందని, టెక్ సంస్థలు, పరిశ్రమలు కార్మికుల కొరతతో సంక్షోభంలో చిక్కుకుంటాయని తమ తమ దావాల్లో ప్రభుత్వాలు పేర్కొన్నాయి. 1950వ దశకం నుండి అమెరికా హెచ్1 బి వీసా కార్యక్రమం కింద కీలక రంగాలలో వృత్తినిపుణులను తాత్కాలిక ప్రాతిపదికపై అనుమతించింది. 1990వ దశకం నుండి ఆరు సంవత్సరాలు ఉండేవిధంగా ప్రత్యేకవృత్తుల్లో హైర్ వర్కర్లను అనుమతించింది. ట్రంప్ యంత్రాంగం చట్టవిరుద్ధమైన నిర్ణయం తీసుకుందని, పార్లమెంటు ఆమోదం లేకుండా

తరువాయి 12లో

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగులది

# దారుణ స్థితి

- ఆకర్షణీయ జీతం, విలాసవంత వసతులు ఉన్నా ఉద్యోగ భద్రత లేదు
- ఉద్యోగులకు హక్కుల రక్షణ చట్టం తేవాలి
- హైకోర్టు స్పష్టీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పరిస్థితి చూస్తే అంతా బేషూగ్గానే కనబడుతుందని, వాస్తవ పరిస్థితిలోకి వెళితే అసంఘటిత కార్మికుల మాదిరిగా వారి దుస్థితి ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. భారీ జీతభత్యాలు, ఆకర్షణీయమైన సౌకర్యాలు, విలాసవంత వసతులు ఉన్నప్పటికీ వాళ్ల ఉద్యోగాలకు భద్రత లేకుండాపోయిందని పేర్కొంది. దేశ ఆర్థిక పురోగతిలో కీలక పాత్ర పోషిస్తున్న సాఫ్ట్ వేర్

తరువాయి 12లో

# ఒట్టేసి చెప్పండి

## ఓటేశారా.. లేదా?



- వేయకుంటే మా డబ్బులివ్వండి
- దేవుడి ఫోటో, పురుగుల మందు డబ్బాతో ఓడిన సర్పంచ్ అభ్యర్థులు
- నల్లగొండ, మహబూబాబాద్ జిల్లాల్లో సిత్రాలు

ప్రజాపక్షం/నార్కట్ పల్లి

తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికల అనంతరం పలు గ్రామాల్లో చిత్ర విచిత్ర ఘటనలు వెలుగుచూస్తున్నాయి. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం, మహబూబాబాద్ జిల్లాలో ఓడిన అభ్యర్థులు తిరిగి డబ్బులు వసూలు చేస్తున్నారు. నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి మండలం ఔరవాణి గ్రామంలో మొత్తం ఓట్లు 1490 ఉండగా, కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి జక్కల పరమేష్ కు 973 ఓట్లు రాగా, బిఆర్‌ఎస్ బలపరిచిన కల్లూరి బాలరాజుకు 525 ఓట్లు వచ్చాయి. గ్రామంలోని బిఆర్ ఎస్ పార్టీకి

తరువాయి 12లో




# ప్రపంచం
WORLD NEWS

## ట్రంప్ మాట లెక్కచేయని థాయ్‌లాండ్

**బ్యాంకాక్:** కాల్పుల విరమణ ఒప్పందాన్ని పునరుద్ధరించేందుకు రెండు దేశాలు అంగీకరించాయని, రెండు దేశాలూ శాంతికి సిద్ధంగా ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన తర్వాత కూడా కాంబోడియాపై థాయ్‌లాండ్ దాడులు ఆగలేదు. దాడులు ఆపిలేదని థాయ్‌లాండ్ తాత్కాలిక మంత్రివర్గ నాయకుడు, ప్రధానమంత్రి అనుటిన్ చార్‌విరాకుల్ స్పష్టం చేశారు. కాంబోడియా ప్రభుత్వం తన దళాలన్నింటినీ సరిహద్దుల నుండి తరలించాలని, మందుపాతరలను తొలగించాలని, అప్పటి వరకూ ట్రంప్ ప్రతిపాదన ఒక ప్రత్యామ్నాయంగా మాత్రమే ఉంటుందని అనుటిన్ స్పష్టం చేశారు. "మా దేశానికి, మా ప్రజలకు ఎలాంటి హానీ జరగదని మేం భావించేంతవరకూ మా సైనిక చర్య కొనసాగుతుంది, ఆ వైఖరి ఏమిటో శనివారం ఉదయం చేతల్లోనే తెలియజేశాం, కాంబోడియా తీరు తెన్నులను మా దేశం స్వయంగా ధృవీకరించుకోవాల్సి ఉంటుంది" అని అనుటిన్ ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. గడచిన మంగళవారం నుండి కొత్తగా మొదలైన సంఘర్షణల్లో 24 మంది మరణించారు. రెండు వైపుల సరిహద్దు గ్రామాల నుండి 7,00,000 మంది ఇళ్ళు ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపోయారు.

## భారత్‌పై 50 శాతం సుంకాల రద్దుకు అమెరికా కాంగ్రెస్‌లో తీర్మానం

**న్యూయార్క్/వాషింగ్టన్ :** భారతదేశంపై అమెరికా విధించిన 50 శాతం సుంకాలను రద్దు చేయాలని కోరుతూ ఆ దేశ చట్టసభ కాంగ్రెస్‌లో పేరెన్నికగన్న ముగ్గురు సభ్యులు ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిని భారత్‌పై విధించిన 'బాధ్యతా రాహిత్యమైన సుంకాల వ్యూహం'గా ఆ ముగ్గురు సభ్యులు విమర్శించారు. భారత్ పట్ల ట్రంప్ అనుసరించిన సుంకాల విధానం అమెరికాపై ప్రతికూల పరిణామాలను చూపిస్తోందని రాజా కృష్ణమూర్తి తన తీర్మానంలో పేర్కొన్నారు. కీలకభాగస్వామిగా ఉన్న భారత్‌పట్ల అనుసరించిన ఈ వైఖరి అమెరికాకు ఎంతమాత్రం కలిసిరాదన్నారు. ఈ టారిఫ్‌లను తొలగిస్తే, ఆర్థిక, రక్షణ రంగాలలో రెండు దేశాల ఉమ్మడి ప్రయోజనాలు నెరవేరతాయని ఆయన పేర్కొన్నారు. భారత్ నుండి చేసుకునే దిగుమతులపై నేషనల్ ఎమర్జెన్సీ కింద విధించిన ఈ సుంకాలను రద్దుచేయాలని కోరారు. ఉత్తర కరోలినాకు చెందిన దిగువసభ సభ్యుడు డెబోరహ్ రోస్, టెక్సాస్‌కు చెందిన సభ్యుడు మార్క్ వెస్లే, ఇల్లినోయిస్‌కు చెందిన రాజా కృష్ణమూర్తి ముగ్గురూ శనివారం అమెరికా కాంగ్రెస్ దిగువ సభ హౌస్ ఆఫ్ రిప్రజంటేటివ్స్‌లో ఈ తీర్మానం ప్రవేశపెట్టారు. ఉత్తర కరోలినా ఆర్థిక వ్యవస్థ చాలా లోతుగా భారత్ వాణిజ్యంతో అనుసంధానమై ఉందని రోస్ పేర్కొన్నారు. బిలియన్‌కు పైగా డాలర్లు భరత్ కంపెనీలు పెట్టుబడిగా సమకూర్చాయని, వేలాది ఉద్యోగాలు సృష్టించాయని, ప్రత్యేకించి టెక్నాలజీ రంగంలో, రీసెర్చ్ ట్రయాంగిల్ లైఫ్ సైన్సెస్‌లో ఈ పెట్టుబడులు సమకూర్చారని ఆమె పేర్కొన్నారు. ప్రపంచంలో ఏ దేశంపైనా ఇంత భారీగా సుంకాలు ట్రంప్ విధించలేదు. ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్స్ యాక్ట్ (ఐఇఇపిఎ) కింద నేషనల్ ఎమర్జెన్సీ ప్రాతిపదికపై విధించిన ఈ సుంకాలను రద్దుచేయాలని తీర్మానం కోరింది. ఈ ఏడాది ఆగస్టు 27వ తేదీ నుండీ అమెరికాకు భారత్ చేసే ఎగుమతులపై 25 శాతం సుంకాలు విధించగా, రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్నారన్న కారణంగా జరిమానాగా మరో 25 శాతం సుంకాలు విధించారు. రష్యా నుండి ముడి చమురు కొనుగోలుచేసి, దానిని భారత్‌లో శుద్ధిచేసి విక్రయించడంద్వారా రష్యాకు నిధులు సమకూర్చి ఉక్రేన్‌లో యుద్ధాన్ని ప్రోత్సహిస్తోందన్నది ట్రంప్ చేసిన ఆరోపణ.



## ఉక్రేన్‌పై బెర్లిన్‌లో తుది విడత చర్చలు

### క్రిస్మస్ నాటికి ఒప్పందం : ట్రంప్ పట్టుదల

**వాషింగ్టన్:** ఉక్రేన్‌లో కాల్పుల విరమణ, శాంతి ఒప్పందం అమలు చేయడంపై జర్మనీ రాజధాని బెర్లిన్‌లో ఉన్నతస్థాయి తుది విడత చర్చలు జరుగుతాయి. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సహా ఇతర యూరోపియన్ యూనియన్ నాయకులతో ట్రంప్ దూత స్టీవ్ విట్‌కాఫ్ ఈ తుది విడత చర్చలు చేపడతారు. ఈ ఆది, సోమవారాలలోనే చర్చలు జరిగే అవకాశం ఉంది. ఐతే ఈ తుది విడత సమావేశంలో యూరప్‌లోని ఏ దేశాల నాయకులు పాల్గొంటారన్న విషయం ఇంకా ఖరారు కాలేదు. 'వాల్‌స్ట్రీట్ జర్నల్' పత్రిక మొదటగా స్పందిస్తూ, బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్, జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ ఈ చర్చల్లో పాల్గొనే అవకాశం ఉందని పేర్కొంది. గడచిన కొద్దిరోజులుగా ఉక్రేన్–రష్యా మధ్య ఉన్నతస్థాయి చర్చలు కొనసాగిస్తూ ఈ వ్యవహారాల్లో రాటుదేలిన విట్‌కాఫ్ తుది విడత యూరోపియన్ యూనియన్ నాయకులతో జరిగే ఉన్నతస్థాయి చర్చల్లో కూడా ప్రముఖపాత్ర వహిస్తారు. ఇటీవలి వారాల్లో ఉక్రేన్–రష్యా ప్రతినిధుల మధ్య మధ్యవర్తుల జోక్యంలె అనేక విడతలుగా సమావేశాలు జరిగాయి. క్రిస్మస్ పర్వదినం నాటికి రష్యా–ఉక్రేన్ మధ్య శాంతి ఒప్పందం జరగాలని ట్రంప్ పట్టుదలతో ఉన్నారు. ఎలాగైనా ఈ ఒప్పందం జరగాలని అమెరికా అధ్యక్షుడు చాలా పట్టుదలతో ఉన్నారు. కానీ అటు జెలెన్‌స్కీ, ఇటు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఎవరికివారు తమదైన వైఖరులకు కట్టుబడి ఉన్నారు. ఈ ఒప్పందం కుదరకుండా యూరోపియన్ యూనియన్ దేశాలు తమ స్వార్థ ప్రయోజనాలకోసం దుష్టపాత్ర పోషిస్తున్నాయని పుతిన్ విమర్శిస్తున్నారు. ఒఇటీవల 15 రోజులుగా యూరప్ దేశాలతో ముమ్మర పర్యటనలు చేసి, యూరప్ నాయకులతో టెలిఫోన్ సంభాషణలు చేసిన ఉక్రేన్ అధ్యక్షుడు కూడా గడచిన గురువారం ముగిసిన మూడు రోజుల ఫ్లోరిడా చర్చల తర్వాత ట్రంప్ ప్రతిపాదించిన ప్రణాళికను తిరస్కరించారు. తమ భూభాగాలను రష్యాకు వదులుకునేందుకు తిరస్కరించారు. ఇందుకు యూరప్ నాయకులే కారణమని ట్రంప్ ఆగ్రహంతో ఉన్నారు. ఇరవై ప్రతిపాదనలతో ఒక ప్రత్యామ్నాయ ప్రణాళికను ట్రంప్‌కు ఇప్పటికే సమర్పించారు. క్రిమియా (2014), లూహాన్స్క్, డోనెట్స్క్ సహా ఐదు ఉక్రేన్ ప్రాంతాలు ప్రస్తుతం రష్యా అధీనంలో ఉన్నాయి. ఉక్రేన్ తన సైన్యాన్ని 6,00,000 కు తగ్గించుకోవాలని ట్రంప్ ప్రణాళిక చెబుతుండగా 8,00,000 వరకూ ఉండేందుకు అనుమతించాలని ఉక్రేన్ కోరుతున్నది. డాన్‌బోస్ ప్రాంతమంతా తమ అధీనంలోనే ఉండాలని రష్యా కోరుతున్నది.



ఇందులోని కొన్ని ప్రాంతాలు ఉక్రేన్ అధీనంలో ఉన్నాయి. దీనిని పుతిన్ తిరస్కరిస్తున్నారు. తదుపరి యూరప్‌పై దాడులకు ఈ ప్రాంతాన్ని పుతిన్ కేంద్రంగా మార్చుకుంటారన్నది యూరప్ నేతల భయం. ఈ పరిస్థితులమధ్య జర్మనీలో తుది విడత ఉన్నతస్థాయి సమావేశాలకు ట్రంప్ అంకురార్పణ చేశారు. నవంబరునెలలో ట్రంప్ 28 అంశాల ప్రణాళిక మొదట తెరమీదకు వచ్చింది. ఈ ప్రణాళిక తీసుకువెళ్ళిన అమెరికా రక్షణశాఖాధికారులు మొదట జెలెన్‌స్కీతో చర్చించారు. జెనీవా సమావేశంలో సవరణల తర్వాత స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జెరిమే కుష్నెర్ మాస్కో వెళ్ళి పుతిన్‌తో చర్చించారు. ఆ తర్వాత ఫ్లోరిడాలో మూడురోజులపాటు ఉక్రేన్ ప్రతినిధులతో చర్చించారు.

### 450 డ్రోన్లు,30 క్షిపణులతో దాడి

ఒకవైపు కాల్పుల విరమణ యత్నాలు కొనసాగుతున్న తరుణంలో మరోవైపు రష్యా–ఉక్రేన్ పరస్పర దాడులు చేసుకుంటున్నాయి. శనివారం సరటోవ్ రీజియన్‌లో జరిపిన దాడుల్లో ఇద్దరు రష్యన్లు మరణించారు. ఈ ప్రాంతంలో అంధకారం నెలకుంది. తాజాగా రష్యా 450డ్రోన్లు, 30 క్షిపణులతో ఉక్రేన్‌లోని ఏడు రీజియన్లపై దాడులు చేసినట్లు ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. ఈ దాడుల్లో నివాసిత ప్రాంతాలు దెబ్బతిన్నాయి. రాత్రికిరాత్రి జరిగిన దాడుల్లో 41 ఉక్రేన్ డ్రోన్లు కూల్చివేసినట్లు రష్యా సైన్యం ప్రకటించింది. శీతాకాలంలో ఇంధన వనరులు, సంబంధిత మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడం లక్ష్యంగా రష్యా దాడులు చేస్తోందని జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. శీతాకాలంలో ఇంధన వనరులపై దాడులు మానేయాలని ఆయన కోరారు. కాగా ఉక్రేన్‌పై తాము కింఝాల్ హైపర్ సోనిక్ క్షిపణులు ప్రయోగించామని, దాడులు చేయడం కష్టంగా ఉన్నప్పుడు ఈ క్షిపణులు తమ దిశను మార్చుకుని మరోచోట దాడులు చేస్తాయన్నారు. విస్తారమైన యుద్ధ దాడులవల్ల ఝపోరిఝియా అణుకేంద్రంలో ఎలక్ట్రిక్ గ్రిడ్ పనిచేయడం మానేసిందని ఐఎఇఎ సంస్థ ప్రతినిధులు చెప్పారు.

## పట్టం ఎవరికో?

(మొదటి పేజీ తరువాయి)

పంపిణీచేశారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రితో సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఇక రెండవ దశలో 415 ఏకగ్రీవమయ్యాయి. వివిధ కారణాల వల్ల 5 పంచాయతీల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. మరో గ్రామంలో ఎన్నికలపై కోర్టు స్టే ఉంది. వార్డుల్లో 38,322 కి గాను 8,304 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి.

## జులై ఉద్యమ ఫలితాల రక్షణకు బంగ్లా పార్టీల ఐక్యతారాగం

**ఢాకా:** బంగ్లాదేశ్ ఎన్నికలవేళ జులై ఉద్యమ నాయకుడు, "ఇంక్విలాబ్ మంఛో" ప్రధాన అధికార ప్రతినిధి షరీఫ్ ఒస్మాన్ హదిపై కాల్పుల ఘటనను దేశంలోని పార్టీలు ఉమ్మడిగా ఖండించాయి.విద్రోహ చర్యల ద్వారా దేశం సాధించిన సరికొత్త ఫలితాలను వమ్ము చేసేందుకు జరిగే ప్రయత్నాలను ఐక్యంగా ప్రతిఘటించాలని నిర్ణయించాయి. ప్రభుత్వ తాత్కాలిక ప్రధాన సలహాదారు మహ్మద్ యూనుస్ అధ్యక్షతన జుమానా గెస్ట్‌హౌస్‌లో శనివారం జరిగిన అఖిలపక్ష సమావేశం ఈ మేరకు ఒక ఉమ్మడి ప్రకటన చేసింది. దేశ ంలో ప్రజాస్వామ్య ప్రక్రియను దెబ్బతీసి బలహీనపరచే చర్యలను, "జులై ఉ ద్యమస్ఫూర్తి"ని దెబ్బతీసేందుకు జరిగే కుట్రలను ఐక్యంగా ప్రతిఘటించాలని పార్టీలు నిర్ణయించాయి. జులై ఉద్యమకారులకు పూర్తి రక్షణ ఇవ్వాలని పలు పార్టీల నాయకులు సమావేశంలో కోరారు. ఉద్యమకాలంలో అపహరణకు గురైన ఆయుధాలను స్వాధీనం చేసుకోవాలని కోరారు. బంగ్లాదేశ్ నేషనలిస్టుపార్టీ, బంగ్లాదేశ్ జామతే–ఎ–ఇస్లామీ, నేషనల్ సిటిజన్స పార్టీలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. అవామీలీగ్ నాయకురాలు షేక్ హాసీనా ప్రభుత్వాన్ని కూల్చివేయడంలో ఒస్మాన్ హది కీలకపాత్ర వహించారు. బంగ్లాదేశ్‌లో ఎన్నికల ప్రకటన వెలువడిన మరునాడే హదిపై గుర్తుతెలియకి వ్యక్తులు బైకుపై వచ్చి కాల్పులు జరిపి అదృశ్యమయ్యారు. కాగా, నవీన బంగ్లాదేశ్ నిర్మాణానికి 13 వ సార్వత్రిక ఎన్నికలు ఒక అవకాశమని మహ్మద్ యూనుస్ అన్నారు. బంగ్లాదేశ్ ప్రజలు ఒక సరికొత్త దేశాన్ని నిర్మించుకోవడానికి ఇదొక సువర్ణ అవకాశమన్నారు. బంగ్లాదేశ్‌లో అతర్గత భద్రతపై కూడా చర్యలు జరిగాయి. బంగ్లాదేశ్ జులై ఉద్యమ నాయకుడు షరీఫ్ ఒస్మాన్ హదిపై కాల్పులు జరిపిన దుండగుల జాడ చెప్పినవారికి రూ. 50 లక్షల టాకాలు బహుమతిగా ఇస్తామని మహ్మద్ యూనుస్ తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించింది. వచ్చేఏడాది ఆరంభంలో జరిగే సార్వత్రిక ఎన్నిక ల్లో షరీఫ్ ఒస్మాన్ హది ఢాకా–8 నియోజకవర్గం నుండి పార్లమెంటుకు స్వ తంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. దుండగులు జరిపిన కాల్పుల్లో ఆయన తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

**ఫిబ్రవరి 12న పార్లమెంటు ఎన్నికలు :** బంగ్లాదేశ్ చరిత్రను కొత్త మలుపు తిప్పే సార్వత్రిక ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 12వ తేదీన జరుగుతాయి. అదేరోజు జులై ఛార్టర్‌పై జాతీయస్థాయిలో రిఫరెండం కూడా నిర్వహిస్తారు. బంగ్లాదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ఎ.ఎం.ఎం.నజీర్ ఉద్దీన్ గడచిన గురువారం (డిసెంబరు11) సాయంత్రం ఢాకాలో 13వ పార్లమెంటుకు నిర్వహించే సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు ప్రకటించారు. ఈ నెల 29వ తేదీ నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుంది. డిసెంబరు 30 నుండి జనవరి 4వ తేదీ వరకూ నామినేషన్లను పరిశీలన, జనవరి 20వ తేదీ వరకూ ఉపసంహరణలకు గడువు ఇచ్చారు.

## రేవంత్‌రెడ్డి గోల్

(మొదటి పేజీ తరువాయి)



ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ ఉప్పల్ స్టేడియానికి చేరుకున్నారు. మెస్సీ పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. స్టేడియం లో మెస్సీ మేనియా వెల్లివిరిసింది. అభిమానులతో స్టేడియం కిక్కిరిసిపోయింది. మెస్సీ అభిమానులు జెర్సీ నెంబర్ 10తో స్టేడియానికి తరలి వచ్చారు. స్టేడియం, పరిసర ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఫుట్‌బాల్ మ్యాచ్ కోసం రేవంత్ రెడ్డి, మెస్సీ ఉప్పల్ స్టేడియానికి చేరుకున్నారు. సింగరేణి ఆర్‌ఆర్, అపర్ణ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. రేవంత్ రెడ్డి సింగరేణి ఆర్‌ఆర్ తరపున, మెస్సీ అపర్ణ జట్టు తరపున బరిలోకి దిగుతున్నారు. కోల్‌కతా ఘటనతో హైదరాబాద్ నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. అంతకుముందు స్టేడియంలో మ్యూజికల్ నైట్, లేజర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాహుల్ సిప్లిగంజ్ నాటు నాటు పాటతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. మంగ్లీ, సిప్లిగంజ్ తమ ఫోక్ సాంగ్స్‌తో అలరించారు.

**హైదరాబాద్‌లో అడుగుపెట్టిన మెస్సీ...**

ఫుడ్‌బాల్ దిగ్గజం మెస్సి హైదరాబాద్‌లో అడుగుపెట్టారు. గోట్ ఇండియా టూర్‌లో భాగంగా నేడు నగరానికి చేరుకున్నారు. సాయంత్రం 4 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న మెస్సి, నేరుగా ఫలక్‌నుమా ప్యాలెస్‌కు వెళ్లారు. అతనితో పాటు 200 మందితో కూడిన జంబో సిబ్బంది ఉన్నారు. వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం భద్రత కల్పించింది. తొలుత ఫలక్‌నుమా ప్యాలెస్‌లో 100 మందితో ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందుకు ఒక్కొక్కరు రూ.10 లక్షలు వెచ్చించి మెస్సి అభిమానులు టికెట్లు బుక్ చేసుకున్నారు. వీటిని మెస్సి ఇండియా ఈవెంట్లు చూస్తున్న టీమ్ పర్యవేక్షించింది. ఫలక్‌నుమా ప్యాలెస్ నుంచి సాయంత్రం 6.30 గంటలకు మెస్సి ఉప్పల్ స్టేడియం చేరుకున్నారు. మ్యాచ్ వీక్షించేందుకు వచ్చిన ప్రియాంకాగాంధీ కుమారుడు, కుమార్తె లు సైతం వచ్చారు. విన్నర్, రన్నరప్ జట్లకు కప్‌ను మెస్సి, రేవంత్‌రెడ్డి అందించారు.అనంతరం రేవంత్‌రెడ్డి లియోనెల్ మెస్సీని సన్మానించారు.

## పనితీరు భేష్

(మొదటి పేజీ తరువాయి)

ఫలకనుమా ప్యాలస్ వరకు రాహుల్ గాంధీతో కార్‌లో సిఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రయాణించారు. రాహుల్ గాంధీకి రాష్ట్రంలో ప్రభుత్వ పనితీరు, తాజా రాజకీయ పరిస్థితులను రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. ఇటీవల హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన తీరు, గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు ఘన విజయం సాధించిన వివరాలను రాహుల్ గాంధీకి సిఎం తెలియజేశారు.

ఎఐసిసి ఆదేశాల మేరకు ఈ నెల 14వ తేదీన ఢిల్లీ రామ్ లీలా మైదానంలో ఓట్ చోరీ అంశంపై జరిగే మహా ధర్నా కార్యక్రమానికి తెలంగాణ నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివస్తున్నట్లు రాహుల్ గాంధీ దృష్టికి టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తీసుకువచ్చారు. ఎఐసిసి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఓట్ చోరీకి వ్యతిరేకంగా సేకరించిన సంతకాల ఫామ్‌లను 2 రోజుల కింద హైదరాబాద్ నుంచి ప్రత్యేక వాహనంలో ఢిల్లీకి పంపినట్లు ఆయన రాముల్‌గాంధీకి తెలిపారు. ఈ విషయాలపై రాహుల్ గాంధీ స్పందిస్తూ ప్రబుత్వ, పార్టీ పనితీరు అభినందనీయమని, అయితే బిజెపి చేస్తున్న ఓట్ చోరీపై మరింత పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా, రాహుల్ గాంధీ బస చేసిన ఫలక్‌నుమా ప్యాలస్‌లో రాష్ట్ర మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు ఎంపిలు, ఎంఎల్‌ఎలు, పార్టీ నాయకులు రాముల్ గాంధీని కలిశారు.

## నేడు ర్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

సచిన్ పైలట్‌తో సహా అగ్ర నాయకులు ర్యాలీలో పాల్గొంటారు. పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ కూడా హాజరయ్యే అవకాశం ఉంది. సీనియర్ నాయకులందరూ పార్టీ ప్రధాన కార్యాలయమైన ఇందిరా భవన్‌లో సమావేశమై, అక్కడి నుండి బస్సులో రామ్‌లీలా మైదాన్‌కు వెళ్తారు. 'ఓట్ల దొంగతనం'కు వ్యతిరేకంగా పార్టీ సుమారు 5.50 కోట్ల సంతకాలను సేకరించిందని కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ తెలిపారు. 'ఓట్ల దొంగతనం' ఎలా జరుగుతోందో రాహుల్ జీ సాక్ష్యాలతో సహా నిరూపించారు... పత్రికా సమావేశాల వేదికగా తనతో చర్చకు రావాలని ఆయన హోంమంత్రికి సవాలు విసిరారని, కానీ హోంమంత్రి సమాధానం ఇవ్వలేదన్నారు. ఈ సమస్యను హైలైట్ చేయడానికి ఈనెల 14న కాంగ్రెస్ భారీ ర్యాలీ నిర్వహిస్తోందని వేణుగోపాల్ తెలిపారు. దేశ ప్రజలంతా ఓట్‌చోరీపై చర్చిస్తున్నారని, అందువల్ల దీనికి మరింత ఊపు తీసుకురావాలని భావిస్తున్నామన్నారు. ఈ ర్యాలీ అనతరం 5.5 కోట్ల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించడానికి రాష్ట్రపతితో సమావేశం అయ్యేందుకు అపాయింట్‌మెంట్ కోరామని చెప్పారు.

ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో వాడీవేడి చర్చ జరిగిన కొద్ది రోజులకే భారీ ర్యాలీను కాంగ్రెస్ చేపడుతోంది. ఈ చర్చలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్), ఇతర ఎన్నికల అవకతవకలపై ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. లోక్‌సభలో ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చలో పాల్గొన్న రాహుల్ గాంధీ, ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

ఆయన ప్రభుత్వానికి మూడు ప్రశ్నలు సంధించారు. 'భారతదేశ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయడానికి బిజెపి ఎన్నికల సంఘాన్ని (ఇసి) నిర్దేశిస్తూ తనకు అనుకూలంగా వాడుకుంటోందని పేర్కొన్నారు. ఎన్నికలకు ఒక నెల ముందుగా అన్ని పార్టీలకు మెషీన్ రీడబుల్ ఓటర్ల జాబితాలను అందించాలని, 45 రోజుల తర్వాత సిసిటివి ఫుటేజీని ధ్వంసం చేయడానికి అనుమతించే చట్టాన్ని రద్దు చేయాలని, ఇవిఎంలకు ప్రాప్యత కల్పించాలని, ఎన్నికల కమిషనర్లకు కోర్టు కేసుల నుంచి రక్షణను అనుమతిస్తున్న చట్టాన్ని మార్చాలని గాంధీ పిలుపునిచ్చారు. 'ఓటును నాశనం చేసినప్పుడు, ఈ దేశపు మూలస్తంభాలను కూడా నాశనం చేస్తారు, మీరు ఆధునిక భారతదేశాన్ని నాశనం చేస్తారు, భారతదేశం అనే భావనను నాశనం చేస్తారు' అని గాంధీ అధికార పక్షంపై విరుచుకుపడ్డారు.

### యునెస్కో జాబితాలో 157 దేశాల్లో

## 849 సాంస్కృతిక జీవన వారసత్వాలకు గుర్తింపు


**న్యూఢిల్లీ:** భారత్‌లో జరిగిన యునెస్కో (ఐక్యరాజ్యసమితి విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ) 20వ సమావేశాలు (డిసెంబరు 7–13) శనివారం నాటితో పూర్తయ్యాయి. దీంతో ఇప్పటివరకూ యునెస్కో ఇప్పటివరకూ 157 దేశాలలో ఉన్న 849 సాంస్కృతిక జీవన వారసత్వాలకు గుర్తింపు ఇచ్చింది. పురాతన కాలంలో నిర్మించిన మహోన్నతమైన కట్టడాలు, శిలాశాసనాలు, జీవన సంస్కృతులకు యునెస్కో గుర్తింపులు ప్రకటించింది. తరతరాలుగా కొనసాగుతున్న ప్రపంచ వైజ్ఞానిక, సాంస్కతిక, వారసత్వ సంప్రదాయ కళలు, కట్టడాల పరిరక్షణకు ఉద్దేశించిన యునెస్కో ఇంటర్ గవర్నమెంటల్ కమిటీ తదుపరి సమావేశాలకు వచ్చే ఏడాది డిసెంబరు నెలలో చైనాలోని గ్జియామెన్ నగరం ఆతిథ్యం ఇవ్వనున్నది. ఢిల్లీలోని ప్రపంచ వారసత్వ కట్టడమైన ఎర్రకోటలో మొదటిసాకి ఈ సమావేశాలు జరిగాయి.

ఈ సముదాయం ప్లీనరీ హాలులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పెవిలియన్‌లో శనివారం సాయంత్రం యునెస్కో సమావేశాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమం తర్వాత యునెస్కో సభ్యు లు దేశంలో ఉన్న ప్రకృతి దృశ్యా లు, వారసత్వ కట్టడాల పరిశీలనకు వెళ్ళారు. ప్రపంచ సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలను సంరక్షించేందుకు ఉద్దేశించి యునెస్కో నిర్వహించిన 2003 నాటి సదస్సు కార్యదర్శి ఫుమికో ఓహినట ముగిం పు సందేశం ఇస్తూ, మొఘల్ చక్రవర్తుల కాలానికి చెందిన ఎర్రకోట సముదాయం ఈ మహత్తరమైన సమావేశాలకు వేదికగా నిలిచిందన్నారు. మహోన్నతమైన రక్షణకు పేరుగా నిలిచిన భారీ గోడలకు ప్రసిద్ధి చెందిన ఎర్రకోటలో తమ కాలాన్ని ప్రతిక్షణం గొప్పగా గడిపామన్నారు. ఆ తర్వాత పిటిఐ వార్తాసంస్థ ప్రతినిధితో ఆమె మాట్లాడుతూ, భారతదేశంలో జరిగే సంప్రదాయ బద్ధమైన దీపావళి పర్వదినంతోపాటు మొత్తం 16 సాంస్కృతిక కేంద్రాలను యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రాంతాలుగా గుర్తించిందని చెప్పారు. వీటిల్లో ఇరాన్‌కు చెందిన పర్షియా నిర్మాణకళ మిర్రర్ వర్కు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన సంప్రదాయ కళారూపం, స్విట్జర్లాండ్‌లోని యోడెల్లింగ్‌లను కూడా యునెస్కో వారసత్వ ప్రాంతాలుగా గుర్తించినట్లు చెప్పారు. యునెస్కోకు ఈ సమావేశంలో దాదాపు 80 ప్రాంతాలు, వారస త్వ కట్టడాలు పరిశీలనకు వచ్చాయని, వారం రోజులుగా యునెస్కో కమిటీకిలో ఉన్న 24 దేశాల సభ్యులు 67 వారసత్వ కట్టడాలు, ప్రాంతాలకు సంబంధించిన విజ్ఞప్తులను పరిశీలించారని, వీటిల్లో 11 సాంస్కృతిక వారసత్వ అంశాలను తక్షణం సంరక్షించాల్సిన జాబితాలో చేర్చామని, 53 అంశాలను మానవ సంస్కృతికి సంబంధించిన జాబితాలో చేర్చామని, ఒక ప్రోగ్రామ్‌ను గొప్ప వారసత్వఅంశంగా ఉత్తమస్థాయిలో పరిరక్షిస్తున్న జాబితాలో ఉంచామని చెప్పారు.



ఈ ఏడాదిలో జరిగిన సమావేశాల తో కలిపి మొత్తం 157 దేశాలకు చెందిన 849 సాంస్కృతిక జీవన వారసత్వ నిర్మాణాలు, ప్రాంతాలను యునెస్కో జాబితాలో చేర్చినట్లయిందన్నారు. డిసెంబరు ఏడో తేదీన యునెస్కో 20వ సమావేశాలు ఢిల్లీలో మొదలయ్యాయి. విదేశీ వ్యవహారాలమంత్రి జైశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

## 'సెమికాన్'లో భారత్‌కు దక్కని చోటు



**వాషింగ్టన్ :** అమెరికా నేతృత్వంలోని తొమ్మిది దేశాల సెమీకండక్టర్ సరఫరా గొలుసు కూటమి (సెమికాన్)లో భారత్‌కు చోటు దక్కలేదు. అమెరికా నేతృత్వంలో ఏర్పడిన తొమ్మిది దేశాల సెమీకండక్టర్ (చిప్) సరఫరా గొలుసు కూటమిలో భారత్ భాగస్వామి కాలేదు. సెమీకండక్టర్లు (చిప్స్) మొబైళ్లు, కార్లు, కంప్యూటర్లు, రక్షణ పరికరాలు వంటి ఆధునిక సాంకేతిక రంగాలకు అత్యంత కీలకం. చిప్ తయారీ ప్రస్తుతం కొద్ది దేశాల చేతిలోనే ఉంది. ముఖ్యంగా చైనా, తైవాన్, దక్షిణ కొరియా, అమెరికా కీలక పాత్ర పోషిస్తున్నాయి. కాగా, చైనా మీద ఆధారపడటం తగ్గించేందుకు, భద్రమైన, విశ్వసనీయ సరఫరా గొలుసును నిర్మించాలనే లక్ష్యంతో అమెరికా కొన్ని దేశాలతో కలిసి ఈ కూటమిని ఏర్పాటు చేసింది. అయితే, భారత్ ఇప్పటికీ పూర్తిస్థాయి సెమీకండక్టర్ తయారీ సామర్థ్యం (ఎఫ్ఎబిఎస్) కలిగిన దేశం కాదు. చిప్ డిజైన్‌లో భారత్ బలంగా ఉన్నా, తయారీ రంగంలో ఇంకా అభివృద్ధి దశలోనే ఉంది. అందుకే ఈ ప్రత్యేకమైన తొమ్మిది దేశాల కూటమిలో భారత్‌ను చేర్చలేదు. సెమికాన్‌లో భాగస్వామి కాలేకపోయినప్పటికీ, భారత్ వివిధ మార్గాల్లో చిప్ తయారీ రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తోంది. భవిష్యత్తులో తయారీ సామర్థ్యం పెరిగితే, ఇటువంటి అంతర్జాతీయ కూటముల్లో భారత్‌కు చోటు దక్కే అవకాశం ఉంది. ఇలావుంటే, భారత్ స్వతంత్రంగా అమెరికా, జపాన్‌తో, యూరోప్ దేశాలతో ద్వైపాక్షికంగా సెమీకండక్టర్ సహకార ఒప్పందాలు కుదుర్చుకుంటోంది.

## మేం వ్యతిరేకం

(మొదటి పేజీ తరువాయి)

సమర్థవంతంగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. వీటిపై సమ్మిట్ లో నిపుణులు అనేక సలహాలు, సూచనలు ఇచ్చారని వివరించారు. ముఖ్యంగా ఏఐ టెక్నాలజీని నేరాలను కట్టడి చేయడానికి ఉపయోగించాలని చెప్పారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో దేశంలోనే అత్యధిక సైబర్ నేరాలు జరుగుతున్నాయని, రోజురోజుకు సైబర్ స్కామ్స్ పెరుగుతూ పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ ఫ్రాడ్ ద్వారా నేరస్తులు కేవడం సామాన్యుల డబ్బులే దోచుకోవడం లేదని, ఐఎఎస్ అధికారులు, జడ్జీల వంటి ఉన్నత స్థాయిల్లో ఉన్న వారిని కూడా మోసం చేస్తున్నారని వివరంచారు. ఏఐ సహకారంతో సృష్టించిన ఫేక్ వీడియోలు కూడా సామాజిక మాధ్యమాల్లో చెలామణి చేస్తున్నారని అన్నారు. వీటన్నింటినీ ఏఐ టెక్నాలజీని వినియోగించుకొని అరికట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సాంకేతికత వల్ల అందరికీ లాభం జరగాలని ఆకాంక్షించారు.

**ఎస్ఆర్‌సి కాదు ఎన్ఆర్‌సి : అఖిలేష్ యాదవ్**

ఉత్తర్ ప్రదేశ్‌లో బిజెపి ప్రభుత్వం చేపడుతున్నది ఎస్ఐఆర్ కాదని, ఇది జాతీయ పౌరుల నమోదు (ఎన్ఆర్‌సి) ప్రక్రియ అని అఖిలేష్ యాదవ్ విమర్శించారు. ఎన్ఆర్‌సిని నేరుగా చేపట్టలేక ప్రభుత్వం ఎస్ఐఆర్ ను వాడుకుంటున్నదని, ఎన్ఆర్‌సికి ఎన్ని పత్రాలు అడుగుతారో ఎస్ఐఆర్ కి అన్ని పత్రాలు అడుగుతున్నారని అన్నారు. ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో గెలవడానికే బీజేపీ ఎస్ఐఆర్ చేపడుతోందని ఆరోపించారు.యుపిలోదాదాపు 25 కోట్ల జనాభా ఉందని ప్రభుత్వం చెబుతోందని, ఎస్ఐఆర్ ద్వారా బిజెపి ప్రభుత్వం సుమారు 3 కోట్ల ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తుందన్నారు. సాంకేతికతను సరిగ్గా వినియోగించుకోకపోవడం వల్ల అనేక ఓట్లు పోతున్నాయని చెప్పారు. బూత్ స్థాయి అధికారులకు కూడా శిక్షణ ఇవ్వలేదని, దీంతో క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లు, సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఓటు హక్కు కల్పించడం ఎన్నికల సంఘం బాధ్యత కానీ ఓట్లు తొలగించడం కాదని స్పష్టం చేశారు. తాము ఇండియా కూటమిలోనే కొనసాగుతమని పునరుద్ఘాటించారు.

## తప్పేముంది? (మొదటి పేజీ తరువాయి)

అన్నారు. 'నిర్మల్ భారత్ అభియాన్‌ను స్వచ్ఛ భారత్ అభియాన్‌గా, గ్రామీణ ఎల్‌పిజి పంపిణీ కార్యక్రమాన్ని ఉజ్వల్‌గా మార్చారని, రీప్యాకేజింగ్, బ్రాండింగ్‌లో నిపుణులు అని ఆయన ఆయన పిటిఐకి తెలిపారు. 'వారు పండిట్ నెహ్రూను ద్వేషిస్తారు, కానీ ఇప్పుడు మహాత్మా గాంధీని కూడా ద్వేషిస్తున్నట్లు అనిపిస్తోంది. మహాత్మా గాంధీ పేరులో ఉన్న తప్పు ఏమిటి? మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును పూజ్య బాపు ఉపాధి హామీ పథకంగా ఎందుకు మార్చాలి? అని రమేష్ ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకం పేరు మార్చడానికి, పని దినాల సంఖ్యను పెంచడానికి సంబంధించిన బిల్లుకు కేంద్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోదం తెలిపిందని వర్గాలు తెలిపాయి. ఈ పథకానికి ఇప్పుడు 'పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజన' అని పేరు మార్చనున్నారు. దానికింద పని దినాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 100 రోజుల నుండి 125 రోజులకు పెంచనున్నారు. కాగా, కాంగ్రెస్ మరో ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ, ఒకప్పుడు ఎంజిఎన్ఆర్‌ఇజిఎను 'వైఫల్యాల స్మారక చిహ్నం' అని పిలిచిన ప్రధాని, ఇప్పుడు ఈ విప్లవాత్మక పథకానికి క్రెడిట్ పొందడం కోసం దాని పేరు మారుస్తున్నారని మండిపడ్డారు. దేశ ఆత్మ నుంచి మహాత్మాగాంధీ పేరును తొలిగించేందుకు ఈ చర్యను మరో మార్గంగా బిజెపి సర్కార్ ఎన్నుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఈ పథకానికి ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చడానికి చేసిన ఒక పైపై మార్పు తప్ప ఈ చర్య మరేమీ కాదని వేణుగోపాల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎంజిఎన్ఆర్‌ఇజిఒ కార్మికులు అధిక వేతనాలు డిమాండ్ చేస్తున్నారని, అయితే కేంద్రం ఏటా ఈ పథకానికి కేటాయించే నిధులను తగ్గిస్తోందన్నారు. మరోవైపు పథకం కింద కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోతూనే ఉన్నాయని, ఈ పథకాన్ని నెమ్మదిగా ఖూనీ చేసేందుకు ఆచితూచి వేస్తున్న ప్రణాళిక వ్యూహంలా కనిపిస్తోందన్నారు. వాస్తవానికి, ఈ ప్రభుత్వానికి సంక్షేమాన్ని అందించాలనే ఉద్దేశం లేదని, కేవలం నటిస్తోందన్నారు. 'కానీ మిస్టర్ మోదీ, మీకు కావలసినంత పేరు మార్చుకోండి, ఈ పరివర్తన పథకాన్ని భారతదేశంలోని ప్రతి గ్రామానికి తీసుకువచ్చింది డాక్టర్ మన్మోహన్ సింగ్ జీ, సోనియా గాంధీ జీ అని ప్రజలకు తెలుసు' అని వేణుగోపాల్ గుర్తుచేశారు.

**పేరు మార్చితే ఖర్చు తప్ప ఏం లాభం? : ప్రియాంక**

ఉపాధిహామీ పథకం పేరు మార్చడం వల్ల ప్రజలకు చేకూరే ప్రయోజనమేంటని కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును 'పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజన'గా మార్చడం వల్ల డబ్బులు ఖర్చు తప్ప మరే ఉపయోగం లేదని విమర్శించారు. వంద రోజులు ఉపాధి కల్పించి పేదల జీవన ప్రమాణాలను మెరుగు పరచడం కోసం ఆ కార్యక్రమం ఎన్నో ఏళ్లుగా అమల్లో ఉందని గుర్తు చేసారు. కానీ ఇప్పుడు పేరు మార్చాల్సిన అవసరం ఏంటో తనకు అర్థం కావట్లేదని అన్నారు. పథకం పేరు మార్చడం వల్ల కార్యాలయాలు, వస్తువులపై ఇప్పటికే ముద్రించిన పేరు మార్చాల్సి వస్తుందని చెప్పారు. ఇది ఖరీదైన ప్రక్రియ అని, చాలా డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రేవంత్ రెడ్డి ఈ తరానికి రోబో



ప్రజాపక్షం/హైదరాబాద్: గ్లోబల్ సమ్మిట్‌తో రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని పెంచారని, గత పదేళ్లలో జరగని అభివృద్ధిని కేవలం రెండు ఏళ్లలో చేసి చూపారని, ఆయన ఈ తరానికి రోబో అని టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ అన్నారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రెండు ఏండ్ల ప్రజా పాలనకు గ్రామ పంచాయతీ ఎన్నికలు పట్టం కట్టాయని, రేవంత్ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందని తెలిపారు. 75ఏళ్ల నుండి ఉమ్మడి రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని సాహసం రేవంత్‌రెడ్డి చేశారని, అలాంటి నాయకుడిపై బిఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం సిగ్గు చేటని మండిపడ్డారు. సిఎం పర్యటన తో ఒయు ప్రతిష్ట పెరిగిందని, రేవంత్ రెడ్డి ఆడుతున్న ఫుట్ బాల్ గేమ్ వీక్షించడానికి రాహుల్ గాంధీ రావడం స్ఫూర్తిని నింపిందన్నారు. ప్రస్తుతం ఇండియాలోనే తెలంగాణ బెస్ట్ రాష్ట్రంగా నిలిచిందని, మరో పదేళ్లలో సింగపూర్‌ల తెలంగాణ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.



## విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి


ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యారంగంలో సమూల మార్పులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బ్రెయిన్ ఫీడ్ గ్రూప్ ఆధ్వర్యంలో హైటెక్స్‌లో నిర్వహించిన ఇటి టెక్ఎక్స్ – 6వ ఎడిషన్ కార్యక్రమానికి శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన రెండేళ్లలో విద్యారంగాన్ని అత్యున్నత ప్రాధాన్యత అంశంగా గుర్తించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అనే లక్ష్యంతో ప్రభుత్వం పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని చెప్పారు. పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధి నుంచి ఉపాధ్యాయుల భర్తీ, డిజిటల్ లెర్నింగ్, స్కిల్ ఎడ్యుకేషన్ వరకు విద్యారంగంలోని ప్రతి దశలో సమగ్ర మార్పులు తీసుకువస్తున్నామని మంత్రి తెలిపారు. వేగంగా మారుతున్న విద్యా ప్రపంచంలో ఈటీ టెక్ ఎక్స్ వంటి వేదికలు అత్యంత అవసరమని,టెక్నాలజీ–విద్య కలిసి భవిష్యత్తును ఎలా నిర్మించాలి అనే అంశంపై ఆలోచించేందుకు, చర్చించేందుకు ఇవి దిశానిర్దేశం చేస్తున్నాయని అన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థులందరూ ఒకే క్యాంపస్‌లో అన్ని సౌకర్యాలతో కలిసి చదువుకునేలా105 అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.2100 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు. ఈ యూనివర్సిటీ ఈ సంవత్సరం నుంచే స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను ప్రారంభించనుందని,పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చి యువతకు తక్షణ ఉపాధి కల్పించడమే లక్ష్యమని అన్నారు. అదే విధంగా యువత పరిశ్రమలకు తగిన నైపుణ్యాలు నేర్చుకునేలా ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. విద్యతో పాటు క్రీడలకు విశేష ప్రాధాన్యత ఇస్తోస్తున్నామన్నారు.ఈ లక్ష్యంతో స్పోరట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం ద్వారా తెలంగాణను క్రీడల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఇది చారిత్రాత్మక ముందడుగు అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు.


## భూమి అన్యాక్రాంతం కారాదు

ప్రజాపక్షం/హైదరాబాద్ : యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్‌లోని నాలుగు ఎకరాల భూమిని అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. సర్వే నంబర్ 859, 860లోని విలువైన నాలుగు ఎకరాల భూమిని ప్రైవేట్ పార్టీల వశం కాకుండా చేయాలంది. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో హాస్టళ్లు, పాఠశాల భవనాలు, ఆట స్థలాలు, ఇతర సౌకర్యాలకు మాత్రమే ఆ భూమిని వినియోగించాలని ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్, మోత్కూర్ మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేసింది. మినీ స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణం కోసం ఏ.రవికుమార్ మరొకరు ఆరు ఎకరాలను దానంగా ఇచ్చారు. అందులో రెండు ఎకరాలను వినియోగంలోకి తెచ్చారు. మిగిలిన నాలుగు ఎకరాలను తమకు ఇచ్చేయాలంటూ వారిద్దరూ పిటిషన్ వేయగా గతంలో సింగిల్ జడ్జి అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చారు. దీనిని సవాల్ చేస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ విచారించింది. మిగిలిన నాలుగు ఎకరాల భూమిని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల అవసరాలకు మాత్రమే వినియోగించాలంది. ప్రైవేట్ వ్యక్తుల వశం కారాదని చెప్పింది. భూమి అన్యాక్రాంతం కాకుండా కంచె వేయాలని అధికారులను ఆదేశించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేసింది. అప్పీల్‌తో పాటు ఇదే అంశంపై దాఖలైన పిల్‌ను డివిజన్ బెంచ్ విచారణకు అనుమతించింది.

# నీలం రాజశేఖర్ రెడ్డికి సిపిఐ ఘన నివాళి

● సిఆర్ ఫౌండేషన్‌లో 31వ వర్ధంతి వేడుకలు ● పూలమాలలు వేసి నివాళులు అర్పించిన కె.నారాయణ, పల్లా వెంకట్ రెడ్డి





ప్రజాపక్షం/శేరిలింగంపల్లి /హైదరాబాద్: స్వాతంత్ర్య సమరయోధులు, సిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపనలో ప్రముఖులు కీర్తిశేషులు నీలం రాజశేఖర్ రెడ్డి 31వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్, కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర్ రెడ్డి రిసెర్చ్ సెంటర్‌లో ఘనంగా నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కె.నారయణ, సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, జాతీయ కార్యదర్శి పల్లావెంకట్ రెడ్డిలు విచ్చేసి నీలం రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కె.నారయణ మాట్లాడుతూ నీలం రాజశేఖర్ రెడ్డి కమ్యూనిస్టు నిబద్ధతతో ఉన్న ఉన్నతమైన కుటుంబం నుంచి వచ్చినప్పటికీ అలనాటి భారత దేశ అధ్యక్షులు నీలం సంజీవ రెడ్డి స్వయాన సోదరుడైనప్పటికీ వారు కమ్యూనిస్టు పార్టీ సమున్నతికి నిర్విరామం గా కృషి చేశారని తెలిపారు. ముఖ్యంగా కమ్యూనిస్టు పా ర్టీలో యువకులను, మేధావులను ప్రోత్సహించారని వక్త లు రాజశేఖర్ రెడ్డి సేవలను గుర్తు చేసుకున్నారు. నీలం రాజశేఖర్ రెడ్డి చంద్ర రాజేశ్వరరావుతో పాటు ఢిల్లీ కేం ద్రంగా సిపిఐ జాతీయ కార్యదర్శిగా చాలా సంవత్సరా లు పనిచేసి రిటైర్డ్ అయిన తర్వాత హైదారాబాద్ వచ్చారని నీలం రాజశేఖర్ రెడ్డి విద్యార్థులను, యువకులను, పార్టీలో వారిని ప్రోత్సహించారని తెలిపారు. సిఆర్ ఫౌం డేషన్ ఉపాధ్యాక్షులు , నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెం టర్ కన్వీనర్ కుంభంపాటి అజయ్ కుమార్ వందన స మర్పణ చేశారు.

కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి , మాజీ శాసనమండలి సభ్యులు పిజే చంద్రశేఖర్ రావు, సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి వి. చెన్నకేశవరావు, మహిళా సంక్షేమ కేంద్ర సభ్యులు జోత్స్న, లలిత, ప్రజా నాట్యమండలి గాయని శ్రీమతి నళిని, సిపిఐ తెలంగాణ రాష్ట్రసమితి సభ్యులు రామకృష్ణ, అశ్రమవాసులు, ఉమెన్ ఎంపవర్మెంట్ సెంటర్ విద్యార్థినిలు, సిఆర్ పాలిక్లినిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మఖ్దూంభవన్‌లో...

సిపిఐ ప్రముఖ నాయకులు నీలం రాజశేఖర్ రెడ్డికి ఘన నివాళ్లు అర్పించారు. నీలం రాజశేఖర్ రెడ్డి 35వ వర్ధంతి సందర్భంగా హైదరాబాదులోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నీలం రాజశేఖర్ రెడ్డి భూస్వామ్య కుటుంబంలో పుట్టి పెద్ద చదువులు చదివి కమ్యూనిస్టుగా రూపాంతరం చెందిన తర్వాత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలో ఒకరయ్యారన్నారు. మదనపల్లిలో చదివి, బనారస్ యూనివర్సిటీలో తరిమెల నాగిరెడ్డి, చంద్ర రాజేశ్వరరావుతో కలిసి చదువుకున్నారన్నారు. జిల్లా పార్టీ కార్యదర్శిగా పనిచేస్తున్న కాలం నాటి నుండి కూడా పార్టీ ఆర్గనైజేషన్ కొరకు కృషి చేశారని, పార్టీ రెండుగా చీలిపోయినప్పుడు ఆయన రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా అనేక సవాళ్లను అధిగమించి పార్టీని ముందుకు నడిపారన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ కార్యదర్శిగా భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. పార్టీ సైద్ధాంతికంగా ఎదగడానికి రాజకీయ పాఠశాలలకు ప్రాధాన్యత ఇచ్చేవారని తెలిపారు.

జర్మనీ, అర్జెంటీనా, రష్యా దేశాలలో క మ్యూనిస్టులు అధికారంలో ఉన్న కాలంలో భారతదేశం నుండి ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, కమ్యూనిస్టు నాయకుల ను ఆయా దేశాలకు పంపించి రాజకీయ శిక్షణ ఇప్పిచ్చేవారన్నారు. ప్రస్తుతం మతోన్మోద శక్తులు కేంద్రంలో అ ధికారంలో ఉన్న ఈ తరుణంలో మన పార్టీ సైద్ధాంతికం గా తయారు చేసుకోవడానికి రాజకీయ పాఠశాలలో ఏర్పాటు, కార్యకర్తలను తయారు చేసుకోవడానికి నీలం రాజశేఖర్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ముందుకెళ్లాలని, ఆయన ఆశయాలు సాధించాలన్నారు.

## అఖిలేష్‌తో బిసి సంఘాల భేటీ

### పార్లమెంట్‌లో బిసి రిజర్వేషన్ల బిల్లు అంశాన్ని లేవనెత్తండి : జాజుల శ్రీనివాస్‌గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : దేశవ్యాప్తంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి రిజర్వేషన్లపై విధించిన 50 శాతం పరిమితిని ఎత్తివేసేలా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని, అలాగే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో బిసి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ చేసిన చట్టాన్ని ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదించేలా సమాజ్‌వాది పార్టీ తరపున పోరాడాలని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివా స్ గౌడ్, సమాజ్ వాదీ పార్టీ జాతీయ అధ్యక్షులు యుపి మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌ను కోరారు. తెలంగాణ పర్యట నకు విచ్చేసిన అఖిలేష్ యాదవ్‌ను శనివారం హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, క న్వీనర్ పెరిక సురేష్, కనకల శ్యాం కురుమ, శేఖర్ సగర లతో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ అఖిలేష్ యాదవ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసి ప్రధానమంత్రి కొనసాగుతున్న దేశంలో 70 కోట్ల మంది బిసిలకు న్యాయం జరగడం లేదని, బిసిలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచడం లేదని, బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించడం లేదని మండిపడ్డారు. కాగా బిసిల డిమాండ్ న్యాయ సమ్మతమైనదని, బిసి రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచాల్సిన అవసరం ఉందని, తమ పార్టీ తరఫున పార్లమెంట్‌లో మాట్లాడుతామని, దేశవ్యాప్తంగా జరుగుతున్న బిసి ఉద్యమానికి సమాజ్ వాదీ పార్టీ కూడా భాగస్వామ్యం అవుతుందని అఖిలేష్ యాదవ్ బిసి నేతలకు హామి ఇచ్చారు. ఈ సమావేశంలో బిసి జెఎసి కన్వీనర్ జాజుల లింగం గౌడ్, వేముల రామకృష్ణ, గూడూరు భాస్కర్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ స్టేడియంలో 'పుస్తకాల పండుగ'



● ఈ నెల 19 నుంచి 29 వరకు 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రాంగణం పేరు 'ప్రజాకవి అందెశ్రీ'గా నామకరణం

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ సాహిత్య, సాంస్కృతికప్రియుల కోసం 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని సొసైటీ అధ్యక్షులు యాకూబ్ తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆర్.వాసు, ఉపాధ్యక్షులు బాల్‌రెడ్డి, బి.శోభన్‌బాబు, సహాయ కార్యదర్శులు కె.సురేష్, ఎం.సూరిబాబు, కోశాధికారి నారాయణరెడ్డి కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 29 వరకు మొత్తం 11 రోజుల పాటు (ప్రతిరోజు మధ్యాహ్నం 1 గంట నుంచి 9 గంటల వరకు) ఎన్‌టిఆర్ స్టేడియం(ఇందిరాపార్క్ వద్ద) లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 38వ బుక్‌ఫెయిర్ ప్రాంగణంకు ప్రజాకవి అందెశ్రీ, పుస్తకావిష్కరణ వేదికకు కొంపల్లి వెంకట్‌గౌడ్, రచయితల స్టాల్స్‌కు ప్రొఫెసర్ ఎస్.వి.రామారావు, మీడియా స్టాల్స్‌కు స్వేచ్ఛ వొటార్కార్ నామకరణం చేశామని పేర్కొన్నారు. బుక్ ఫెయిర్ ప్రాంగణంలో పుస్తక విక్రయాలతో పాటు, ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు, రచయితలతో సమావేశాలు, పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యార్థులకు ఉచిత ప్రవేశ సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు. సందర్శకుల సౌకర్యార్థం ఆర్‌టిసి బస్సుల సౌకర్యం కల్పించాలని ఆర్‌టిసి ఎండికి వినతి చేశామన్నారు. పుస్తకం విశిష్టత, దాని ప్రాముఖ్యతను సమాజానికి తెలియజెప్పడంతో పాటు మంచి సమాజాన్ని నిర్మించడమే తమ లక్ష్యమని, తెలంగాణ ప్రజలు, పుస్తక ప్రియులు, విద్యార్థులు ఈ ప్రదర్శనను సందర్శించి విజయవంతం చేయాలని యాకూబ్ కోరారు.

## మంత్రాల నెపంతో దారుణ హత్య

### నిర్మల్ జిల్లాలో దారుణం, ఇద్దరు నిందితుల అరెస్ట్





ప్రజాపక్షం/ఖానాపూర్ : కడెం మండలంలోని మూఢనమ్మకాలు, క్షుద్రపూజల భయం మరోసారి ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. నిర్మల్ జిల్లా కడెం మండలం, ఉడుంపూర్ పంచాయతీ పరిధిలోని గండి గోపాల్‌పూర్ గ్రామంలో చోటుచేసుకున్న ఈదారుణ ఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దేశినేని భీమయ్య(55) అనే వృద్ధుడిని ఇద్దరు వ్యక్తులు అత్యంత కిరాతకంగా హత్య చేసి, మృతదేహాన్ని రహస్యంగా దహనం చేశారు. తమ కుటుంబ సభ్యురాలి అనారోగ్యానికి మంత్రా లే కారణమని భ్రమపడటం ఈ హత్యకు దారితీసింది.

### నిందితులు దొరికింది ఇలా

ఈ కేసు వివరాలను అడిషనల్ ఎస్‌పి ఉపేందర్ రెడ్డి శనివారం మీడియాకు వెల్లడించారు. గండి గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన మూతి నరేష్, మూతి మల్లేష్ అనే ఇద్దరు అన్నదమ్ములు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల తల్లి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా అమెకు ఆరోగ్యం కుదుటపడక పోవడంతో, స్థానికంగా నివసించే భీమయ్య మంత్రాలు చేస్తున్నందునే ఇలా జరుగుతుందని వారు అనుమానించారు. ఈ పాత కక్షతో రగిలిపోయిన నరేష్, మల్లేష్ పథకం ప్రకారం భీమయ్యను ఒంటరిగా అదును చూసి పట్టుకున్నారు. అతి కౄరంగా కర్రలతో కొట్టి భీమయ్య ప్రాణాలు తీసిన నిందితులు, తమ నేరాన్ని దాచిపెట్టేందుకు మృతదేహాన్ని ఎవరికీ తెలియకుండా దహనం చేశారు. అయితే, కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేసిన పోలీసు బృందం, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను గుర్తించి, వారిని పట్టుకున్నారు. హత్యకు పాల్పడిన మూతి నరేష్, మూతి మల్లేష్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు, వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు అడిషనల్ ఎస్‌పి ఉపేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంత్రాల నెపంతో గ్రామీణ ప్రాంతాల్లో హత్యలు జరగడం చాలా దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

### మూఢనమ్మకాలు నమ్మొద్దు : ఎఎస్‌పి

మంత్రాలు క్షుద్రవిద్యలు వంటివి అవాస్తవాలు, అలాంటివి ఎక్కడా లేవు, ఇవన్నీ కేవలం మూఢనమ్మకాలు మాత్రమే, ప్రజలు ఇలాంటి పాత ఆలోచనలను నమ్మి అమాయకుల ప్రాణాలు తీయవద్దు, అనవసరంగా నష్టపోవద్దు, ఎవరికైనా అనారోగ్యం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. మూఢనమ్మకాలపై ప్రజలు చైతన్యం పెంచుకోవాలి'' అని ఉపేందర్‌రెడ్డి ప్రజలకు గట్టిగా హెచ్చరించారు. మూఢనమ్మకాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కేసు విచారణలో, నిందితుల అరెస్టులో ఖానాపూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సిహెచ్.అజయ్ కుమార్, కడెం ఎస్సై, ఇతర పోలీసు సిబ్బంది కీలక పాత్ర పోషించారు.

## అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా అరెస్టు

### వంద మంది మాదకద్రవ్య వినియోగదారులు గుర్తింపు



ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్‌లో డ్రగ్స్ సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టయింది. టాస్క్ ఫోర్స్ పోలీసులు, లంగర్ హౌస్ పోలీసులతో కలిసి సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో భారీగా నిషేధిత డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ డిసిపి వైభవ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ముఠాకు చెందిన ప్రధాన నిందితుడు వైకుంఠరావుతో సహా మొత్తం ఐదుగురిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 5 కిలోల హాష్ ఆయిల్ , 5 కిలోల గంజాయి, డ్రగ్స్ రవాణాకు ఉపయోగించిన ఒక ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వైకుంఠరావు ఒడిశాలో డ్రగ్స్‌ను కొనుగోలు చేసి, వాటిని హైదరాబాద్ నగరంలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ అరెస్టు కేవలం సరఫరాదారులకే పరిమితం కాలేదు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా, డ్రగ్స్ వినియోగదారుల నెట్‌వర్క్‌పై కూడా పోలీసులు దృష్టి సారించారు. డిసిపి వైభవ్ మాట్లాడుతూ, ఈ ముఠా నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసిన దాదాపు వంద మంది డ్రగ్స్ కన్జ్యూమర్స్‌ను గుర్తించినట్లు తెలిపా రు. ఈ స్థాయిలో వినియోగదారులను గుర్తించడం అనేది నగరంలో డ్రగ్స్ వ్యాప్తి ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తోంది. ఈ కేసుపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది, డ్రగ్స్ చైన్‌ను పూర్తిగా ఛేదించేందుకు, వినియోగదారులపై కూడా కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.



## భారత్ ఫ్యూచర్ సిటీ ఎక్స్‌పోకు భారీగా ప్రజాదరణ

### విజయవంతంగా ముగిసిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'

ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8,9 తేదీలలో నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' విజయవంతంగా ముగిసింది. జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో, భారత్ ఫ్యూచర్ సిటీ ఎగ్జిబిషన్ జోన్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ జోన్ ద్వారా 2047 వరకు తెలంగాణ రాష్ట్రం లక్ష్యంగా పెట్టుకున్న దీర్ఘకాలిక మౌలిక వసతులు, పెట్టుబడులు, ఆవిష్కరణల దిశను అధునాతన సాంకేతికత, ఇమర్సివ్ స్టోరీటెల్లింగ్ ద్వారా ప్రజలకు పరిచయం చేసింది. సమ్మిట్ విజయవంతంగా ముగిసిన అనంతరం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ విద్యార్థులు, సాధారణ ప్రజల కోసం మొత్తం ఎక్స్‌పో ప్రాంతాన్ని తెరిచి ఉంచింది. దీనివల్ల సందర్శకులు రాష్ట్రం చేపట్టిన భవిష్యత్ దృష్టిగల అభివృద్ధి కార్యాచరణను ప్రత్యక్షంగా చూసే అవకాశం లభించారు. ఎక్స్‌పో ప్రారంభమైనప్పటి నుండి ప్రతిరోజూ వేలాది మంది సందర్శకులు భారత్ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్, భవిష్యత్తు పట్టణ లేఅవుట్లు, మొబిలిటీ వ్యవస్థలు, పర్యావరణ కారిడార్లు, నెక్స్ట్‌జెనరేషన్ గ్లోబల్ సిటీ నిర్మాణంలో ప్రభుత్వ దీర్ఘకాలిక వ్యూహాన్ని పరిశీలించారు.

### ప్రజా ఆకర్షణగా నిలిచిన ఎక్స్‌పో



అధునాతన సాంకేతికత, విజువల్ స్టోరీ టెల్లింగ్, ఇంటరాక్టివ్ ఎఐ, తదుపరి తరం పట్టణ ప్రణాళిక కాన్సెప్టులు గ్లోబల్ సమ్మిట్ ఎగ్జిబిషన్‌ను ప్రత్యేకంగా నిలబెట్టాయి. తెలంగాణ ప్రభుత్వ భారత్ ఫ్యూచర్ సిటీ దృష్టిని అన్ని వర్గాల ప్రజలకు సులభంగా, అందుబాటులో ఉండేలా, ప్రేరణాత్మకంగా ఈ ఎగ్జిబిషన్ విజయవంతంగా మార్చింది.

## సొసైటీ అక్రమాలపై విచారణ జరపాలి

### గచ్చిబౌలి ఇళ్ల స్థలాల సాధన కమిటీ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : భాగ్యనగర్ టిఎన్‌జిఒ హౌసింగ్ సొసైటీలో జరిగిన కోట్లాది రూపాయల నిధుల అక్రమాలపై న్యాయ విచారణ జరపాలని గచ్చిబౌలి ఇళ్ల స్థలాల సాధన కమిటీ అధ్యక్షులు ఎస్.పాండురంగరావు, కార్యదర్శి బి.నర్సింగ్‌రావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఈ సొసైటీ నేతలు నిబంధనలను తుంగలో తొక్కి అనేక అక్రమాలకు పాల్పడ్డారన్నారు. దొడ్డిదారిన సొసైటీలో సభ్యత్వం ఇవ్వడంతో పాటు హౌసింగ్ ప్లాట్లు కూడా కేటాయించారని ఆరోపించారు. 2009 నాటికి ఉన్న సీనియారిటీ ప్రకారం అర్హులైన ఉద్యోగులకు హౌసింగ్ ప్లాట్ల కేటాయింపు జరగేలా చర్యలు తీసుకోవాలన్న అభ్యర్థించారు. ఇప్పటికే ఈ సొసైటీపై పలు కేసులు నమోదు అయ్యాయని, అక్రమ సభ్యత్వాలు, అసలు లబ్ధిదారులను నిర్లక్ష్యం చేయడంపై వెంటనే విచారణ జరిపించాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.1991–92లో ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా గోపన్నపల్లిలో సర్వే నెంబర్లు 36,37లో 477 ఎకరాలు ఉద్యోగుల హౌసింగ్ కోసం రిజర్వ్ చేశారన్నారు. అందులో ఎపిఎన్‌జిఒకు 189.11 ఎకరాల కేటాయించారన్నారు. గతంలో ఈ విషయంపై రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్‌ఛైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల అర్హత పరిశీలించి జాబితా తయారు చేయాలి, ఆ జాబితాను జిఏ (ఎస్‌డబ్ల్యూ) శాఖ ఆమోదించాలి, ఆమోదిత జాబితా ప్రకారం ప్లాట్లు కేటాయించాలి, ఈ ప్రక్రియను సొసైటీ అమలు చేయలేదన్నారు. ఎపిఎన్‌జిఒ అందజేసిన 7030 మంది తాత్కాలిక లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వం ఆమోదించిందన్నారు. ఈ జాబితానే తుది జాబితాగా పరిగణించాలన్నారు. సీనియారిటీ ప్రకారం కాకుండా అన్యాయంగా లాటరీ ద్వారా ప్లాట్ కేటాయింపులు చేశారని ఆరోపించారు. సొసైటీపై 40కి పైగా కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. అక్రమంగా కొత్తగా 1500 అనర్హ సభ్యులను సొసైటీలో చేర్చుకున్నారని ఆరోపించారు.వారి నుంచి రూ. 25,000 రూ. 1,50,000 వరకు డబ్బులు వసూలు చేశారని, మొత్తం రూ. 34 కోట్లు వసూలు చేసి, రూ. 18 కోట్ల దుర్వినియోగం చేశారని వారు ఆరోపించారు. దీనిపై ఇప్పటికే తాము ఎసిబి అధికారులకు సైతం ఫిర్యాదు చేశామని తెలిపారు. నకిలీ జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించి ఖాళీ రిజిస్టర్‌లో సంతకాలు చేసుకుని, ఆ తరువాత మినిట్స్ వారికి అనుకూలంగా రాసుకుని తీర్మాణాలను ఆమోదించుకుంటున్నారన్నారు. 2019లో కొత్త అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ గౌడ్ నిధులను భారీగా దుర్వినియోగం చేశారని వారు ఆరోపించారు. గతంలో ఈ సొసైటీపై హైదరాబాద్ సిసిఎస్‌లో 81/2013 కేసు కూడా నమోదు అయ్యిందని గుర్తు చేశారు. ఐఒబి ఆబిడ్స్ శాఖలో ఉన్న సొసైటీ భ్యాంక్ ఖాతాలో ఉన్న నిధులను దుర్వినియోగం చేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. 7030 మంది ప్రభుత్వం ఆమోదించిన లబ్ధిదారుల జాబితాను పునఃపరిశీలించాలన్నారు.

## ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

### అదనపు కలెక్టర్ భాస్కరరావు

**ప్రజాపక్షం/బీబీనగర్ :** రెండో విడత మండలంలోని 31 గ్రామపంచాయతీలకు నేడు జరగనున్న ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అనంతరం ఏర్పాట్లను పరిశీలించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరపాలని మండలంలో మొత్తం 34 గ్రామ పంచాయతీల గాను మూడు పంచాయతీలు సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మిగతా 31 గ్రామపంచాయతీలో నేడు ఎన్నికలు జరగనున్నాయని అందుకోసం 256 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఎన్నికల్లో మొత్తం ఓటర్లు పురుషులు 21,299, స్త్రీలు 21,577 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఉదయం 7.00 గంటల మద్యాహ్నాన 1.00 వరకు పోలింగ్ జరుగుతుంది. అనంతరం మద్యాహ్నాన 2.00 ఓట్లు లెక్కింపు ప్రారంభమై సాయంత్రం వరకు ఫలితాలు ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి రాజస్వ మండలాధికారి కృష్ణారెడ్డి, తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీడీవో వై.శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు బ్యాండ్ సెట్



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** నల్లగొండ జిల్లా మర్రిగూడెం మండలం, లెంకలపల్లి గ్రామానికి చెందిన 5వ తరగతి విద్యార్థిని కొమ్ము లాస్య తండ్రి కొమ్ము శ్రీశైలం శనివారం అడ్డగూడూరు సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో రూ.35 వేల విలువ గల బ్యాండ్ సెట్ పాఠశాలకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీ, పాఠశాల ఉపాధ్యాయులు, పిఈటిలు జ్యోతి, అశ్విని, అమ్మ ఆదర్శ ఫౌండేషన్ చైర్మన్ యర్రోళ్ల సురేష్, బొబ్బలి యాదగిరి, సూరారం భాస్కర్, కుడుతాల అశోక్, జిల్లా రాజేందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## ‘పద్మశాలి చేనేత ఆణిముత్యాలు’ పుస్తకావిష్కరణ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాకు చెందిన ప్రముఖ కవి రచయిత పున్నమి అంజయ్య రచించిన పద్మశాలి చేనేత ఆణిముత్యాలు పుస్తకావిష్కరణ శనివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పుస్తకావిష్కర్త ప్రముఖ కథా రచయిత తత్వవేత్త తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బిఎస్ రాములు, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి,ప్రముఖ చరిత్రకారుడు పరిశోధకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, ప్రముఖ రచయిత్రి జూపాక సుభద్ర, ప్రముఖ రచయిత్రి జాజుల గౌరీ, అడ్వకేట్ వనం దుష్యంతల, కర్నాటి మనోహర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఎస్ రాములు మాట్లాడుతూ వెనుక బడిన పద్మశాలి చేనేత కులంలోని ఆణిముత్యాల గురించి సాహిత్యంలో మరుగున పడిన మాణిక్యాలను వెలికితీసి వాళ్ళ చరిత్రను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన చేనేత కళాకారుల గురించి చక్కగా వివరించిన పున్నమి అభినందనీయులని కొనియాడారు.

## సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

### విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వి దాసేశ్వర రావు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** కొత్త ఆవిష్కరణల దృష్ట్యా ప్రస్తుత పోటీ ప్రపంచంలో అద్భుతమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే, విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దేశ్ముఖి గ్రామంలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శనివారం ‘ఇగ్నైట్ యువర్ కోడింగ్ జర్నీ ‘పేరుతో కోడింగ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమం సందర్భంగా ప్రొఫెసర్ వైవీ దాసేశ్వర రావు మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలంటే కేవలం పుస్తక జ్ఞానం సరిపోదని, ప్రాక్టికల్ నైపుణ్యం అవసరమని చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థుల కోసం 10 ఆకర్షణీయమైన బహుమతులను ప్రకటించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, డైరెక్టర్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. సెకండియర్ విద్యార్థి బి.శ్రవణ్ కుమార్ అద్భుత ప్రతిభ విజ్ఞాన్స్ యూనివర్సిటీలో బీటెక్‌సీఎస్‌ఈ సెకండియర్ చదువుతోన్న విద్యార్థి బి.శ్రవణ్ కుమార్ అద్భుత ప్రతిభ కనబరిచారు. కేవలం తరగతి గది విద్యకే పరిమితం కాకుండా, రియల్‌టైమ్ సమస్యలకు పరిష్కారం చూపుతూ శ్రవణ్ రెండు కీలకమైన వెబ్‌సైట్‌లను రూపొందించాడు. విద్యార్థులు, సిబ్బందికి సౌకర్యవంతంగా ఉండేలా ‘కాలేజీ క్యాంటీన్‘ వెబ్‌సైట్‌ను డిజైన్ చేశారు. అలాగే యూనివర్సిటీలో జరిగే వివిధ కార్యక్రమాల సమాచారాన్ని, రిజిస్ట్రేషన్లను సులభతరం చేసేలా ‘ఈవెంట్ మేనేజ్‌మెంట్‘ వెబ్ సైట్‌ను డిజైన్ చేశాడు. ఫ్యాకల్టీ(టీపీ) కె.ప్రణవ్ రెడ్డి సహకారంతో డెవలప్ చేసిన ఈ వెబ్‌సైట్‌లను యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వర రావు శనివారం ఆవిష్కరించారు. చిన్న వయసులోనే సామాజిక అవసరాలకు ఉపయోగపడేలా వెబ్‌సైట్‌లను రూపొందించిన శ్రవణ్ కుమార్‌ను యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వర రావు, అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.

## ఎన్నికలకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు

### దామరచర్ల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్



**ప్రజాపక్షం/నల్లగొండ(దామరచర్ల):** జిల్లాలో రెండవ విడత ఎన్నికలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ అన్నారు. దామరచర్ల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ భద్రత ఏర్పాట్లు జిల్లా ఎస్పి పరిశీలించి మాట్లాడుతూ ఈ నెల 14న మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని అడవిదేవులపల్లి, అనుముల, దామరచర్ల, మాడుగులపల్లి, మిర్యాలగూడ, నిడమనూరు, పెద్దవూర, తిరుమలగిరి సాగర్, త్రిపురారం, వేములపల్లి మొత్తం 10 మండలాల్లోని 282 గ్రామ పంచాయితీలలో 2418 పోలింగ్ కేంద్రాలలో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఎన్నికలను ప్రశాంత వాతారణంలో నిర్వహించేదుకు ప్రతి మండలానికి సూమరు 200 చొప్పున 2000 మంది పోలీస్ సిబ్బందితో ప్రతి మండలానికి ఒక డిఎస్పి స్థాయి అధికారి పర్యవేక్షణలో రూట్ లుగా విభజించి ఎలాంటి సమస్యలు తలెత్తిన తక్షణమే అక్కడికి చేరుకునుని పరిష్కరించుటకు సిఐ,ఎస్ఐ స్థాయి అధికారుల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటు చేసి అన్ని రకాల భద్రత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పి వివరించారు. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు ఊరేగింపులకు, ర్యాలీలకు అనుమతి లేదని బాణాసంచా కాల్చడం, డీజేలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## తేలని ఉపసర్పంచ్ ఎన్నిక

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని ఇబ్రాహింపురం గ్రామంలో జరిగిన మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో ఉపసర్పంచ్ ఎన్నిక మూడురోజులుగా వాయిదాపడుతూ వస్తుంది. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్‌తో పాటుగా, ఉపసర్పంచ్‌కు జాయింట్ చెక్ పవర్ ఉండటంతో కూడా కొంత పోటీతత్వం పెరగడం, వార్డు సభ్యుల్లో ఏకాభిప్రాయం లేకపోవడం వలన ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదా పడుతూ వస్తుంది. గ్రామంలో మొత్తం 8 వార్డులకు గాను, సర్పంచ్ అభ్యర్థి ప్యానెల్‌లో కాంగ్రెస్ నుంచి ఇద్దరు సభ్యులు ఉండగా, బిఆర్ఎస్ నుంచి ముగ్గురు వార్డు సభ్యులు, బీజేపీ నుంచి ఇద్దరు సభ్యులు, స్వతంత్ర అభ్యర్థిగా ఒక వార్డు సభ్యులు ఉన్నారు. కాగా ఉపసర్పంచ్ ఎవరిని ఎన్నుకోవాలి అనే సందిగ్ధంలో గత మూడురోజులనుంచి ఉపసర్పంచ్ ఎన్నిక వాయిధపడుతుంది. ఓ వైపు గెలుపొందిన అభ్యర్థుల ప్రమాణ స్వీకారం సమయం దగ్గరపడుతుండడం, మరో వైపు ఏ విధంగా ఎన్నిక జరిగి, ఎవరు ఉపసర్పంచ్‌గా ఎన్నికవుతారు అనేది చర్చాంశనీయంగా మారింది.

# బజారులో బ్యాలెట్ పేపర్లు

### అధికారుల నిర్లక్ష్యం బట్టబయలు

### అన్నీ అవాస్తవాలే.. రిగ్గింగ్ జరగలేదు : ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/చిట్యాల/నల్లగొండ:**ఎన్నికల అనంతరం బ్యాలెట్ పెట్టెలలో భద్రంగా ఉండాల్సిన బ్యాలెట్ పత్రాలు బజారులో ఉండటం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలో శుక్రవారం రాత్రి కలకలం రేపింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం జరిగిన మొదటి విడత పోలింగ్‌లో భాగంగా చిన్నకాపర్తి గ్రామంలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అనంతరం లెక్కింపు పూర్తి చేసిన అధికారులు విజేతలను కూడా ప్రకటించారు. ఎన్నికలు, విజేతల ప్రకటన లాంటి ఎన్నికల తంతు పూర్తి అయిన తరువాత అధికారులు ఆ ప్రదేశాన్ని ఖాళీ చేసి అక్కడి నుండి నిష్క్రమించారు.శుక్రవారం రాత్రి బిఆర్ఎస్ బలపర్చిన రాధారపు భిక్షం గుర్తు కత్తెరపై ఓటు వేసిన కొన్ని బ్యాలెట్ పేపర్లు పోలింగ్ కేంద్రానికి సమీపంలో ఉన్న మురుగు కాలువలో కనిపించడంతో విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, నకిరేకల్, నల్లగొండ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డిలు ఎన్నికల తీరుపై మండిపడ్డారు. కాగా చిట్యాల మండలం చినకాపర్తిలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో పోలైన ఓట్లు డ్రైనేజీలో బయటపడిన సంఘటనలో ఎలాంటి బోగస్ ఓటింగ్ లేదా రిగ్గింగ్ జరగలేదని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి 6,7 గంట ల మధ్య చిన కాపర్తిలో పోలైన బ్యాలెట్ పేపర్లు డ్రైనేజీలో బయటపడ్డాయని సమాచారం అందిన వెంటనే నల్లగొండ ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డిని వెంటనే అక్కడికి పంపించడం జరిగిందని, ఎంపీడీవో, ఆర్‌ఓ ఇతర సిబ్బంది అందరి సమక్షంలో ఆర్‌డిఓ విచారణ నిర్వహించారని, విచారణ అనంతరం పోలైన ఓట్ల కు, కౌంటింగ్‌కు సరిపోయాయని తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత, గెలిచిన అభ్యర్థిని ప్రకటించిన అనంతరం, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో వారి సంతకం తీసుకున్న తర్వాత బ్యాలెట్ పేపర్లు సరి పోల్చుకున్న తర్వాత గెలిచిన, ఓడిన అభ్యర్థుల సంతకాలు కూడా తీసుకున్న అనంతరం ఆర్‌ఓ సంబంధిత గది నుండి బయటికి వెళ్లిపోయారని, అనంతరం ఇలాంటి సంఘటన జరిగిందని కలెక్టర్ తెలిపారు. కింది స్థాయి అధికారులు వాటిని వదిలి వేయడం వల్ల ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమైందని తెలిపారు. చిన కాపర్తి గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్‌లో పోల్ అయిన ఓట్లకు, బ్యాలెట్ బాక్సులో ఉన్న ఓట్లు, డ్రైనేజీలో దొరికిన ఓట్లకు ట్యాలీ అయ్యిందని ,ఎక్కడ బోగస్ ఓటింగ్ గాని, రిగ్గింగ్ గాని జరగలేదని ఆమె స్పష్టం చేశారు.

**సజావుగా ఎన్నికల ఫలితాల ప్రకటన..**

నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని చిన్నకాపర్తి గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి ఈనెల 11న జరిగిన ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రక్రియ, లెక్కింపు ప్రక్రియ, ఎన్నికల ఫలితాల ప్రకటన సజావుగా జరిగిందని రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. అనంతరం ఎన్నికల సామాగ్రి భద్రపరచు విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించినట్లుగా కమిషన్ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ విషయంపై విచారణ జరిపి, నేరపూరిత దుష్ప్రవర్తనకు పాల్పడిన ఓట్ల లెక్కింపు అధికారులపై సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

ఇందుకు బాధ్యులైన ఆర్‌ఓపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడమే కాకుండా, విధుల నుండి సస్పెండ్ చేయడం జరిగిందని, అలాగే పోలింగ్ బృందాన్ని కూడా సస్పెండ్ చేసినట్లు ఆమె వెల్లడించారు.

## ఎలాంటి అక్రమాలు జరగలేదు

### ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలో ఎన్నికలు పారదర్శకంగా జరిగాయని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని తాము ఆదేశించామని నల్లగొండ జిల్లా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. శనివారం రోజున విలేకరుల సమావేశంలో ఆయన చిన్నకాపర్తిలో బజారులో బ్యాలెట్లు దొరికిన విషయంపై ఆయన స్పందించారు. తమ పార్టీ బలపర్చిన అభ్యర్థి 455 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారని అన్నారు. ఓట్ల లెక్కింపు ప్రజాస్వామ్యబద్ధంగా, అన్ని పార్టీలకు సంబంధించిన ఎన్నికల ఏజెంట్లు, అధికారులు, పోలీస్ వ్యవస్థ సమక్షంలో జరిగిందని, ఇక్కడ అక్రమాలు జరగడానికి తావే లేదన్నారు. గెలిచే అభ్యర్థి అక్రమాలకు పాల్పడవల్సిన అవసరమే లేదన్నారు. లెక్కించిన ఓట్లు, పోలింగ్ ఓట్లు సరిపోయాయన్నారు. కాగా బిఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కాగా బ్యాలెట్ పత్రాలు ఎలా బయటకు వచ్చాయన్న విషయంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంభందింత అధికారులను కోరడం జరిగిందని వీరేశం అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాసు తదితరులున్నారు.

## సమర్థమంతంగా రెండవ విడత నిర్వహణ



కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** రెండవ విడత పోలింగ్ ప్రక్రియను సంబంధిత అధికారులు సమర్థవంతంగా, సమన్వయంతో నిర్వహించాలి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం గ్రామ పంచాయతి ఎన్నికల్లో భాగంగా రెండవ విడత ఎన్నికలు జరగనున్న భువనగిరి మండలం అనాజీపురం గ్రామంలో దివ్యబాల పాఠశాల, వలిగొండ మండలం కేంద్రంలో పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల డ్యూటీలు వేసిన అధికారులందరూ వచ్చారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. హాజరు కాని వారిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మీ గ్రామ పంచాయతీకి సంబంధించిన బ్యాలెట్ పేపర్లు, స్వస్తి గుర్తు స్టాంపు, ఫారం 9 వచ్చాయా అని చెక్ చేసుకోవాలన్నారు. ముందుగా ఓటర్ లిస్ట్ ఇక్కడే క్షుణ్ణంగా పరిశీలించి పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లాలన్నారు. పోలింగ్ కేంద్రం బయట గుర్తులతో పోలీ ఉండే ఫారం 9 అతికించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు గుంపులుగా ఉండకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల విధులు అధికారులందరూ భాధ్యతతో నిర్వహించి సజావుగా జరిగేలా చూడాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన భోజనాన్ని పరిశీలించి స్వయంగా కలెక్టర్ సిబ్బందికి వడ్డించారు. పోలింగ్ సామాగ్రి ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా పోలీస్ బందోబస్తుతో వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రెండవ దశ ఎన్నికలకు ఏర్పాట్లు

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/ చివ్వెంల/ మోతె/ నడిగూడెం/ కోదాడ/ అనంతగిరి/ చిలుకూరు :** రెండవ దశ గ్రామ పంచాయితీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ప్రజలు నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం చివ్వెంల, మోతె, నడిగూడెం, కోదాడ, అనంతగిరి, చిలుకూరు మండలాలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయా కేంద్రాలలో మాట్లాడుతూ ఆదివారం జరుగు రెంవడవ విడత పోలింగ్ సందర్భంగా ఎనిమిది మండలాల్లో కలుపుకొని మొత్తం 181 గ్రామ పంచాయితీలు కాగా, ఇందులో ఏకగ్రీవం తరువాత 158 గ్రామ పంచాయితీలకు, 1460 వార్డులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందుకుగాను 1462 పోలింగ్ స్టేషన్స్ ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. పోలింగ్ సిబ్బంది అందరికి శిక్షణ ఇచ్చి విధులు కేటాయించడం జరిగిందని పోలింగ్ సిబ్బంది అందరూ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి బయలుదేరి వారికి కేటాయించిన గ్రామ పంచాయితీలకు చేరుకొని ప్రణాళిక ప్రకారం పోలింగ్ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తదుపరి అదే రోజు 2 గంటల నుండి అదే గ్రామ పంచాయితీలో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఫలితాలను సంబంధిత స్టేజ్ 2 ఆర్ ఓల ఆధ్వర్యంలో డిక్లరేషన్ చేసి ఫలితాలు వెల్లడిస్తారని తెలిపారు. అదేరోజు ఇన్‌డైరెక్ట్ పద్ధతిలో ఉప సర్పంచ్ ఎన్నిక నిబంధనల ప్రకారం పూర్తి చేస్తారని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుటకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్‌డిఓ సూర్యనారాయణ, ఎంపిడిఓ ఇషాక్ హుస్సేన్, తహశీల్దార్ వాజీద్‌అలీ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తోంది



మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ :** ఎన్నికల వేళ జిల్లాలో దారుణాలు జరుగుతున్నాయి, చాలా అన్యాయంగా అధికార దుర్వినియోగం చేస్తున్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాలిన ఉద్యోగులు కాంగ్రెస్ నాయకుల గుంపులో చేరి అక్రమాలు చేస్తున్నారని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆరోపించారు. శనివారం నల్లగొండలోని బిఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో జడ్పి మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్యలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మాట్లాడుతు ఈనెల 11న జరిగిన గ్రామ సర్పంచ్ ఎన్నికలలో నామినేషన్ వేసే బిఆర్ఎస్ అభ్యర్థులను భయభ్రాంతులకు గురి చేశారని కాంగ్రెస్ హత్య రాజకీయాలను ప్రోత్సహిస్తుందని ఎన్నికల కమిషన్ మీద నమ్మకం పోతుందన్నారు. బిఆర్ఎస్ హయాంలో ఎక్కడా రాజకీయ ఘర్షణలు జరగలేదని జిల్లాలో ఇద్దరు మంత్రుల పిఏలు రోజు పోలీసులకు ఆదేశాలు ఇస్తున్నారని బిఆర్ఎస్ నాయకుల, కార్యకర్తలపై అక్రమ పోలీస్ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ నేతలు గెలిచిన చోట రీకౌంటింగ్ పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని చిన్నకాపర్తిలో బిఆర్ఎస్‌కు వేసిన ఓట్లు పోలింగ్ చిట్టీలు డ్రైనేజిలలో ఉన్నాయని తెలిపారు. చిన్న కాపర్తి బ్యాలెట్ పేపర్ల విషయంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఈసీని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లాగ్రంధాలయ సంస్థ మాజీ అధ్యక్షులు రెగట్టే మల్లిఖార్జున రెడ్డి, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైది రెడ్డి, తిప్పర్తి మాజీ జడ్పిటీసీ తందు సైదులు గౌడ్, కొండూరి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ బొజ్జ వెంకన్న, పట్టణ పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస రెడ్డి, మారగోని గణేష్, గున్ రెడ్డి యుగంధర్ రెడ్డి, జమాల్ ఖాద్రి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## వర్గ విభేదాలకు, గొడవలకు పోవద్దు



**ప్రజాపక్షం/మోతె :** ప్రజలు వర్గ విభేదాలకు, గొడవలకు పోవద్దని జిల్లా ఎస్‌పి కె.నరసింహ అన్నారు. శనివారం మండలంలోని సిరికొండ గ్రామంలో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నిబంధనలు, ఆంక్షలు అమలు చేయాలని కోరారు. లెక్కింపు ప్రక్రియ సమయంలో తప్పుడు సమాచారం వెళ్లకుండా అభ్యర్థులను లెక్కింపు ప్రారంభంలోనే కూర్చోబెట్టుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో పోలీస్ సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు. ఎస్‌పి వెంట మునగాల సిఐ రామకృష్ణారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్ఐలు అజయ్, సైదులు, అర్మడ్ ఎస్ఐలు అశోక్, సాయిరాం సిబ్బంది ఉన్నారు.

## ఇంటింటికీ ప్రచారం



**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం గ్రామ సిపిఐ బలపరిచిన బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి పెండ్యాల వినోద్ కత్తెర గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ శనివారం గ్రామంలో సిపిఐ జనగామ జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి ఆది సాయన్న ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొని ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, డ్రైనేజి సమస్య, మంచి నీటి సమస్య, వీధి దీపాల సమస్య, కుళాయిల ఏర్పాటు వంటి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామ సర్వతోముఖాభివృద్ధికి ముందుండి కృషి చేయడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తి పెండ్యాల వినోద్ అని ఆయన తెలిపారు. ఓటర్లు ఆలోచించి విద్యావంతుడైన వినోద్‌ను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ మాజీ ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు శ్రీశైలం, బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు చిన్నపరెడ్డి, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రజాపాలనలోనే అభివృద్ధి


### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆయన శనివారం మోటకొండూర్ మండలంలోని అరెగూడెం, దిల్వార్పూర్, ఇక్కుర్తి, మాటూరు, తేర్యాల, అమ్మనబోలు, చామపూర్, చందేపల్లి తదితర గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేండ్లుగా బిఆర్ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని కాంగ్రెస్ ప్రజాపాలన వచ్చిన వెంటనే నూతన రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, రుణమాఫీ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు యేల్లంల సంజీవ రెడ్డి, మండల అధ్యక్షుడు గంగపురం మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరుని రఘునాథ రాజు, సిపిఎం మండల కార్యదర్శి కొల్లూరి ఆంజనేయులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు బోయినీ ఝాన్సీ, అమ్మనబోల్ అధ్యక్షుడు శీల బాలకృష్ణ యాదవ్, క్యాసగల్ల చందు, తదితరులు పాల్గొన్నారు.

## రెండవ విడత ఎన్నికల సామాగ్రి పంపిణీ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నేడు 2వ విడత మిర్యాలగూడ డివిజన్లోని రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి అన్నారు.ఆదివారం మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని 10 మండలాలలో రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న దృష్ట్యా శనివారం ఆమె మాడుగుల పల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ ,స్వీకర( డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్) కేంద్రాన్ని తనిఖీ చేసి ఎన్నికల సామాగ్రి పంపిణీకి చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. అడవిదేవులపల్లి, అనుముల, దామరచర్ల,మాడుగుల పల్లి, మిర్యాలగూడ, నిడమనూరు, పెద్దవూర, తిరుమలగిరి సాగర్, త్రిపురారం, వేములపల్లి మండలాల్లోని 2418 పోలింగ్ కేంద్రాల పరిధిలో రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకుగాను 2898 మంది పిఓలు ,3334 మంది ఓపిఓ లను మించడం జరిగిందని తెలిపారు.పోలైన బ్యాలెట్ ల భద్రత, బాధ్యత పూర్తిగా స్టేజ్ 2 రిటర్నింగ్ ఆఫీసర్‌పై ఉందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కౌంటింగ్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను,రీ కౌంటింగ్ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం ఎన్నికలు జరగనున్న 10 మండలాల్లోని 250 పోలింగ్ కేంద్రాల లోకేషన్లలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. సుమారు 5000 మంది సిబ్బంది సేవలను 2వ విడత పోలింగ్‌లో వినియోగించుకుంటున్నామని, వెబ్ కాస్టింగ్‌తో పాటు, మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేశామని, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పి సీఈవో శ్రీనివాసరావు, తహసీల్దార్, ఎంపీడీవో, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## గుజరాత్‌లో భూ ప్రకంపనలు

**అహ్మదాబాద్ :**గుజరాత్‌లోశనివారం భూప్రకంపనలువచ్చాయి.కచ్ జిల్లాలో 3.9 తీవ్రతతో భూకంపం సంభవించిందని ఇన్స్టిట్యూట్ ఆఫ్ సిస్మోలాజికల్ రీసెర్చ్ (ఐఎస్ఆర్) తెలిపింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం గానీ, ఆస్తి నష్టం గానీ జరగలేదని జిల్లా విపత్తు నిర్వహణ అధికారి తెలిపారు. ఈ భూకంపం మధ్యాహ్నం 2:47 గంటలకు సంభవించిందని, జిల్లాలోని గఢ్‌శిషాకు ఉత్తర ఈశాన్య దిశలో 13 కిలోమీటర్ల దూరంలో భూకంపం ఉందని గాంధీనగర్‌కేంద్రంగాపనిచేసేఐఎస్ఆర్ పేర్కొంది.ఈ నెలలో కచ్‌లో 3 కంటే ఎక్కువ తీవ్రతతో నమోదైన ఐదవ భూకంపం ఇది. ఐఎస్ఆర్ నివేదిక ప్రకారం, శుక్రవారం జిల్లాలో 3.3,బుధవారం 3.7 తీవ్రతతో భూకంపాలు నమోదయ్యాయి. కచ్ 'అత్యంత ప్రమాదకర' భూకంప జోన్‌లో ఉంది. 2001 లో ఈ జిల్లాలో సంభవించిన వినాశకరమైన భూకంపంలో 13,000 మందికి పైగా మరణించారు.

## పార్లమెంట్‌పై ఉగ్ర దాడి.... అమరులకు నివాళి



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ భవనంపై 2001లో ఉగ్రవాదులు దాడికి పాల్పడగా, దాడిని ఎదుర్కోవడంపై అరులైన వారికి శనివారం ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ నేతృత్వంలో పార్లమెంటు సభ్యులు పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళి అర్పించారు. దాడి జరిగి 24 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాజ్యసభ చైర్మన్ కూడా అయిన రాధాకృష్ణన్ మొదట నివాళులర్పించారు. ఈ రోజును పురస్కరించుకుని ప్రతి డిసెంబర్ 13న పాత పార్లమెంట్ భవనం (సంవిధాన్ సదన్) వెలుపల ఒక చిన్న కార్యక్రమం నిర్వహించారు. మరోవైపు ఎక్స్ వేదికగా రాష్ట్రపతి ద్రౌపది ముర్మ కూడా పార్లమెంట్‌పై దాడిలో అమర వీరులకు నివాళి అర్పించారు. ఈ దేశం వారికి, వారి కుటుంబాలకు రుణపడి ఉందని అన్నారు. నేడు అన్ని రకాల ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి భారతదేశ నిబద్ధతను తాము పునరుద్ఘాటిస్తున్నామని పోస్టు చేశారు. కాగా, సిఐఎస్ఎఫ్ సిబ్బంది వేదిక వద్ద సెల్యూట్ లేదా 'సమ్మాన్ గార్డ్' సమర్పించారు. ఆ తర్వాత వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఒక క్షణం మౌనం పాటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకురాలు రాహుల్ గాంధీ, ఆయన సోదరి ప్రియాంక గాంధీ వాద్రా, పార్టీ సీనియర్ నాయకుడు కూడా పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జితేంద్ర సింగ్, అర్జున్ రామ్ మేఘ్వాల్ కూడా వరుసలో నిలబడి ఉగ్రదాడిని తిప్పికొట్టిన సిబ్బంది ఛాయాచిత్రాలకు పుష్పగుచ్ఛాలు సమర్పించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పార్లమెంటు దిగువ సభ మాజీ స్పీకర్, మాజీ కేంద్ర మంత్రి శివరాజ్ పాటిల్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు లాతూర్‌కు వెళ్లారు. ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా మాట్లాడుతూ '2001లో మన పార్లమెంటుపై జరిగిన దారుణమైన దాడిలో ప్రాణాలు అర్పించిన వారిని మన దేశం గుర్తుంచుకుంటుంది' అని అన్నారు. 'తీవ్రమైన ప్రమాదం ఎదురైనప్పటికీ, వారి ధైర్యం, అప్రమత్తత, అచంచలమైన విధి భావం గొప్పవి. భారతదేశం వారి అత్యున్నత త్యాగానికి ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటుంది' అని నివాళులర్పించే వేడుకకు సంబంధించిన ఫొటోలను పంచుకుంటూ అన్నారు. ఈ దాడిలో ఐదుగురు సాయుధ ఉగ్రవాదులు పాల్గొన్నారు, కానీ ప్రస్తుత పార్లమెంట్ భద్రతా సేవ, సిఆర్‌పిఎఫ్, ఢిల్లీ పోలీసుల సిబ్బంది దాడిని భగ్నం చేశారు. ఏ ఉగ్రవాది కూడా భవనంలోకి ప్రవేశించలేకపోయారు. ఈ దాడిలో ఆరుగురు ఢిల్లీ పోలీసు సిబ్బంది, ఇద్దరు పార్లమెంట్ భద్రతా సేవ సిబ్బంది, ఒక తోటమాలి, ఒక టీవీ జర్నలిస్ట్ మరణించారు. ఆ ఐదుగురు ఉగ్రవాదులను అప్పటి పార్లమెంట్ భవనం ముందు ప్రాంగణంలో కాల్చి చంపారు.

# కేరళ స్థానిక సంస్థల్లో యుడిఎఫ్‌కు ఆధిక్యత

### జిల్లా పరిషత్‌లలో సగం గెలుచుకున్న ఎల్‌డిఎఫ్
### తిరువనంతపురం కార్పొరేషన్‌లో ఎన్‌డిఎ అనూహ్య విజయం

**తిరువనంతపురం:**కేరళ రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్), ఐక్య ప్రజాతంత్ర సంఘటన (యుడిఎఫ్) చెరి సగం జిల్లా పరిషత్‌లను గెలుచుకున్నాయి. మొత్తం 14 జిల్లా పరిషత్(పంచాయత్)లలో ఎల్‌డిఎఫ్ 7, యుడిఎఫ్ 7 జిల్లాల్లో విజయం సాధించాయి. అయితే, గత స్థానిక సంస్థల ఎన్నికలకంటే ఈ సారి ఎల్‌డిఎఫ్ బలం తగ్గింది. గతంలో 11చోట్ల గెలుపొందగా, ఈ సారి 7 చోట్ల గెలుపొందింది. పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్, జిల్లా పరిషత్, బ్లాక్‌లకు జరిగిన ఎన్నికల కౌంటింగ్ శనివారం జరిగింది. జిల్లా పరిషత్‌లలో రెండు ప్రధాన కూటములు చెరి సగం పంచుకోగా, మిగత వాటిల్లో యుడిఎఫ్ పై చేయి సాధించింది. మొత్తం 941 గ్రామ పంచాయతీల్లో యుడిఎఫ్ – 504 ఎల్‌డిఎఫ్ – 341, ఎన్‌డిఎ – 26 సర్పంచ్ పదవులనుకైవసంచేసుకోగా, 64 గ్రామాల్లో టై అయింది. మరోఆరు చోట్ల ఇతరులు గెలిచారు. అలాగే అన్ని పంచాయతీలలోని 17,337 వార్డుల్లో యుడిఎఫ్ – 7,922, ఎల్‌డిఎఫ్ – 6,483, ఎన్‌డిఎ – 1,421, ఇతరులు – 1,283 వార్డులలో విజయం సాధించింది. ఇక మున్సిపాలిటీల విషయానికి వస్తే, మొత్తం 86 పట్టణాలలో ఎన్నికలు జరగగా యుడిఎఫ్ 54, ఎల్‌డిఎఫ్ – 28, ఎన్‌డిఎ– 2,ఇతరులు –1, టై – 1 మున్సిపాలిటీలను కైవసం చేసుకున్నాయి.ఈ పట్టణాలలోని 3,240 మున్సిపాలిటీ వార్డులలో యుడిఎఫ్ 1,458, ఎల్‌డిఎఫ్ – 1,100, ఎన్‌డిఎ – 324, ఇతరులకు – 323 వార్డులు దక్కాయి. ఫలితాలను పరిశీలిస్తే గతంతో పోల్చినట్లయితే ఎల్‌డిఎఫ్ బలం కాస్త తగ్గినప్పటికీ, ఇప్పటికీ బలమైన శక్తిగానే ఉంది.ఎన్‌డిఎ ప్రధానంగా కొన్ని పట్టణ ప్రాంతాలకు మాత్రమే పరిమితమైనట్లు కనపడుతుంది.



### ఆశించిన ఫలితాలు రాలేదు : సిఎం విజయన్



స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ ఆశించిన ఫలితాలను సాధించలేకపోయిందని కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రబల విజ యం సాధిస్తామని భావించామని, కానీ, అలా సాధించలేకపోయామన్నారు. ఇం దుకు కారణాలను వివరంగా పరిశీలిస్తామని,అవసరమైన దిద్దుబాట్లు చేసు కున్న తరువాత ముందుకు సాగుతామని అన్నా రు. తిరువనంతపురంలో ఎన్‌డిఎ పై చేయి సాధించటాన్ని ప్రస్తావిస్తూ ఎన్నికల ప్రచారం మతతత్వం ప్రభావితం చేయ డం లౌకికవాదాన్ని విశ్వసించేవారికి ఆందోళన కలిగించే విషయమని అన్నా రు. మతతత్వ శక్తుల తప్పుడు ప్రచారం, విభజన ఎత్తుగడల బారిన ప్రజలు పడకుండా మరింత జాగురుకత అవసరమని ఎన్నికల ఫలితాలు హెచ్చరిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని రకాల మతతత్వవాదానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని ఫలితాలు గట్టిగా చెబుతున్నాయ న్నారు. తన పునాదిని మరింత విస్తరించేందుకు, వామపక్ష ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజల మద్దతును పెంపొందించుకునేందుకు ఎల్‌డిఎఫ్ మరింత పట్టుదలతో పని చేస్తుందన్నారు.

### కార్పొరేషన్‌లో ఎల్‌డిఎఫ్‌కు నిరాశ

ఆరు మున్సిపల్ కార్పొరేషన్‌లకు జరిగిన ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ కేవలం కోళికోడ్ కార్పొరేషన్‌ను మాత్రమే దక్కించుకుంది. యుడిఎఫ్ కొల్లాం, త్రిచ్చూరు, కొచ్చిన్, కన్నూరు కార్పొరేషన్‌లలో గెలుపొందగా, అనూహ్యంగా ఎన్‌డిఎ తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌ను దక్కించుకుంది. తిరువనంతరపురంలో 100 వార్డులలో ఎన్‌డిఎ – 50 చోట్ల (గత ఎన్నికల్లో 34) గెలుపొందగా, ఎల్‌డిఎఫ్ 29, యుడిఎఫ్ – 19 డివిజన్‌లు గెలుచుకున్నాయి. బ్లాక్ ఎన్నికల్లో యుడిఎఫ్ 79, ఎల్‌డిఎఫ్–63 గెలుచుకున్నాయి.

### ప్రభుత్వ వ్యతిరేకత ఉందేమో పరిశీలిస్తాం : బినోయ్‌విశ్వం



స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని, ప్రభుత్వ వ్యతిరేక భావన ఏమైనా ఉందా అని పరిశీలిస్తామని సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం అన్నారు. వామపక్ష విలువలకు కట్టుబడి ఉంటామని, సరిదిద్దుకోవాల్సిన వైఖరిని సరిదిద్దుతామని ఆయన అన్నారు. ఎల్‌డిఎఫ్‌లోని ప్రతి భాగస్వామ్య పక్షం ఈ ఎన్నికల నుండి పాఠాలు నేర్చుకుని తన కార్యకలాపాలను బలోపేతం చేసుకుని మూడు దిశల్లో వెళ్తుందన్నారు. గుడ్డి వామపక్ష శత్రుత్వంతో యుడిఎఫ్– బిజెపి పరోక్షంగా, ప్రత్యక్షంగా చేతులు కలిపి ఎల్‌డిఎఫ్‌ను ఎదుర్కొంటున్నాయి. కేరళలో బిజెపి–కాంగ్రెస్ సంబంధం చాలా కాలంగా ఉందని, ఈ ధోరణి ఇప్పుడూ ఉందన్నారు. అయితే, అది అన్ని చోట్లా ఉందని కాదని, భవిష్యత్తులో కూడా ఇది కనిపిస్తుందని, వీటన్నింటినీ అధిగమించి వామపక్షం గెలుస్తుందని ఆయన అన్నారు. వామపక్షాలు ఓటమిని విశ్లేషిస్తాయని, ప్రజలు దానిని ఎలా చూస్తారో పరిశీలిస్తుందని, ప్రజలను గొప్పగా చూస్తారని ఆయన తెలిపారు. తమది ప్రజలకు ఎంతో చేసిన ప్రభుత్వమని, ప్రభుత్వం చేసిన ప్రతిదాన్ని ప్రజలు చూస్తున్నారని, అయినప్పటికీ, ప్రజలు ఎందుకు ఇలా ఆలోచించారో మనం నేర్చుకోవాల్సిన అవసరం ఉందని బొనోయ్ విశ్వం నొక్కి చెప్పారు.

# మెస్సీ టూర్‌లో గందరగోళం

### వివేకానంద యువభారతి సాల్ట్ లేక్ స్టేడియంలోకి వాటర్ బాటిళ్లు విసిరిన ఫ్యాన్స్
### పోలీసుల లాఠీచార్జ్, ఉన్నతస్థాయి విచారణకు సిఎం ఆదేశం
### మెస్సీకి క్షమాపణలు చెప్పిన మమతా బెనర్జీ

**న్యూఢిల్లీ :**అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సి గోట్ టూర్‌లో గందరగోళం నెలకొంది. గోట్ టూర్‌లో భాగంగా మెస్సీ శనివారం కోల్‌కతాలో వివేకానంద యువ భారతి సాల్ట్ లేక్ స్టేడియంలో పర్యటించాడు. అయితే ఆయనను స్పష్టంగా చూడకపోవడంతో వేలాది మంది అభిమానులు నిరసన వ్యక్తం చేయడంతో గందరగోళం చెలరేగింది. దీంతో పోలీసులు లాఠీచార్జ్ చేయగా, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. మెస్సీ ఈవెంట్ ఆర్గనైజర్ శతద్రు దత్తాను అరెస్ట్ పోలీసులు చేశారు. మెస్సీ పాల్గొన్న కార్యక్రమాన్ని నిర్వహించడంలో విఫలమైనందుకు గానూ.. ఆయన్ను బాధ్యుణ్ని చేస్తూ అరెస్ట్ చేసినట్టు కోల్‌కతా లా అండ్ ఆర్డర్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ జావేద్ షమీమ్ ధృవీకరించారు. కాగా 2011 తర్వాత తొలిసారిగా మెస్సీ వేదికపైకి రావడంతో, టిక్కెట్ల కోసం భారీ మొత్తాలు చెల్లించినప్పటికీ, ప్రేక్షకుల్లో పెద్ద సంఖ్యలో నిరాశ చెందడంతో, మార్ప్యూ ఫుట్‌బాల్ ఆగ్రహావేశాలకు గురై గందరగోళంగా మారింది. దీర్ఘకాల స్ట్రైక్ భాగస్వామి లూయిస్ సువారెజ్, అర్జెంటీనా సహచరుడు రోడ్రిగో డి పాల్‌తో కలిసి, ప్రపంచ కప్ విజేత కెప్టెన్ మెస్సీ ఉదయం 11.30 గంటల ప్రాంతంలో వివేకానంద యుబా భారతి క్రిరంగన్ వద్దకు చేరుకున్నారు. అతని వాహనం టచ్‌లైన్ వద్ద పార్క్ చేసి మైదానంలోకి అడుగుపెట్టగానే, అతన్ని విఐపిలులు, నిర్వాహకులు, ప్రముఖులు, భద్రతా సిబ్బంది త్వరగా చుట్టుముట్టారు. దీంతో అతన్ని చూసేందుకు గ్యాలరీలలో కూర్చున్న ప్రేక్షకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 'మెస్సీ, మెస్సీ' అంటూ అభిమానుల నినాదాలు మధ్య ఆయన మైదానంలో కొద్ది దూరం నడిచి స్టాండ్స్ వైపు చేయి ఊపుతూ అభివాదనం చేశాడు. అయితే, అభిమానులు ఫుట్‌బాల్ క్రీడాకారుడిని పలువురు చుట్టుముట్టారని, పైగా స్టేడియంలో కొన్ని ప్రదేశాల నుంచి అతని కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద స్క్రీన్‌లు కూడా స్పష్టమైన దృశ్యాన్ని అందించలేకపోయాయనిమండిపడ్డారు. గందరగోళం మధ్య అతడు కేవలం 10 నిమిషాలే మైదానంలో కనిపించాడు. తర్వాత అతడిని భారీ సెక్యూరిటీ మధ్య హోటల్‌కు తీసుకెళ్లారు. దీంతో ఫ్యాన్స్ మండిపడ్డారు. అర్జెంటీనా స్టార్ మైదానం నుండి అకాలంగా వెళ్లిపోయాడనే వార్త వ్యాపించడంతో, మైదానంలోకి సీసాలు, ప్లాస్టిక్ కుర్చీలు విసిరివేశారు. స్పాన్సర్ బ్యానర్లు, హోర్డింగ్‌లను కూల్చివేశారు, ఫైబర్‌గ్లాస్ సీట్లు పగలగొట్టారు.ప్రేక్షకులలో కొంతమంది బారికేడ్లను చీల్చివేసి మైదానంలోకి బలవంతంగా ప్రవేశించడానికి ప్రయత్నించారు. రాష్ట్ర క్రీడా మంత్రి అరూప్ బిశ్వాస్, ఈవెంట్ నిర్వాహకుడు శతద్రుడు దత్తాను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. మెస్సీ నిష్క్రమించిన వెంటనే దత్తా మరియు అతని బృందంతో సహా నిర్వాహకులు మైదానంలో కనిపించకపోవడంతో పరిస్థితి మరింత దిగజారిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అనధికార వ్యక్తులు మైదానం విడిచి వెళ్లాలని పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌లో పదే పదే చేసిన ప్రకటనలు పెద్దగా పట్టించుకోలేదు. నిమిషాల వ్యవధిలోనే, వందలాది మంది ప్రేక్షకులు మైదానంలోకి దూసుకెళ్లి తాత్కాలిక టెంట్లను, టచ్‌లైన్ దగ్గర ఉంచిన పరికరాలను ధ్వంసం చేశారు. భారీ జన సమూహాన్ని అదుపు చేయడానికి పోలీసులు ఇబ్బంది పడ్డారు. దీంతో స్టేడియం లోపల రాపిడ్ యాక్షన్ ఫోర్స్ మోహరించారు.



### మెస్సీకి మమతా బెనర్జీ క్షమాపణలు

అర్జెంటీనాకు చెందిన ఫుట్‌బాల్ స్టార్ లియోనల్ మెస్సీకి బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ క్షమాపణలు చెప్పారు. శనివారం ఉదయం కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియంలో మెస్సీ పాల్గొన్న కార్యక్రమ నిర్వహణలో అపశృతి చోటుచేసుకుందని తెలిసి షాక్‌కు గురైనట్లు ఆమె తెలిపారు. ఈ ఘటనపై తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి, బాధ్యులను గుర్తించేందుకు అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు మమత ప్రకటించారు. రిటైర్డ్ న్యాయమూర్తి ఆశిమ్ కుమార్ రే సారథ్యంలో ఏర్పాటయ్యే ఈ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ, అదనపు చీఫ్ సెక్రెటరీ, రాష్ట్ర హోంహిల్ అఫైర్స్ విభాగం ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారని వెల్లడించారు. వేలాది మంది ఫ్యాన్స్‌లాగే తాను కూడా ఫుట్‌బాల్ ఐకాన్ లియోనల్ మెస్సీని చూసేందుకు సాల్ట్ లేక్ స్టేడియంకు బయలుదేరానని మమత చెప్పారు. అంతలోనే మెస్సీ కార్యక్రమంలో రసాభాస జరిగిందనే సమాచారం తెలిసి షాక్‌కు గురైనట్లు సీఎం తెలిపారు.

### పూర్తిగా నిర్వహణ లోపం

కాగా, ఇది పూర్తిగా నిర్వహణ లోపం అని తన కొడుకుతో వచ్చిన ఫుట్‌బాల్ ఔత్సాహికుడు అజయ్ షా అన్నారు. 'మెస్సీని చూడటానికి ప్రజలు ఒక నెల జీతం ఖర్చు చేశారు. నేను టికెట్ కోసం రూ. 5,000 చెల్లించాను. మేము మెస్సీని చూడటానికి వచ్చాము, రాజకీయ నాయకులను కాదు. తాగడానికి నీరు లేదు, పోలీసులు కూడా సెల్ఫీలు తీసుకుంటూ బిజీగా ఉన్నారు' అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి టిక్కెట్ ధరలు రూ. 4,500 నుండి రూ. 10,000 వరకు ఉన్నాయి, ఫుట్‌బాల్ లెజెండ్‌ను దగ్గరగా చూడాలనే ఆశతో చాలా మంది అభిమానులు ఉదయాన్నే వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ గందరగోళం కారణంగా కార్యక్రమాన్ని అకస్మాత్తుగా రద్దు చేయాల్సి వచ్చింది, బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్, భారత మాజీ క్రికెట్ కెప్టెన్ సౌరవ్ గంగూలీ, ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో సహా అనేక మంది ఆహ్వానించబడిన ప్రముఖులు ప్రణాళిక ప్రకారం పాల్గొనలేకపోయారు. పరిస్థితి పూర్తిగా అదుపు తప్పలేదని పోలీసువర్గాలు తెలిపాయి.

మెస్సీని షెడ్యూల్ కంటే ముందే స్టేడియం నుండి బయటకు తీసుకెళ్లడం, అదనపు భద్రతా దళాలను తరలించడం వల్లే పరిస్థితి పూర్తిగా అదుపు తప్పిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

### ఈవెంట్ నిర్వాహకులపై హత్యాయత్నం కేసు పెట్టాలి: బెంగాల్ గవర్నర్

'కోల్‌కతాలోని క్రీడా ప్రియులకు ఇది చీకటి రోజు లాంటిది. లియోనల్ మెస్సీ ఈవెంట్‌ను నిర్వహించిన వారి వైఫల్యం వల్లే ఇంత రాద్ధాంతం జరిగింది. వారిని అరెస్టు చేయమని రాష్ట్ర ప్రభుత్వానికి నిర్దేశించాను. ఈవెంట్ నిర్వాహకులపై హత్యాయత్నం అభియోగాలతో కేసును నమోదు చేయమని సూచించాను. ప్రస్తుతం రాష్ట్ర హోంమంత్రిగా ఉన్న సిఎం మమతా బెనర్జీ, కోల్‌కతా పోలీసులు కూడా విఫలమయ్యారు. వారందరూ కలిసి క్రీడా ప్రియులకు నిరాశను మిగిల్చారు. మెస్సీని కలవడానికి బయలుదేరిన సిఎం మమత మార్గం మధ్యలోనే వెనుదిరగాల్సి వచ్చిందని తెలిసి నేను షాక్‌కు గురయ్యాను. అందుకే ఇది సీరియస్ అంశం. దీనిపై సమగ్ర దర్యాప్తు జరగాల్సిందే. మెస్సీని ఒక వాణిజ్య సరుకుగా మార్చిన వాళ్లెవరో గుర్తించాలి. ఈ ఈవెంట్ టికెట్లను కొన్న వాళ్లందరికీ ఛార్జీలను రీఫండ్ చేయాలి. స్టేడియానికి నష్టం కలిగించినందుకు ఈవెంట్ నిర్వాహకులపై జరిమానా విధించాలి. సకాలంలో స్పందించనందుకు సంబంధిత పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలి' అని బెంగాల్ గవర్నర్ సివి ఆనంద బోస్ వ్యాఖ్యానించారు.

## ఇలాంటి వాళ్లకు గుణపాఠం నేర్పాలి
### 'హిట్ అండ్ రన్' కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర రాజధాని ముంబయిలో గత ఏడాది చోటు చేసుకున్న హిట్ అండ్ రన్ కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తనకు బెయిల్ ఇవ్వాల్సిందిగా కోరుతూ.. నిందితుడు మిహిర్ షా వేసిన పిటిషన్‌పై దర్యాప్తు చేపట్టేందుకు నిరాకరించింది. ఇలాంటి వాళ్లకు తగిన గుణపాఠం నేర్పించాల్సిందేనని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. బైక్‌పై వెళ్తున్న దంపతులను నిందితుడు తన కారుతో అతివేగంగా ఢీకొట్టడమే కాకుండా, అక్కడి నుంచి పరారయ్యాడని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎజి మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొన్నది. చేసిన నేరానికి అతడు కొద్ది రోజులపాటు జైల్లోనే ఉండాలని ఆదేశించింది. కాగా గత ఏడాది ముంబయిలోని వర్లీ ప్రాంతంలో శివసేన నేత రాజేశ్ షా కుమారుడు మిహిర్ షా మద్యం మత్తులో బిఎండబ్ల్యు కారును వేగంగా నడుపుతూ ముందు వెళ్తున్న స్కూటీని ఢీకొట్టాడు. దాంతో స్కూటీపై ఉన్న దంపతులు ఎగిరిపడ్డారు. అనంతరం కారు మహిళపై నుంచి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కావేరి నక్వా (45) అనే మహిళ అక్కడికక్కడే మరణించింది. ఆమె భర్త గాయపడ్డారు. ఇదిలావుంటే ప్రమాదం తర్వాత మిహిర్ కొద్ది దూరంలో తన కారును వదిలేసి ఆటోలో అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం పోలీసులు అతడిని అరెస్టు చేశారు. ఈ క్రమంలో హిట్ అండ్ రన్ కేసులో బెయిల్ ఇవ్వాలని మిహిర్ ముంబై హైకోర్టులో పిటిషన్ వేశారు. కానీ న్యాయస్థానం బెయిల్‌ను తిరస్కరించింది. దాంతో అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.

### అధికారిక లాంఛనాలతో...
# లోక్‌సభ మాజీ స్పీకర్ శివరాజ్ పాటిల్ అంత్యక్రియలు పూర్తి



**లాతూర్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి శివరాజ్‌పాటిల్ అంత్యక్రియలు శనివారం ఆయన స్వస్థలం మహారాష్ట్రలోని లాతూర్‌లో పూర్తి అధికారిక లాంఛనాలతో జరిగాయి. ఈ కార్యక్రమంలో రాజకీయ అగ్రనాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు, తండోపతండాలుగా తరలివచ్చిన పజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ నాయకుడికి కడపటి కన్నీటి నివాళులు అర్పించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, మాజీ మహారాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ చవాన్, కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖాంద్రే హాజరైన వారిలో ఉన్నారు. లింగాయత్ కమ్యూనిటీకి చెందిన ప్రముఖుడైన శివరాజ్ పాటిల్ లాతూర్ నుంచి 6 కి.మీ.దూరంలో ఉన్న వర్వంతి గ్రామం వద్ద నున్న ఆయన వ్యవసాయ క్షేత్రంలో ధ్యాన భంగిమలో కూర్చున్న స్థితిలో ఖననం చేశారు. ఈ లింగాయత్ ఆచారం, మరణించిన ఆత్మ వెంటనే శివుడితో ఏకమవుతుందని, పునర్జన్మకు లోబడి ఉండదనే వారి నమ్మకం నుండి ఉద్భవించింది. తద్వారా ఆత్మను అనవసరమైన వాటి నుంచి విడిపించడానికి దహన సంస్కారాలు చేస్తారు. 90ఏళ్ల శివరాజ్ పాటిల్ అనారోగ్యంతో లాతూర్‌లో మరణించారు. అర్ధ శతాబ్దపు ఆయన రాజకీయ జీవితంలో లోక్‌సభ స్పీకర్ పదవీ బాధ్యతలతోపాటు, పలు మంత్రిత్వశాఖలకు కేంద్రమంత్రిగా కేంద్ర ప్రభుత్వంలో ఆయన అనేక కీలక స్థానాలలో బాధ్యతలను నిర్వర్తించారు. పాటిల్ భౌతికకాయంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులు అర్పించగా, మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కల్, లాతూర్ లోక్‌సభ సభ్యుడు శివాజీ కోల్గే పాల్గొన్నారు. అంత్యక్రియలకు ముందు శివరాజ్‌పాటిల్‌కు పోలీసులు తుపాకీ వందనం సమర్పించారు. ఏడు దశాబ్దాలుగా దేశానికి సామాజిక, రాజకీయ జీవితానికి చేసిన సేవలను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ సందర్భంగా గుర్తుచేశారు. 'శివరాజ్ పాటిల్ వివిధ పదవులకు ప్రాతినిథ్యం వహించారు. లోక్‌సభ స్పీకర్‌గా పనిచేసిన ఆయన ఆ పదవికే వన్నెతెచ్చారు. పార్లమెంట్ కమిటీలతో సహా అనేక మార్పులకు ఆద్యుడై లోక్‌సభ ప్రతిష్ఠను ఉన్నత శిఖరాన నిలబెట్టారు. ఆయన సామాజిక, రాజకీయ రంగాలలో అందించిన సేవలు, సహకారం ఎల్లప్పుడూ జాతి గుర్తుంచుకుంటుంది' అని లోక్‌సభ స్పీకర్ అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ తాను 1967లో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు శివరాజ్ పాటిల్‌ను కలిశానని, ఆయనతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ మాట్లాడుతూ భారతదేశం ఒక గొప్ప రాజకీయ నాయకుడిని కోల్పోయిందని, ఆయన ప్రజాస్వామ్య సాధనకి ఒక బలమైన స్థంభంగా నిలిచారని, 'భారతదేశానికి నిజమైన కొడుకుగా తనను తాను అంకితం చేసుకున్న మహనీయుడు' అని చెప్పారు. ఆయన ఒక కళాకారుడు, కవి, ఆలోచనాపరుడని, ఒక సాధువుగా సాధారణ జీవితం గడిపారని, ఆయన సామాజిక, ఆర్థిక, మతం, విద్యారంగాలకు ఎంతగానో దోహదపడ్డారని గుర్తుచేశారు.

## వాళ్లకు పని చేతకాదు... ఉన్నత పదవులే ముఖ్యం
### రాహుల్‌గాంధీ, సిద్ధూలపై పంజాబ్ సిఎం ఫైర్

**ఛండీగఢ్ :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, పంజాబ్ కాంగ్రెస్ సీనియర్ నేత నవజ్యోత్ సింగ్ సిద్ధూ పై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. క్షేత్రస్థాయిలో పనితీరు కనబరచకుండానే ఉన్నత పదవులు ఆశించడం వారిద్దరిలో ఉన్న ప్రధాన సమస్య అని మాన్ ఎద్దేవా చేశారు. 'నన్ను ప్రధానిని చేయండి, నేను ఏదో ఒకటి చేస్తా' అని రాహుల్ గాంధీ చెబుతుంటారని, కానీ దేశ ప్రజలు మాత్రం ముందు మీరు ఏదైనా చేసి చూపించండి, ఆ తర్వాతే మిమ్మల్ని ప్రధానిని చేసే విషయం ఆలోచిస్తామని అంటున్నారని మాన్ తెలిపారు. పంజాబ్‌లో నవజ్యోత్ సింగ్ సిద్ధూ కూడా అదే పద్ధతిని అనుసరిస్తున్నారని ఆయన విమర్శించారు. తనను ముఖ్యమంత్రిని చేయాలని సిద్ధూ పంజాబ్ ప్రజలను కోరుతున్నారని, కానీ ముందు మీ పనితీరు చూపించండి, ఆ తర్వాత ఆలోచిస్తామని ప్రజలు స్పష్టంగా చెబుతున్నారని మాన్ అన్నారు. అధికారాన్ని డిమాండ్ చేయడం కాదని, ప్రజాస్వామ్యంలో దాన్ని పనితీరుతో సంపాదించుకోవాలని సూచించారు. కాగా ఇటీవల నవజ్యోత్ సిద్ధూ భార్య నవజ్యోత్ కౌర్ పంజాబ్ కాంగ్రెస్ నాయకత్వంపై విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో భగవంత్ మాన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కాంగ్రెస్‌లో జవాబుదారీతనం, స్పష్టత లేవనడానికి ఇలాంటి బహిరంగ విమర్శలే నిదర్శనమని ఆయన విమర్శించారు.

# పాప్‌కార్న్

## ఎక్కువగా మాట్లాడుతున్నారా?



అవసరం లేకపోయినా ఎక్కువగా మాట్లాడే వారు ఏదో ఒక సందర్భంలో ఎదురవుతారు. వీరికి 'భోళా మనుషులు' అని కితాబునిచ్చినప్పటికీ, మితంగా మాట్లాడే వారికే ఎక్కువ విలువ ఉంటుంది. వివిధ అధ్యయనాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఎక్కువగా మాట్లాడటం మీ ఉనికిని బలహీనపరుస్తుంది. సంక్షిప్తమైన పదాలు ఎక్కువ బలంగా, సూటిగా ఎదుటివారికి చేరుతాయి. 'ఎక్కువగా వివరించడం' అనేది ఎప్పుడూ అసురక్షిత భావన వల్లే ఉద్భవిస్తుంది. మౌనం మాత్రం ఆత్మవిశ్వాసాన్ని సూచిస్తుంది. అందుకే తక్కువ మాట్లాడాలి. వాదన చేయకుండా, 'నోట్ చేసుకున్నాను' అని మాత్రమే చెప్పాలి. ఎక్కువగా వివరించకుండా, సింపుల్‌గా 'మీ మాట వినిపించింది' అంటే సరిపోతుంది. కొన్నిసార్లు మౌనం అత్యంత బలమైన ప్రకటనగా మారుతుంది.

## అతి ధోరణికి అడ్రస్ 'అడెస్'



కొందరు అతిగా వ్యవహరిస్తుంటారు. కానీ, నిజమైన 'అతి'కి మారుపేరుగా అమెరికాలోని అరిజోనాకు చెందిన జాక్వెలిన్ అడెస్‌ను పేర్కోవాలి. 2018 – 2019 మధ్యకాలంలో, కేవలం 10 సంవత్సరాల వ్యవధిలోనే ఆమె ఒక వ్యక్తికి ఏకంగా 1,59,000లకుపైగా మెసేజీలు పంపింది. వివరాల్లోకి వెళితే, 'బంబుల్' అనే డేటింగ్ యాప్‌లో అడెస్ కు ఒక చర్మ సంరక్షణ కంపెనీ సిఇఒతో పరిచయమైంది. అంతే, అతనికి మెసేజీలు పంపడం మొదలు పెట్టింది. వీటిలో అనేక సందేశాలు భయపెట్టేలా, వికృతమైన విషయాలతో నిండివున్నాయి. చివరకు ఆ మహిళ అతని ఇంట్లోకి చొరబడి ప్రవేశించడంతో ఈ ఘటన మరింత తీవ్రమైంది. మొదట సాధారణంగా కనిపించిన ఒక ఆన్‌లైన్ డేటింగ్ మ్యాచ్, చివరికి ఎలాంటి ప్రమాదకర పరిస్థితులను సృష్టిస్తుందో చెప్పడానికి అడెస్ ఉదంతం ఒక ఉదాహరణగా నిలుస్తోంది. ఈ ఘటన ప్రేమాభిమానంగా మొదలైన ఆకర్షణ ఎలా క్రమంగా అబ్సెషన్‌గా మారి, వ్యక్తిగత హద్దులన్నింటినీ చెరిపేసే దాకా వెళుతుందో గుర్తు చేస్తుంది. ప్రతి ఆన్‌లైన్ పరిచయం సురక్షితంగా కాదని స్పష్టం చేస్తుంది. బయటికి సాధారణ చాటింగ్ కనిపించే సంబంధం, కొద్ది సమయంలోనే మానసిక అసమతుల్యత, బెదిరింపులు, హింసా అవకాశాల దిశగా జారిపోవచ్చు. ఇది ఒక విచిత్రమైన కథ కాదు. ఒక హెచ్చరికగా, ఆధునిక డేటింగ్ ఎంత వేగంగా చీకటి మలుపు తీసుకోవచ్చో తెలిపే కఠినమైన పాఠం. నిందితురాలు అడెస్ బాధితుడితో ఒకేసారి డేటింగ్ వెళ్లింది. అతను తిరిగి సంబంధం కొనసాగించకపోయినా, ఆమె నెల తరబడి రోజుకు వందల సందేశాలు పంపింది. అతని ఇంటి బయట కారులో కూర్చోవడం, చివరికి అతడు విదేశాలకు వెళ్లినప్పుడు ఇంట్లోకి చొరబడి స్నానం చేయడం వంటి చర్యలకు దిగింది. అడెస్ అసభ్య ప్రవర్తన, మెసేజీలపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు క్రిమినల్ స్టాకింగ్, ట్రెస్పాసింగ్, హరాస్మెంట్ కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం కేసు విచారణలో ఉంది.

## మష్రూమ్స్ ప్రభావం..



ఆఫ్ డ్యూటీ పైలట్ ఒకరు విమానం ప్రయాణిస్తున్న సమయంలోనే ఇంజిన్లు ఆఫ్ చేయడానికి ప్రయత్నించడం యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అతను చేసిన పని 83 మంది ప్రాణాలను ప్రమాదంలో పడేసేది. అయితే, పైలట్ ఆ ప్రయత్నాన్ని అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. తాజాగా బయటపడిన కాక్‌పిట్ ఆడియో ద్వారా 2023 అక్టోబర్‌లో జరిగిన ఆ సంఘటన వెలుగులోకి వచ్చిం ది. వివరాల్లోకి వెళితే, సియాటిల్ నుంచి సాన్ ఫ్రాన్సిస్కోకు బయలుదేరిన అలస్కా ఎయిర్‌లైన్స్‌కు చెందిన హారిజాన్ ఎయిర్ జెట్ పూర్తిగా కిక్కిరిపోయింది. దీనితో ఆఫ్ డ్యూటీ పైలట్ జోసెఫ్ ఎమర్సన్‌ను కాక్‌పిట్‌లోని జంప్ సీట్‌లో కూర్చోబెట్టారు. విమానం ఎగురుతున్నప్పుడు ఎమర్సన్ హఠాత్తుగా పైకప్పులో ఉన్న రెండు ఎమర్జెన్సీ ఇంజిన్ షట్‌ఆఫ్ హ్యాండిల్స్‌ను అందుకొని, వాటిని లాగేయడానికి ప్రయత్నించాడు. ఇవి సాధారణంగా అగ్ని ప్రమాదం జరిగితే ఇంజిన్‌కు ఫ్యూయల్ కట్ చేయడానికి ఉపయోగిస్తారు. అంటే విమానం ఇంజిన్లు పూర్తిగా ఆగిపోతాయి. కాగా, ఈ ఘటన జరిగిన వెంటనే ఎమర్జెన్సీ ల్యాండింగ్ కోసం పైలట్ విజ్ఞప్తి చేయ గా, పోర్ట్‌ల్యాండ్‌లో దిగేందుకు అధికారులు అనుమతించారు. అక్కడ ఎమర్సన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అంతకు ముందు రెండు రోజుల క్రితం తిన్న మ్యాజిక్ మష్రూమ్స్ ప్రభావం వల్ల తాను ఏం చేస్తున్నదీ తెలియలేదని, అంతగా అవి తన మస్తిష్కంపై ప్రభావం చూపాయని ఎమర్సన్ విచారణ సమయంలో పేర్కొన్నాడు. నిద్రలేమి కారణంగా తాను కలగంటున్నట్టు భావించానని, హ్యాండిల్స్ లాగితే నిద్రలేస్తానని భావించానని చెప్పుకొచ్చాడు. 'నా జీవితంలో అవే అత్యంత ప్రమాదకరమైన మూడు సెకెన్లు' అని ఒక ఇంటర్వ్యూలో ఎమర్సన్ వ్యాఖ్యానించాడు. అతనిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి.

— బిఎస్ఎస్ మైత్రేయి

# మహాత్మాగాంధీ పేరుకు ఎసరు

నరేంద్రమోదీజీ ఇదేం న్యాయం? ఎందుకు గాంధీజీ పేరు చెరిపివేసే ప్రయత్నం చేస్తున్నారు. మీకు నెహ్రూ–ఇందిరాగాంధీల కుటుంబంపై ద్వేషం ఉండవచ్చు, దాన్ని అడుగడుగునా ప్రదర్శిస్తూనే ఉన్నారు. వారికి వ్యతిరేకంగా అదే కాంగ్రెస్‌పార్టీలోని సర్దార్ వల్లభ్‌భాయి పటేల్‌ను సొంతం చేసుకుని తమరి పార్టీలో స్వాతంత్ర్య సమరయోధులు లేని కొరతను తీర్చుకుని ఆత్మ సంతృప్తి చెందుతున్నారు. స్వాతంత్ర్యపోరాట సమర నినాదంగా భాసిల్లిన బంకించంద్ర చటోపాధ్యాయ విరచిత 'వందేమాతరం' గీతాన్ని ఆ కాలంలో పాడటానికి మీ హిందూత్వ భావజాల వ్యవస్థాపక నాయకులకు గొంతు పెగలలేదు. ఎందుకంటే వారు బ్రిటిష్‌వారి సేవలో ఉన్నారు. స్వాతంత్ర్యం తర్వాత కూడా చాలాకాలంపాటు వారు, వారి వారసులైన మీ గణం ఆ గీతం పాడలేదు, త్రివర్ణ పతాకాన్ని నాగపూర్‌లోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై ఎగురవేయలేదు. గాంధీజీని మీ పూర్వాశ్రమవాసి గాడ్సే హత్యచేసిన అనంతరం ఆర్ఎస్ఎస్‌ను నిషేధించింది అప్పటి హోం మంత్రి పటేలే. అయినా పచ్చి అవకాశవాదంతో ఇప్పుడు ఆయన భజన చేస్తున్నారు. వందేమాతరం గీతాన్ని పాడని మీరు ఇప్పుడు కాంగ్రెస్‌ను దూషించేందుకు దాన్ని ఆయుధంగా ఉపయోగిస్తూ పరమ దేశభక్తి ప్రదర్శిస్తున్నారు. భారత రాజ్యాంగాన్ని ఆనాడు తూలనాడిన మీరు ఇప్పుడు దాని ఆధారంగానే అధికారం చలాయిస్తూ దానికి తూట్లు పొడుస్తున్నారు. ఇదంతా రాజ్యాంగం ఆదేశించిన లౌకికవాదానికి వ్యతిరేకమైన హిందూమతోన్మాద బతుకుతెరువు రాజకీయం అని సరిపెట్టుకుందామా? కానేకాదు, ఉద్దేశపూర్వకంగా సాగిస్తున్న వక్రీకరణ. లేని పాత్రను ఆపాదించుకునే దుర్మార్గపు ప్రయత్నం. హిందూ–ముస్లింల మధ్య శాంతి, సహజీవనం కోసం పాటుబడిన, జీవితాన్ని త్యాగం చేసిన, దూరదృష్టితో జవహర్‌లాల్ నెహ్రూను తొలి ప్రధానిని చేసిన జాతిపిత మహాత్మాగాంధీపట్ల కూడా మీకున్న ద్వేషాన్ని మీరు అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన 'స్వచ్ఛభారత్'కు ఆయన కళ్లజోడు చిత్రాన్ని సంకేతంగా ఉపయోగించినప్పుడే సూచనప్రాయంగా వెల్లడైంది. ఇప్పుడు మీ మంత్రివర్గం "మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం" నుండి ఆయన పేరు తొలగించాలని నిర్ణయించి విద్రోహానికి పాల్పడింది. 'మహాత్మాగాంధి' పేరు తొలగించి 'పూజ్య బాపూ' అని చేర్చి తమ భక్తిభావాన్ని చాటుకున్నామని మీరు చెప్పుకోవచ్చు. నరేంద్రమోదీ అంటే అత్యధిక జనాభాకు తెలుస్తుందా లేక ఎన్.డి.డి.మోదీ (నరేంద్ర దామోదర్ దాస్ మోదీ)అంటే తెలుస్తుందా? అలాంటిదే ఆ చట్టంలో పేరు మార్పు కూడా. పూజ్య బాపూ అనేది ఇప్పుడే బహు పరిమితంగా వాడుకలో ఉంది. కొన్ని దశాబ్దాల తదుపరి ఆ ఉచ్ఛారణతో 'మహాత్మాగాంధి' అని గుర్తింపు పొందిన మోహన్‌లాల్ కరంచంద్‌గాంధి ప్రజలకు జ్ఞప్తికిరావటం దుర్లభమవుతుంది. జాతిపితగా మహాత్మాగాంధి బదులు సావర్కార్ పునరుద్ధానం పొందినా, కరెన్సీ మీద గాంధీజీ బొమ్మబదులుగా గాడ్సే బొమ్మవచ్చినా ఆశ్చర్య పడవలసిన రోజులొస్తాయేమో! ఆర్ఎస్ఎస్–బిజెపి 'హిందూ రాష్ట్ర' స్థాపన అంతిమ పర్యవసానం అంత భయంకరంగా ఉండవచ్చు.

ప్రజాపక్షం

14-12-2025, ఆదివారం

అందువల్ల దేశ ప్రజలు మోదీ మాయమాటలకు, ప్రలోభాలకు, యోగి పుంగవ వేషాలకు మోసపోకుండా అప్రమత్తం కావాలి, భారత రాజ్యాంగ "సర్వసత్తాక, సోషలిస్టు, సెక్యులర్ ప్రజాతంత్ర రిపబ్లిక్" విలువలు, స్ఫూర్తి పరిరక్షణకు నడుం కట్టాలి.

యుపిఎ తొలి ప్రభుత్వ కాలంలో 2005 ఆగస్టు 5న పార్లమెంటు "జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం" ఆమోదించింది. ఆ చరిత్రాత్మక చట్టానికి 2009లో ఆ పేరుకు ముందు "మహాత్మాగాంధి" చేర్చబడింది. మోదీ ప్రభుత్వం ఈ చట్టాన్ని "పూజ్యబాపు గ్రామీణ రోజ్‌గార్ యోజన" (పథకం)గా మార్పు చేయనుంది. 'హామీ' ఎగిరిపోతుంది. "చట్టం" స్థానంలో "పథకం" చేర్చితే ఆ పథకానికి చట్టం ప్రతిపత్తి ఉండదు. దీనిపై వివరణ రావాల్సి ఉంది. ఈ మార్పులకు వ్యతిరేకతను బుజ్జగించే చర్యగా కావచ్చు, ఈ పథకం అమలును 100రోజుల నుంచి 125 రోజులకు పెంచుతారట! గత ఐదేళ్లలో దీని అమలు సగటు 50.35రోజులని మంత్రి కమలేశ్ పాశ్వాన్ శుక్రవారం రాజ్యసభకు లిఖితపూర్వక జవాబుగా తెలియజేశారు. ఇతర మెరుగైన ఉపాధి అవకాశం లేనప్పుడే ఈ చట్టం వర్తిస్తుందని చెప్పారు. ఈ చట్టంకింద ఉపాధికి ధనం కేటాయింపును కూడా పెంపు చేస్తారు. అయితే అమలులో ఉన్న చట్టం కింద ఏటేటా పనిదినాల సంఖ్య తగ్గుదల, బడ్జెట్ కేటాయింపు కుదింపు, కనీస వేతనం కన్నా తక్కువ దినకూలీ నిర్ణయం, చెల్లింపుల్లో విపరీత జాప్యం, డిజిటల్ రిజిస్ట్రేషన్ పేరుతో పదుల లక్షలమందిని కవరేజి నుంచి తొలగించటం నడుస్తున్న చరిత్ర. ఈ అతి పెద్ద సామాజిక భద్రతా పథకాన్ని కుదించి నిరుపేద అవసరార్థుల కడుపుకొడితే ప్రభుత్వం ప్రతిఫలం అనుభవించక తప్పదు! గాంధీజీ పేరుతో పాటు ఉపాధి హామీ చట్టం తెచ్చిన ఖ్యాతి యుపిఎ ప్రభుత్వం రికార్డునుంచి చెరిపివేయబడుతుంది.

భారతదేశ అభివృద్ధి చరిత్ర తమ అధికారంతోనే ప్రారంభమైనట్లు తప్పుడు ప్రచారం చేసుకుంటున్న మోదీ ప్రభుత్వం ఇటువంటి చిల్లర ప్రయత్నాలు చేయటంలో ఆశ్చర్యం లేదు.

# ప్రభుత్వ రంగంలోనే అణు విద్యుత్ ఉండాలి



చలసాని వెంకట రామారావు
9490952093

1962 అణు ఇంధన చట్టం ప్రకారం ప్రభుత్వరంగ సంస్థలు మాత్రమే అణు విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆ మేరకు అణు రియాక్టర్ల తయారీ, అణు ఇంధనం, అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణం, నిర్వహణ, ఉత్పత్తి వంటి అంశాలు అన్నీ ఇప్పటివరకు ప్రభుత్వరంగ సంస్థల ద్వారా నిర్వహించటం జరుగుతున్నది. కానీ ఇప్పుడు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నవంబరు 27న హైదరాబాద్‌లో ఒక కార్యక్రమానికి వర్చువల్ గా హాజరై తన ప్రసంగంలో దేశంలో అణు విద్యుత్ ఉత్పత్తికి ప్రైవేటురంగానికి తలుపులు బార్లా తెరుస్తున్నామని ప్రకటించారు. అందుకుగాను పార్లమెంటు శీతాకాల సమావేశాలలోనే "అణు ఇంధన చట్టం –2025"ను ప్రవేశపెట్టి ఆమోదింపజేస్తామని చెప్పారు. అంతకుముందు 2025–26 వార్షిక బడ్జెట్‌లోనే ప్రైవేటు రంగానికి అవకాశాలు కల్పించాలని భావించి దానిని ఇప్పుడు చట్టబద్ధం చేయనున్నారు. దీనితోపాటు 2010 'సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ యాక్ట్'(సిఎల్ఎన్‌డి)కి కూడా సవరణలు చేయనున్నారు. గత సంవత్సరమే కేంద్ర ప్రభుత్వం ప్రైవేటురంగ సంస్థలు తమ విద్యుత్ అవసరాల నిమిత్తం 'స్మాల్ మాడ్యులార్ రియాక్టర్లు'(ఎస్ఎంఆర్) ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం దేశం 8.8 గిగావాట్లు అంటే 8,800 మెగావాట్ల అణువిద్యుత్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. దీనిని 2047 నాటికి 100 గిగావాట్ల సామర్థ్యానికి పెంచాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ప్రైవేటు రంగం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించాలని ఆశిస్తున్నది.

దీనిలో భాగంగా రానున్న ఏడేళ్లలో అంటే 2032 నాటికి 22 గిగావాట్లు అంటే 22,400 మెగావాట్లు సామర్థ్యానికి చేరుకోవాలని, 2070 నాటికి పూర్తి విద్యుత్ ఉత్పత్తి కాలుష్య రహితంగా చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ఒక ప్రక్కన ప్రధానమంత్రి ఈ ప్రకటన చేసిన తక్షణమే అదానీ గ్రూపు స్పందించింది. 1.57లక్షల కోట్ల పెట్టుబడితో ఈ రంగంలో ప్రవేశానికి ఆసక్తిని ప్రకటించింది. పిపిపి ఫార్ములా అంటే ప్రభుత్వ,ప్రైవేటు, పార్టనర్‌షిప్ ఫార్ములా అమలు చేస్తే అందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. అంటే ఇక్కడ ప్రైవేటు రంగం ప్రవేశం అంటే అదానీ ప్రవేశం అని అర్థం అవుతుంది. ఇప్పటికే 90 వేల కోట్ల రుణానికి కార్యాచరణ ప్రణాళికను కూడా అదానీ కంపెనీ ప్రారంభించింది. అంటే ప్రభుత్వం, అదానీల మధ్య ముందస్తు గూడుపుఠానీ ఫలితంగానే ప్రభుత్వ అణు విద్యుత్ రంగ ప్రైవేటీకరణ విధానం దాగి ఉందని అర్థం అవుతుంది.

భారతదేశం 2029 నాటికి ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందనుందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలవాలనే లక్ష్యం దిశగా పురోగమించాలంటే పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ అవసరాలకు తగిన రీతిలో మన విద్యుత్ వనరులు పెంపొందించుకోవాలని అందుకు ప్రైవేటురంగంలో అణు విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం ఆవశ్యకమని ప్రభుత్వం భావిస్తున్నది. ప్రస్తుతం అమలులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి విధానం వలన పలు పర్యావరణ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, దీనినుండి బయట పడేందుకు అణు విద్యుత్ ఉత్పత్తే మార్గమని ప్రభుత్వం భావన. కానీ ఎప్పుడో అణువిద్యుత్ ఉత్పత్తి, వినియోగంలో ముందు పీఠిన ఉన్న ఫ్రాన్స్, రష్యా, అమెరికా వంటి దేశాలు తమ దేశాలలో అణు విద్యుత్ నుండి బయట పడాలని ఆలోచిస్తుంటే భారత్ మాత్రం అణువిద్యుత్ పైన ఆధార పడాలనే తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అణు విద్యుత్ ఉత్పత్తిలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న ఫ్రాన్స్ దేశం ఇప్పుడు సగం రియాక్టర్లను మూసివేసింది. వీటి నిర్వహణ వ్యయం పెరిగిపోవటం, శీతలీకరణకు అవసరమైన నీటికొరత, భద్రతా సమస్యలు ఈ మూసివేతకు కారణంగా ఉన్నాయి. దీనితో ఫ్రాన్స్ అణుశక్తిపై ఆధారపడటాన్ని పునరాలోచిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద అణు విద్యుత్ ఉత్పత్తిదారు అయిన ఫ్రాన్స్ దేశంలోని 56 విద్యుత్ రియాక్టర్లను ప్రభుత్వానికి చెందిన "ఎలక్ట్రిసిటీ డి ఫ్రాన్స్(ఇ.డి.ఎఫ్)" మాత్రమే నిర్వహిస్తున్నది. ఐనా ఫ్రాన్స్ దేశంలో అణు విద్యుత్ కర్మాగారాల నిర్మాణం పట్ల ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది.

అమెరికా సైతం విద్యుత్ ప్లాంట్ల నుండి వచ్చే రేడియోధార్మిక వ్యర్థాలను సురక్షితంగా, శాశ్వతంగా నిల్వ చేయటానికి పెద్ద సవాలునే ఎదుర్కొంటున్నది. ప్రస్తుతం ఉన్న ప్లాంట్లను మూసివేయటానికి సైతం ఆర్థిక భారంతో తల్లడిల్లిపోతున్నది. ప్లాంట్ల నిర్వహణకు అవసరమైన అణు ఇంధనం (యురేనియం) సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. అతి పెద్ద అణు విద్యుత్ ఉత్పత్తిదారు అయినప్పటికి అమెరికా ఎన్నో సవాళ్ళను ఎదుర్కొంటున్నది. గత 30 సంవత్సరాలుగా అమెరికాలో కొత్త అణు విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం దాదాపుగా ఆగిపోయింది. ఇక రష్యాలో జరిగిన కొన్ని చారిత్రక ప్రమాదాలు, రాజకీయ ఉద్రిక్తతలు, ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా అణు విద్యుత్ కేంద్రాలపై డ్రోన్ దాడులు, అంతర్జాతీయ ఆంక్షలు, నిర్వహణ సమస్యల కారణంగా ఈ రంగం గందరగోళానికి గురవుతున్నది. రష్యా విద్యుత్ ఉత్పత్తిలో 20శాతం వాటా కలిగి ఉన్న అణు రియాక్టర్ల నిర్వహణ ఆ దేశానికి నేడు పెను సవాళ్లు విసురుతున్నది. ఈ కష్టాలు ఇతర అణు విద్యుత్ ఉత్పత్తి దేశాలు సైతం ఎదుర్కొంటున్నాయి.

భారతదేశంలో బొగ్గుద్వారా, జల, సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి తరువాత వనరుగా అణు విద్యుత్ ఉంది. 2025 ఏప్రిల్ నాటికి దేశం లో ఎనిమిది అణు విద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. 25 రియాక్టర్లు పనిచేస్తున్నాయి. భారతదేశ విద్యుత్ ఉత్పత్తిలో మూడు శాతాన్ని ఇది ఆక్రమించింది. ప్రస్తుతం మరో 11 అణు రియాక్టర్లు నిర్మాణ దశలో ఉన్నాయి. 1969లో మహారాష్ట్రలోని తారాపూర్‌లో, 1972లో రాజస్థాన్‌లోని రావత్ భట్టాలో, 1984లో తమిళనాడులోని కల్పకంలో, 1989లో ఉత్తరప్రదేశ్‌లోని నరోరాలో, 1992లో గుజరాత్‌లోని కాక్రపారాలో, 2000లో కర్ణాటకలోని కైగాలో అణు విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం జరిగింది. కానీ 2011 మార్చిలో జపాన్‌లో జరిగిన పుకుషిమా అణు విపత్తు తర్వాత మన దేశంలో ఫ్రెంచి సహకారంతో మహారాష్ట్రలో నిర్మించిన 9,900 మెగావాట్ల జైతాపూర్ ప్రాజెక్టు, రష్యా సహకారంతో తమిళనాడులో 2,200 మెగావాట్ల కూడంకుళం అణు విద్యుత్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి.

పశ్చిమ బెంగాల్‌లోని హరిపూర్ సమీపంలోని 6000 మెగావాట్ల 6 రష్యన్ రియాక్టర్ల విద్యుత్ కేంద్రానికి రాష్ట్రప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. దీనిని ఆంధ్రప్రదేశ్‌లోని కావలికి తరలించారు. గుజరాత్‌లోని మితివిర్ధి వద్ద ప్లాంటు నిర్మాణానికి ప్రజలు వ్యతిరేకత వ్యక్తం చేయటంతో దానిని శ్రీకాకుళంలోని కొవ్వాడ సముద్రతీరానికి తరలించారు. రష్యాలోని చెర్నోబిల్ అణు ప్రమాదం ప్రపంచానికి ఒక హెచ్చరికలా పనిచేసింది. మన దేశంలో భోపాల్‌లోని ప్రైవేటు విదేశీ కంపెనీ యూనియన్ కార్బైడ్ పెనుప్రమాదం ఎంతటి విధ్వం సం సృష్టించిందో మనం ప్రత్యక్షంగా అనుభవించాం. బాధితులకు దశాబ్దాలుగా సరైన నష్టపరిహారం కూడా సాధించుకోలేకపోయాం. ఇప్పుడు ఏకంగా అణు విద్యుత్ ప్లాంట్లు ప్రైవేటు రంగానికి అప్పగిస్తే ఏం జరగబోతుందో ఆలోచించాలి.

ఒకవేళ అణు విద్యుత్ ప్లాంటులో అనుకోని ప్రమాదం ఏదైనా జరిగితే లక్షలమందికి అత్యవసర పునరావాసం కల్పించాలి. వేల కిలోమీటర్ల ప్రాంతం కలుషితం అవుతుంది. భూమి, ఆకాశం, నీరు, వాతావరణం నాశనమై పోతాయి.

జీవజాతులపై తీవ్ర ప్రమా దం పడుతుంది. దీర్ఘకాలంపాటు అణు ప్రమాదం మన ప్రజలను వెంటాడి వేటాడుతుంది. లక్షలకోట్ల రూపాయల ఖర్చు ఉంటుంది. 2014 నాటికి ప్రపంచంలో సుమారు 100 ప్రమాదాలు జరిగినట్లు అంచనా. ఒక చెర్నోబిల్ ప్రమాదంలోనే 10 లక్షల క్యాన్సర్ మరణాలు సంభవించినట్లు అంచనా వేయబడింది. ఇటువంటి విపత్తులను భారతదేశం వంటి ఆర్థిక వ్యవస్థలు తట్టుకుని మనుగడ సాగించగల వా అనేది శేషప్రశ్న. మన ప్రధానమంత్రి మోదీ చెప్పినట్లు ప్రైవేటురంగానికి అణు విద్యుత్ తయారీ రంగాన్ని అప్పగిస్తే భద్రత కొరవడుతుంది. నియంత్రణ వ్యవస్థ వత్తిడికి, అధికార దర్పానికి గురవుతుంది.

పాలకులు పెద్ద ఎత్తున ప్రైవేటురంగాన్ని ప్రోత్సహిస్తూ నాణ్యతా ప్రమాణాలను పట్టించుకోకపోవటం మనం చూస్తున్నాం. ప్రైవేటురంగం కేవలం లాభాపేక్ష కలిగిన పెట్టుబడిదారుల లాభాలను పెంచటానికి దోహదం చేస్తుంది తప్ప ప్రజాప్రయోజనం తక్కువగా ఉంటుంది. విదేశీ టెక్నాలజీ పేరుతో ఆయా దేశాలలో పాతబడిన నిల్వ ఉంచిన యంత్ర పరికరాలను దిగుమతి చేసుకుని మనం సాంకేతిక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది.

అందువల్ల భద్రత, ప్రమాద బాధ్యతల రీత్యా ప్రైవేటురంగం గూర్చి లోతుగా ఆలోచించాలి. కఠిన నియంత్రణ, పర్యవేక్షణ ప్రైవేటురంగంలో సాధ్యం కాదు. ప్రభుత్వ నిర్ణయాలను, చివరకు సుప్రీం కోర్టు తీర్పులను సైతం ప్రైవేటురంగం ఎలా ఉల్లంఘిస్తున్నదో మనకు తెలియనిది కాదు. ఈ స్థితిలో కేంద్రప్రభుత్వం ఈ అంశాలను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వరంగంలోనే అణువిద్యుత్ ఉత్పత్తిని సాగిస్తే దేశానికి మేలు జరుగుతుంది.




# విజన్ మంచిదే... వాటికీ చోటుండాలి!




ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కలల నగరం 'ఫ్యూచర్ సిటీ' రెక్కలు విప్పుకునే రీతిలో రెండు రోజుల పాటు జరిగిన 'గ్లోబల్ సమ్మిట్'లో తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును ఆవిష్కరించారు. మీర్‌ఖాన్‌పేటలో డిసెంబర్ 8, 9 తేదీలలో వైభవోపేతంగా నిర్వహించిన ఈ శిఖరాగ్ర సదస్సు ద్వారా రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు, అవగాహనలు కుదిరాయి. ఆ ప్రాంగణంలో నిర్వహించిన హైదరాబాద్ మహానగరం సహా నాలుగవ నగరంగా పేర్కొంటున్న భవిత నగరి అభివృద్ధి నమూనాను వినూత్నంగా, వైవిధ్యభరితంగా తెలియజేసే సైఫై ఎగ్జిబిషన్ అందరినీ అక్కటుకుంది. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్ళు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలనే అనుకుంటున్నారనేది తెలియజేసేందుకు సమ్మిట్ చివరి రోజున 'విజన్ – 2047' దార్శనిక పత్రాన్ని ప్రజల ముందుంచారు ముఖ్యమంత్రి. వచ్చే 22 ఏళ్ళలో ఏ విధంగా అభివృద్ధి చేయాలనుఉంటున్నారో వివరిస్తూ రూపొందించిన మొట్టమొదటి డాక్యుమెంట్ ఇదేనంటే అతిశయోక్తి కాదు. గత ప్రభుత్వం తమ ఆలోచనలను పలు సందర్భాలలో ప్రకటించినప్పటికీ, ఈ విధంగా ఒక దార్శనిక పత్రం రూపంలో ఒక ప్రభుత్వం తీసుకురావడం ఇదే మొదటి సారి. ఇప్పటి వరకు ఐటి, హైదరాబాద్ నగరాభివృద్ధికి సంబంధించి హైటెక్, మధ్యతరగతి సర్కిల్స్‌లో నలుగుతున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, గత ఐటి శాఖ మంత్రి కె.టి.రామారావుల పేర్లు వినిపిస్తుంటాయి. తాజా విజన్ డాక్యుమెంట్ ద్వారా ఆ వర్గాల చూపును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన వైపు తిప్పుకోగలిగారు.

2047 నాటికి .3 ట్రిలియన్ డాలర్లు, అంతకుముందు 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను రూపొందించాలని లక్ష్యం అందులో కనబడింది. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ (జిఎస్‌డిపి–స్థూల రాష్ట్ర ఉత్పత్తి) విలువ 210 బిలియన్ డాలర్లు (రూ.16.12 లక్షల కోట్లు). అంటే దీనిని 14 సార్లు చేయాలనే భారీ లక్ష్యాన్ని ముందుంచుకున్నది ప్రభుత్వం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి మూడింతలు పెరుగుదలను చవి చూసింది. తాజాగా వెలువడిన ఆర్‌బిఐ ర్యాంకింగ్‌లో దేశంలోని అన్ని రాష్ట్రాలలో తెలంగాణ జిఎస్‌డిపి పరంగా నంబర్‌వన్ స్థానంలో నిలిచింది. ఇది ఒక ఆశాజనక పరిణామం. చూసేందుకు భారీగా కనపడుతున్నప్పటికీ అసాధ్యమేమీ కాదని ఆర్‌బిఐ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. మూడు ట్రిలియన్‌ల డాలర్లు లక్ష్య సాధనకు ప్రధానంగా 80 శాతం ప్రైవేటు పెట్టుబడు లు(అందులో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 40 శాతం)పైనే రాష్ట్ర ప్రభుత్వ ఆధారపడింది.అంటే ప్రైవేటు రంగంపైనే జిఎస్‌డిపి పెరుగుదల ఆధారపడి ఉందనేది సుస్పష్టం.

## సంపద సృష్టి సరే.. సంపద సృష్టికర్తలకు భద్రతేదీ?

సంపదను సృష్టిస్తాం.. సృష్టించిన సంపదను పంపిణీ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా ప్రచారం చేసింది. అందుకు అనుగుణంగానే విజన్ డాక్యుమెంట్‌ను కూడా రూపొందించారు. అయితే, సంపద సృష్టికర్తలుగా పారిశ్రామికవేత్తలు, ఐటి, ఎఐ కంపెనీల యాజమాన్యాలు మాత్రమే అని భావిస్తే పొరపాటే అవుతుంది. సంపద సృష్టించడంలో ప్రధాన భాగస్వాములు అందులో పని చేసే ఉద్యోగులు, కార్మికులు. వారి ఉద్యోగ భద్రత, పని ప్రదేశంలో భద్రత, సంక్షేమం, పట్ల రాష్ట్ర ప్రభుత్వం మరింత విస్తారంగా వివరించాల్సి ఉంది. ఎందుకుంటే విజన్ డాక్యుమెంట్ విడుదలైన రోజే తెలంగాణ హైకోర్టు సిగాచి ఫ్యాక్టరీలో పేలుడు ఘటనపై విచారణ సందర్భంగా కార్మికుల భద్రతపై తీసుకుంటున్న చర్యల విషయంలో అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ ఘటన జరిగి ఐదు నెలలు దాటినా ఘటనలో మరణించిన కార్మికులందరికీ పరిహారం చెల్లింపు వివరాలు అందించకపోవడం, పేలుడుపై ఫ్యాక్టరీల విభాగం తప్ప మిగతా 10–12 ప్రభుత్వ విభాగాలు పట్టించుకోవడం వంటి కీలక ప్రశ్నలను లేవనెత్తింది. చట్టా లు, మార్గదర్శకాలు అనేకం ఉన్నప్పటికీ వాటిని పాటించకపోవడంతో పాటు, ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలనే నిబంధనలు అమలు కాలేదని అభిప్రాయం వ్యక్తం చేసింది హైకోర్టు. బలమైన యాజమాన్యాలు ఉన్నప్పుడు కార్మికులు ఎలా నోరెత్తగలరనే ప్రశ్న వేసింది.

ఇవి గమనంలోకి తీసుకోవాల్సిన అంశాలే. ఇక మరొక అంశం అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షించే పేరుతో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పోరాడి సాధించుకున్న అనేక కార్మిక హక్కులను పలుచబారుస్తూ నాలుగు కార్మిక కోడ్‌లను తీసుకువచ్చింది. దీని ద్వారా 8 గంటల పనివిధానం స్థానంలో 10–12 గంటల పని దినం తీసుకువచ్చే సౌలభ్యం కల్పించింది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు ఆ మేరకు జిఒలు తీసుకువచ్చాయి. మన రాష్ట్రంలో సైతం. అలాంటి సడలింపునిస్తూ జిఒ 282ను తీసుకురావడంపై కార్మిక సంఘాలు ఇప్పటికే తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల స్వయంగా పార్లమెంటు వెలుపల నాలుగు కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా, వాటిని ఉపసంహరించుకోవాలని కోరుతూ కాంగ్రెస్ సహా ఇండియా కూటమి పక్షాలు నిరసన తెలిపాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే పని గంటల పెంపు పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. మరోవైపు వైట్ కాలర్‌గా ఉద్యోగులుగా చెప్పుకునే ఐటి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పరిస్థితి కూడా ఏమంత బాగోలేదు. ఇన్ఫోసిస్, టిసిఎస్ లాంటి బడా కంపెనీలే ఆ ఉద్యోగాల్లో కోత విధిస్తున్నాయి. ఇన్ఫోసిస్ నారాయణమూర్తితో పాటు మరి కొందరు వ్యాపార దిగ్గజాలు, ఐటి ఉద్యోగులు రోజుకు 12గంటలు వారానికి ఆరు రోజులు పనిచేయాలని చెబుతున్నారు. వర్క్ ఫ్రం హోంలో ఉన్నప్పటికీ ఐటి ఉద్యోగు లు రోజుకు 10, 12గంటలు పనిచేయడం సర్వ సాధారణం గా మారిపోవటం అందరం గమనిస్తూనే ఉన్నాం.

## సామాజిక అంశాలు

పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థలో అనేక సామాజిక అంశాలు సైతం తెరపైకి వస్తున్నాయి. పెరిగే ఆర్థిక అంతరాలకు తోడు, నిత్యావసరాల ధరలు, ఇళ్ల అద్దెలు, ఉద్యోగ భద్రత, అధిక విద్య, వైద్య ఖర్చులు అధికమవుతుండడం తదితరాలు అలాంటివే. అలాగే రియల్ ఎస్టేట్ ధరలు విపరీతంగా పెరిగి సొంత ఇళ్ళు కొనుక్కోలేని పరిస్థితి. ఇవి మామూలు సమస్యలు అనిపించినప్పటికీ పెరిగే ఆర్థిక వ్యవస్థతో పాటు మరింత తీవ్రమవుతాయని ప్రపంచ దేశా ల అనుభవాలు నిరూపిస్తున్నాయి. అమెరికా ఆర్థిక రాజధానిగా చెప్పుకునే ధనిక నగరం న్యూయార్క్‌లో ఇటీవల మేయర్ ఎన్నికల్లో ఇవే ప్రధాన అంశాలుగా మారాయి. విద్య, వైద్యానికి సంబంధించి ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేస్తామని విజన్ డాక్యుమెంట్లో పేర్కొన్నారు . అలాగే త్వరలో అందుబాటు ధరలో ఇళ్ళ విధానాన్ని కూడా ప్రకటిస్తామని ప్రభుత్వం తెలియజేసింది. అనేక అభివృద్ధి చెందిన దేశాలలో యువత పెరుగుతున్న ఖర్చులకు జడిసి పిల్లలను కనకపోవడం, లేదా పెళ్ళి చేసుకోకపోవడం కనిపిస్తుంది. ఇది జనా భా తరుగుదలకు కారణమవుతోంది. ఒకవైపు భావి తరం తగ్గిపోవడం, వృద్ధ జనాభా పెరిగిపోతుండడం అభివృద్ధి చెందుతున్న దేశాలకు సమస్యగా మారింది. సాంకేతి పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సు పెరుగుదలతో ఉద్యోగాల కోత, వేతనాల తగ్గింపు సర్వసాధారణమవుయని ఆందోళనలు నెలకొన్నా యి. ఉద్యోగాలకు పోటీ పెరిగితే కనీస వేతనాలు కూడా అమలు కాకపోయే ప్రమాదం లేకపోలేదు. వాటిని విజన్–2047లో పరిగణనలోకి తీసుకోవాలి.

### స్కాండినేవియన్ తరహా పెన్షన్ భేష్..

వృద్ధులకు స్కాండినేవియన్ తరహా పెన్షన్ విధానం తెలంగాణలో అమలు చేయాలనే దీర్ఘకాలిక లక్ష్యాన్ని విజన్ డాక్యుమెంట్లో పేర్కొనడం ఆహ్వానించదగింది. యూరప్‌లోని డెన్మార్క్, నార్వే, స్వీడన్ దేశాలను స్కాండినేవియా దేశాలుగా పిలుస్తారు. అక్కడ సంక్షేమ పథకాలు అత్యుత్తమ స్థాయిలో ఉంటాయి. అందరికీ మెరుగైన సార్వత్రిక వైద్య, విద్య సౌకర్యాలు కల్పిస్తారు. అలాగే అత్యుత్తమ పెన్షన్ విధానం ఉంటుంది. ఫలితంగా అక్కడి పౌరులు సంపూర్ణ భద్రతను ఆస్వాదిస్తారు. దీంతో అత్యంత ఆనంద దేశాల జాబితాలో స్కాండినేవియా దేశాలు ముందుంటాయి. అలాగే ప్రపంచం లో సంపద పెరుగుదలతోపాటు ఆదాయ అంతరాలు తక్కువున్న దేశాలు ఆ మూడే.

దీని వెనుక కారణం అక్కడ విద్యా, వైద్య రంగాలలో ప్రభుత్వరంగం పటిష్ఠంగా ఉండడంతో పాటు, ప్రైవేటు రంగంలో కూడా ఉద్యోగులు, కార్మికులకు మెరుగైన వేతనాలు, వసతులు లభిస్తాయి. ఆ దేశాలలో యాజమాన్యాలు, కార్మిక సంఘాలు అత్యంత సుహృద్భావ వాతావరణంలో చర్చించుకొంటారు. యాజమాన్యాలు సైతం ఉదారంగా వేతనాలు ఇస్తుంటారు. దీంతో అక్కడ సంతృప్తి స్థాయి ఎక్కువగా ఉండడంతో పాటు ప్రజలు కష్టపడి పనిచేస్తుంటారు. అంతకుమించి పన్నులను ఇతర దేశాలకంటే అక్కడే ఎక్కువ కడుతుంటారు. స్కాండినేవియన్ పెన్షన్ అమలులతో పాటు అక్కడ యాజమాన్య, ఉద్యోగ, ప్రభుత్వ సంబంధాలలో మంచి విధానాలు తీసుకుంటే మంచిది. మొత్తానికి విజన్ డాక్యుమెంట్ సమగ్రతతో పాటు, దూరదృష్టి కలిగి ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో దానిపై విశ్వాసాన్ని రేకెత్తించగలిగింది. దాని ఆచరణకు బాటలు వేయాల్సిన బృహత్తర బాధ్యతపై ప్రభుత్వంపై ఉంది.

## లెదర్‌పార్క్ నిర్మాణాన్ని ప్రభుత్వం తక్షణమే చేపట్టాలి

**ప్రజాపక్షం/మధిర :** దళిత నిరుద్యోగ యువత కోసం లెదర్ పార్క్ నిర్మాణాన్ని ప్రభుత్వం తక్షణమే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కూరపాటి సునీల్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం మదుపల్లిలో లెదర్‌పార్క్‌కు కేటాయించిన స్థలాన్ని ఎమ్మార్పీఎస్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా సునీల్ మాదిగ మాట్లాడుతూ నిరుద్యోగ దళిత వర్గాలకు ఉపాధి కల్పించేందుకు ఉమ్మడి రాష్ట్ర హయాంలో మధిర మున్సిపాల్టీ పరిధిలో మదుపల్లిలో ప్రతిపాదించిన లెదర్‌పార్క్ నిర్మాణం నేతల హామీలకే పరిమితమైందన్నారు. 2002లో లెదర్‌పార్క్‌కు మదుపల్లిలో సర్వే నెంబర్ 701లో 26 ఎకరాల స్థలాన్ని అప్పటి ప్రభుత్వం కేటాయించిందని, సర్వే అనంతరం 2003లో ప్రభుత్వం లీడ్ క్యాప్ వారికి ఆ స్థలాన్ని అప్పగిస్తూ అప్పటి కలెక్టర్ అరవింద్‌కుమార్ జీవో జారీ చేశారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చర్మ కార్మికులకు ఎంతో ప్రయోజం కలిగే ఉండేదన్నారు.

## రెండవ విడత ఎన్నికలకు పటిష్ట భద్రత

ఎస్పి రోహిత్ రాజ్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో రెండో విడత పంచాయతీ ఎన్నికలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పి రోహిత్ రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 766 కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎలాంచి అవాంఛనీయ సంఘటమలు చోటు చేసుకోకుండా 1500 మంది విధుల్లో ఉంటారన్నారు. 1392 సాధారణ పోలింగ్ కేంద్రాలలో సాధారణ పోలింగ్ కేంద్రాలు 878 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 179, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు285 మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలు50లను గుర్తించినట్లు తెలిపారు. ప్రజలంతా నిర్భయంగా తమ ఓటు హ క్కును వినియోగించుకోవాలని ఎస్పి సూచించారు. ఓటర్లను ప్రలోబపెట్టే విధంగా ఎవరైనా నగదు, మద్యం పంపిణీ చేస్తూ పట్టుబడితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## భద్రాచలం అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తాం

విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేతలు



**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలాభివృద్ధికి ఎలాంటి రాజీ లేకుండా, రాగద్వేషాలు లేకుండా కట్టుబడి పనిచేస్తామని ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మీ నారాయణ తెలిపారు. శనివారం స్థానిక కేకే ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. భద్రాచలం మేజర్ గ్రామ పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఘనంగా గెలిపించిన ప్రజలకు, ఎన్నికలవిజయానికి కష్టపడ్డ పార్టీ నాయకులు, కార్యకర్తలను అభినందించారు. ప్రజల విశ్వాసానికి తగిన విధంగా భద్రాచలం అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాటను తూచా తప్పకుండా నెరవేరుస్తామని, ప్రజలకు కూడా సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో సర్పంచ్ పూనెం కృష్ణ, ఉపసర్పంచ్ రత్నం కవిత, చెంచు సుబ్బారావు, బంబోతుల రాజేష్, బొంత రమణ, నర్రా వాణి, పెద్దినేని లక్ష్మి , కారం సుజాత, నిట్ట రాజు, భూక్య సుశీల, కారం దుర్గారావు, తాటి ఉదయ్‌కుమార్, సున్నం ఈశ్వరి, సున్న భూ లక్ష్మి , జగ్గా కుమారి, మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేటలో హస్తం హవా

కాంగ్రెస్ పథకాలతో విస్తృత ప్రచారం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని సదాశివునిపేటలో హస్తం హవా కనిపిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సం క్షేమ పథకాలు తమకు పట్టం కడతాయని కాంగ్రెస్ నాయకులంటున్నారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి చాట్ల దుర్గ తన ప్యానల్ తో ముమ్మర ప్రచారం చేస్తూ గెలుపు దిశగా దూసుకుపోతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామంలో అర్హులైన లబ్దీదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందించామని, గ్రామాన్ని అభివృద్ధి పదంలో నడిపించుకోవటానికి అందరూ కలిసి కట్టుగా ఉంగరం గుర్తుపై ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆమె ఓటర్లను ఓట్లు అభ్యర్థిస్తున్నారు. గ్రామంలోని 10 వార్డుల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు విజయ ఢంకా మోగిస్తారని గ్రామస్తులు అంటున్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతుల అనుచరులంతా కలిసికట్టుగా ఇక్కడ పనిచేస్తున్నారు. దీంతో అఖండ మెజార్టీతో కాంగ్రెస్ ప్యానల్ విజయం సాధించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నవోదయ పాఠశాలలో చేరేందుకు నేడు జిల్లాలో జరిగిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాధికారి ఇ నాగలక్ష్మి తెలిపారు. పాలేరులో గల నవోదయ పాఠశాల్లో 6వ తరగతిలో ప్రవేశాల కోసం జరిగిన ప్రవేశ పరీక్షకు 1852 మంది దరఖాస్తు చేసుకోగా, 1472 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆమె తెలిపారు.

## బాలోత్సవంలో 'రెజొనెన్స్' విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లా స్థాయి బాలోత్సవం పోటీల్లో ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. డిసెంబర్ 10, 11, 12 తేదీల్లో ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో నిర్వహించిన బాలోత్సవ పోటీల్లో వివిధ అంశాలలో రెజొనెన్స్ పాఠశాల విద్యార్థులు బహుమతులు పొందారు. స్పెల్ బి పోటీల్లో తొమ్మిదవ తరగతి విద్యార్థి ఎన్. భువనచంద్ర, ఎనిమిదవ తరగతి విద్యార్థి డి. మణిదీప్ ద్వితీయ బహుమతి సాధించారు. డ్రాయింగ్ పోటీలో ఐదవ తరగతి విద్యార్థిని ఐ. సౌమ్యశ్రీ ద్వితీయ బహుమతి సాధించారు. ఫోక్ డ్యాన్స్ విభాగంలో తృతీయ బహుమతిని, కె. కార్తీక్, బి. నూతన, ఎన్. నాన్సి , జి. లక్ష్మి లౌక్య, కె. ఆరాధ్య, ఎన్. జోషిత, పి. జస్విత, జే. శ్రీ అన్విత, ఎం. శాన్వీ లు గెలుపొందారు. శనివారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి లు ప్రతిభ చూపి బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ప్ర ధానోపాధ్యాయులు పివిఆర్ మురళీమోహన్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## త్రివేణి విద్యార్థులకు బహుమతులు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లా స్థాయి బాలోత్సవం పోటీల్లో త్రివేణి పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించినట్లు విద్యా సంస్థల డైరెక్టర్ డా॥ వీరేంద్రచౌదరి తెలిపారు. ఖమ్మం మంచికంటి భవన్‌లో ఈనెల 10, 11,12 తేదీల్లో నిర్వహించిన బాలోత్సవంలో వివిధ పోటీలలో త్రివేణి విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించారన్నారు. ఉపన్యాసం సీనియర్స్ విభాగంలో బి. హరిచందన రెండవ స్థానం, శాస్త్రీయ నృత్యం సీనియర్స్ విభాగంలో పి. సాయిగీతిక రెండవ స్థానం, చిత్రలేఖనం సీనియర్స్ విభాగంలో టి. లోకేష్ సాయి ప్రత్యేక బహుమతిని సాధించారన్నారు. గ్రూప్ సాంగ్ సీనియర్స్ విభాగంలో నిత్యహాసిని, జెస్సి, ఎం. నిహారిక, ఎన్ సిహెచ్ తేజస్విని లు గెలుపొం దారన్నారు. ప్రతిభ చూపి బహుమతులను సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు వీరేంద్రచౌదరి, వై. వెంకటేశ్వరరావు, సిఆర్‌వో మురళికృష్ణ, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఇంచార్జిలు స్వప్న, ముస్తఫా, నయూం, చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా టిజివోస్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు హాజరయ్యారు. టిఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, టిజివో జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, కోశాధికారి వి. వెంకన్న, విజయ్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు కోడి లింగయ్య, ఓదేలు, టి. అం జమ్మ, వెంకటరమణ, కనకారావు, రాంబాబు, జానిమియా, మేరీ, జి. నాగేశ్వరరావు, గపూర్, మాధవి, అరుణ, విజయ్, స్వరూప, ఉపేందర్, సురేష్, సైదాఅలీ, నారాయణరావు పాల్గొన్నారు.



# రెండవ దశకు సర్వం సిద్ధం

● ఖమ్మంలో 18, భద్రాద్రిలో 156, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు





**ప్రజాపక్షం/ ఖమ్మం :** రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్దమైంది. ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుంది. రెండవ దశలో ఖమ్మం జిల్లాలో ఆరు మండలాల పరిధిలోని 183 గ్రామ పంచాయతీలకు 1686 వార్డులకు ఎన్నికలు జరగనుండగా ఇందులో 23 గ్రామ పంచాయతీలు, 306 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 160 గ్రామ పం చాయతీలకు 1379 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఖ మ్మం జిల్లాలో కామేపల్లి, ఖమ్మం రూరల్, తిరు మలా యపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ మండలాల్లో రెండవ దశ పంచాయతీ ఎన్నికలు జరగనుండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండవ దశలో అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట, చంద్రుగొండ, చుంచుపల్లి, దమ్మపేట, ముల్క లపల్లి, పాల్వంచ మండలాల పరిధిలోని పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 156 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా ఇందులో తొమ్మిది గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. చుంచుపల్లి మం డలంలోని విద్యా నగర్ కాలనీ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం ఏకగ్రీవం కాగా పలు వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. రెండవ దశ ఎన్నికలకు సంబంధించి ఖమ్మం జిల్లాలో 2,223 బ్యాలెట్ బాక్సులు, 1831 మంది పోలింగ్ అధికారులు, 2346 మంది ఓపివోలను సిద్దం చేసినట్లు తెలిపారు. రెండవ దశలో 28 ప్రాంతాల్లో 304 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సిసి కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. రెండవ విడతలో ఖమ్మంజిల్లాలో 2,51,327 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్న ప్రాంతాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# పల్లెల్లో యథేచ్ఛగా.. కొనసాగుతున్న ప్రలోభ పర్వం

● ప్రసన్నం చేసుకుంటేనే గెలుపు

● సేవలకు దక్కని ఫలితం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రెండవ దశ ఎన్నికలకు ఆదివారం పోలింగ్ జరగనుండగా మూడవ దశ ఈనెల 17న జరగనుంది. బరిలో నిలిచిన అభ్యర్థు లు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. చివరి రోజు నగదు అందిస్తేనే ఓటర్లు అభ్యర్థుల గుర్తు వైపు చూసే పరిస్థితి దాపురించింది. బరిలో నిలిచిన అభ్యర్థులందరూ ఆయా పరిధిలో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు నగదు పంపిణీతో పాటు మద్యం, చికెన్ అందిస్తున్నారు. చాలా గ్రామ పంచాయతీల్లో పోటీ చేసిన వారు ఇంటింటికి చికెన్‌ను సరఫరా చేయడంతో పాటు మహిళలకు చీరలు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోటీ స్థాయిని బట్టి నగదు పంపిణీ జరుగుతుంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఒక రకమైన వ్యాపార సూత్రాన్ని తెలియజేస్తున్నాయి. కొద్ది గ్రా మాలు మినహా మిగిలిన గ్రామాల్లో ఓటు సంగతి ఎలా ఉన్న ముందుగా ప్రచారం చేసినందుకు అభ్యర్థుల నుండి రోజు వారిగా లెక్కకట్టి మొత్తాన్ని ఎప్పటికప్పుడు రాబట్టుకుంటున్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో ఓటుకు రెండువేల నుంచి ఐదువేల వరకు ధర పలుకుతుందంటే ఆశ్చర్యం కలుగక మానదు. బరిలో నిలిచిన అభ్యర్థులందరూ ప్రతి గ్రామ పంచాయతీలోనూ మూడొంతులకు పైగా ఓటర్లకు నగదును అందజేస్తున్నారు. ఇక పల్లెల్లో మద్యం ఏరులై పారుతుంది. నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన మొదలు మద్యం నిరంతరాయంగా అందిస్తూనే ఉన్నారు. ఇక కొందరైతే నాలుగు ఐదు ఓట్లు ఉన్న కుటుంబాలకు రూ. 50వేల వ రకు పంపిణీ చేస్తున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అవగతమవుతుంది.అభ్యర్థుల తీరు ఇలా ఉంటే ఓటర్లు కూడా నజరానాలు ము ట్టజేప్పక పోతే ఓటు వేసే పరిస్థితి లేదు. శనివారం ఖమ్మం రూరల్ మండలంలోని ఓ గ్రామ పంచాయతీలో నగదు పంచుతున్నారని తెలిసి ఓటర్ల ంతా ఇండ్ల ముందే కూర్చుని అభ్యర్థులు పంపిణీ చేసే నగదు కోసం ఎదురు చూస్తున్నారు. ఐదేండ్లుగా గ్రామాన్ని అంటిపెట్టుకుని సేవలు అందించి అభివృద్ధి చేసిన వారి పట్ల జనం అంత సానుకూలత ప్రదర్శించడం లే దన్న ఆరోపణలు వినవస్తున్నాయి. నిరంతరం అందుబాటులో ఉంటూ ఆపదలో, సంతోషంలో అన్ని తామై పనిచేసిన వారి పట్ల ప్రజలు సానుకూల వైఖరి ప్రదర్శించడం లేదు. అప్పటికప్పుడు గ్రామానికి వచ్చి డబ్బులు విరజిమ్మి ఓటర్లను తమ వైపుకు తిప్పుకునే వారి పట్ల ఆసక్తి కనబరిస్తే భవిష్యత్తులో ఇక సేవలకు తిలోదకాలు ఇచ్చే అవకాశం ఉంది.

# మార్కెటింగ్ శాఖ పెన్షనర్ల పట్ల వివక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర మార్కెటింగ్ శాఖలో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన వారి పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తుంది. ఉద్యోగ విరమణ అనంతరం రావాల్సిన బెనెఫిట్స్ రాకపోగా నెల నెల అందించే పెన్షన్ విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం ప్రదర్శిస్తుంది. జులై మాసం నుంచి విడతల వారీగా ఆయా మార్కెట్ల పరిధిలో పని చేస్తున్న ఉద్యోగుల పెన్షన్‌ను నిలిపి వేస్తుంది. మొత్తం రాష్ట్రంలో 109 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉండగా 1600 మంది పెన్షనర్లు ఉన్నారు. 73 మార్కెట్ కమిటీల నవంబర్ పెన్షన్‌కు సంబంధించి నిధులు విడుదల కాలేదు. 33 కమిటీలకు సంబంధించిన అక్టోబర్ పెన్షన్ విడుదల కాకపోగా ఆరు మార్కెట్ కమిటీలకు సంబంధించి సెప్టెంబర్ నెల పెన్షన్‌ను ఇంత వరకు చెల్లించ లేదు. ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్‌పై ఆధారపడి జీవించే పెన్షనర్లకు పెన్షన్ రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. నవంబర్ మాసపు పెన్షన్‌కు సంబంధించి ఏడు కోట్ల రూపాయలు పైగా బకాయి ఉండగా అక్టోబర్ మాసంలో మార్కెట్ కమిటీలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి ప్రభుత్వం మూడున్నర కోట్ల రూపాయలు బకాయి ఉన్నది. 2024 మార్చి మాసం నుండి ఉద్యోగ విరమణ చేసిన వారిలో చాలా మందికి బెన్‌ఫిట్స్‌ను ప్రభుత్వం అందించ లేదు. పెన్షనర్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మార్కెట్ కమిటీలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి క్రమం తప్పకుండా పెన్షన్‌ను అందించాలని కోరుతున్నారు. మొత్తంగా మార్కెట్ కమిటీలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి సుమారు రూ.16 కోట్లు బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు.

**పెన్షనర్ల పట్ల వివక్ష తగదు :** మార్కెట్ కమిటీలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారి పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్ష ప్రదర్శించడం తగదని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్ లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తగు పరిశీలన చేసి సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ మాసంలో పెండింగ్‌లో ఉన్న పెన్షన్‌ను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.


## విద్యార్థులకు టిఫిన్ బాక్స్ వితరణ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ద్విచక్ర వాహన ఆటోస్పేర్స్ యజమాని సయ్యద్ అన్వర్ టిఫిన్ బాక్స్‌లను అందజేశారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అర్బన్ ఎంఈవో శైలజలక్ష్మి చేతుల మీదుగా విద్యార్థులకు టిఫిన్ బాక్స్‌లు, స్నాక్స్, పరీక్ష ప్యాడ్లు, పెన్ను, పెన్సిల్, పుస్తకాలను పంపిణీ చేశారు.టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షులు వంగాల కొండలరావు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ద్విచక్ర వాహన ఆటో స్పేర్స్, రిపేరింగ్ షాపు నిర్వహిస్తున్న సయ్యద్ అన్వర్ వ్యాపార ధృక్పథంతో కాకుండా సేవా గుణంతో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు.ఉపాధ్యాయురాలు నాగప్రసన్న, ఎస్‌కె ఖాజా, మహ్మద్ సాజిద్ పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌తోనే గ్రామాభివృద్ధి

తల్లాడలో రఘుపతిరెడ్డి విస్తృత ప్రచారం



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీనియర్ నాయకులు దగ్గుల రఘుపతిరెడ్డిని గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పగడాల లచ్చిరెడ్డి శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘుపతిరెడ్డి మాట్లాడుతూ సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు ప్రజలు సక్రమంగా ఉపయోగించుకుంటున్నారని, ఉచిత బస్సు, 200యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు రుణమాఫీ, రూ.500 బోనస్, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఆమూల్యమైన ఓటును కత్తెర గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూతనకల్ మాజీ ఎంపిటిసి, వైరా మార్కెట్ చైర్మన్ లచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు దగ్గుల శ్రీనివాస్‌టెడ్డి, అప్పారావు, తొండపు వెంకటకృష్ణ, రేగళ్ల పుల్లారెడ్డి, అప్పిరెడ్డి, దగ్గుల భరత్‌రెడ్డి, వేమిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ చేసిన అభివృద్ధే గెలిపంచాయ్

అభ్యర్థులకు మల్లు నందిని అభినందనలు



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణలో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన మొదటి విడత స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులను గెలిపించాయని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి, అమ్మా ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మధిర మండలంలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు మల్లు నందినిని మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆశీర్వచనాలు పొందారు. మొదటి విడతగా జరిగిన స్థానిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సిఎం రేవంత్‌డ్డి, డిప్యూటీ మల్లు భట్టివిక్రమార్క నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి కాంగ్రెస్ గెలుపుకు కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామశాఖ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా



**ప్రజాపక్షం/ తల్లాడ :** ఒక్క అవకాశం ఇవ్వండి తల్లాడను అభివృద్ధి చేసి చూపిస్తానని బిఆర్ఎస్ టిడిపి బలపర్చిన అభ్యర్థి పెరిక నాగేశ్వరరావు గ్రామ ప్రజలను విజ్ఞప్తి చేశారు. తల్లాడ మేజర్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో టిడిపి పార్టీ బలపర్చిన బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పెరిక నాగేశ్వరరావు( చిన్నబ్బాయి) బ్యాటు గుర్తును గెలిపించాలని కోరుతూ నారాయణపురంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పెరిక నాగేశ్వరరావు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మండలంలో చేసిన అభివృద్ధి పనులే నన్ను గెలిపిస్తాయని, మండలంలో ఏ గ్రామానికి వెళ్లిన గత ప్రభుత్వ పనులే కనిపిస్తుందని, అవే నన్ను గెలిపిస్తాయని ముక్తకంఠంగా ఓ టర్లకు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రెడ్డెం వీరరమోహన్‌రెడ్డి, గుంటుపల్లి వెంకటయ్యలు మాట్లాడుతూ మా పార్టీకి జనాదరణ బాగుందని, రేవంత్‌రెడ్డి ప్రకటించిన 42 శాతం బిసి రిజర్వేషన్ ఇస్తానని చెప్పి ఇవ్వకుండా మోసం చేసిందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య బిసిలకు సీటును ఖచ్చితంగా ఇవ్వాలని ఆదేశంతో పెరిక నాగేశ్వరరావుకు ఈ అవకాశం వచ్చిందని తెలిపారు. బ్యాట్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గ్రామ ప్రజలు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి చలపతిరెడ్డి, పొట్టేటి పెద్దపుల్లారెడ్డి, రెడ్డెం గోవర్ధన్‌రెడ్డి, పోట్టేటి శ్రీనివాస్‌రెడ్డి, వేమిరెడ్డి నాగిరెడ్డి, పరుచూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# రెండవ విడతకు కట్టుదిట్టం..

● రెండువేల మంది పోలీసు పహారా

● 7129 మంది బైండోవర్

● వివరాలు వెల్లడించిన సిపి



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నేడు జరగనున్న రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు కట్టుదిట్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు పోలీసు కమిషనర్ సునిల్‌దత్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే బలగాలు ఆయా గ్రామాలకు చేరుకున్నాయన్నారు. ప్రలోభాలకు తావులేకుండా ప్రజలు తమ ఓటు హక్కును స్వచ్ఛగా వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చే విధంగా అధికారయంత్రంగా దృష్టిసారించి ందన్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అడిషనల్ డిసిపిల పర్యవేక్షణలో బలగాలు మోహరించినట్లు పేర్కొన్నారు. స్పెషల్ స్ట్రైకింగ్‌ఫోర్స్, రూట్ మొబైల్ పార్టీల తో పాటు ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి బృందాలు నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు. ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం ప్రభావాన్ని నియంత్రించేలా చేపట్టిన తనిఖీల్లో సరైన పత్రాలులేని సుమారు 22 లక్షల రూపాయల నగదు, 12 లక్షలు విలువ చేసే మద్యం సీసాలను సీజ్ చేసినట్లు సిపి తెలిపారు. అదే విధంగా 1059 కేసుల్లో 7129 మందిని బైండోవర్ చేసినట్లు వివరించారు. గుర్తించిన 77 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో నామినేషన్ల ప్రక్రియ నుంచే పోలీస్ నిఘా పెంచామన్నారు. ఆయా గ్రామాల్లో ప్రతి కదలికలపై ఏసిపి స్థాయి అధికారి ఆధ్వర్యంలో నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలింగ్ జరిగే గ్రామాల్లో సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ అమలు ఉంటుందన్నారు. గెలుపొందిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలకు అ నుమతిలేదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. శనివారం ఖమ్మం రూరల్ మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సిపి సునిల్‌దత్ పరిశీలించి అక్కడ బందోబస్తులో ఉన్న అధికారులు, సిబ్బందికి దిశానిర్ధేశం చేశారు.

## పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

అడిషనల్ డిసిపి లా అండ్ అర్డర్ ప్రసాద్‌రావు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** పంచాయతీ ఎన్నికలు ముగిసేవరకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీసీపీ లాఅండ్‌అర్డర్ ప్రసాద్‌రావు అన్నారు. శనివారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులో గల ఖమ్మం రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ బందోబస్త్‌పై అవగాహణ కల్పించారు. పోలీస్, సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. విధులలో ఎవరైనా నిర్లక్ష్యం వహించినా, నిబంధనలు ఉల్లఘించినా శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరగుతుందని పేర్కొన్నారు. విధి నిర్వాహణలో సిబ్బందికి ఏదైనా ఇబ్బందులు, ఆకస్మిక సమస్యలు ఎదురైతే, వెంటనే ఉన్నతాధికారులకు సమాచారాం ఇవ్వాలన్నారు. అంతేకాని వ్యక్తిగత నిర్ణయాలు తీసుకోవద్దని స్పష్టం చేశారు. ఖచ్చితంగా ఎన్నికల నియమావళిని పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ తిరుపతిరెడ్డి, ఏఆర్ ఏసీపీ నర్సయ్య, సిఐలు రాజు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## భారీగా కాంగ్రెస్‌లో చేరికలు

**ప్రజాపక్షం/ కమలాపూర్:** మర్రిపల్లిగూడెం రెండో వార్డు మెంబర్ ఇనుగాల ఐలుకొమురు ఆధ్వర్యంలో 100 మంది హుజురాబాద్ నియోజకవర్గ కాం గ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మొదటి దశ ఎన్నికల్లో రెండో వార్డు మెంబర్‌గా పోటీ చేసి భారీ మెజార్టీతో గెలుపొందిన ఐలుకొమురు తన అనుచర గణంతో చేరడంతో కాంగ్రెస్ పార్టీకి స్థానికంగా కొంత బలం చేకూరినట్లు అయింది. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రజల ప్రభుత్వం ద్వారానే ప్రజలు మేలు చేకూరుతుందని అందుకే తాము కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జీ ప్రణవ్ బాబు వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ నాయకులు, యువకులు భారీగా పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రం పరిసరాల్లో నిషేధాజ్ఞలు

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల నిర్వహణలో భాగంగా ఈ నెల 14న వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల పరిధిలో జరిగే రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రం పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. పోలింగ్ జరిగే ప్రాంతాల్లో శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో బి.ఎన్.ఎస్. ఎస్ సి. ఆర్. పిసి 163 ప్రకారం(144 సెక్షన్) ప్రజలు ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడం నిషేధించడం జరిగిందని తెలిపారు. ఈ నిషేధం 13తారీఖు ఉదయం 6 గంటల నుంచి 14తారీకు రాత్రి 8 గంటలవరకు అమలులో వుంటుందని. ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ హెచ్చరించారు.

## సర్పంచ్ కర్రె లక్ష్మికి సిపిఐ ఘన సన్మానం



**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని గోపాల్ పూర్ గ్రామ సర్పంచిగా సిపిఐ నుండి ఎన్నికైన కర్రె లక్ష్మి భిక్షపతిని ఘనంగా సన్మానించారు. శనివారం హనుమకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచిగా ఎన్నికైన కర్రె లక్ష్మి భిక్షపతిని శాలువా, బొకేతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ సమస్యల పరిష్కారంలో ముందుండాలని, గోపాల్ పూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ బాష్ మియా, ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మ ణ్, ఉట్కూరి రాములు, గన్నారపు రమేష్, మునిగాల బిక్షపతి,ఏదునూరి వెంకట్రాజం, మంచాల రమాదేవి,నేదునూరి రాజమౌళి, బాషబోయిన సంతోష్, కొట్టెపాక రవి, నాయకులు గుంటి రాజేందర్, యాళ్ల సంజీవ్, అలువాల రాజు, పి.రాము, వై.నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## నేడే రెండవ విడత పోలింగ్



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లాలో నేడు రెండవ విడత ఎన్నికలు జరుగుటకు సర్వం సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్ అన్నారు. నేడు జరిగే రెండవ విడత ఎన్నికలలో ఎలాంటి గొడవలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ జరగాలని అధికారులకు సూచనలు చేయడం జరిగిందన్నారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుందని అలాగే రెండు గంటల నుండి సాయంత్రం వరకు లెక్కింపు జరుగుతుందని అన్నారు. రెండవ విడత పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేయడం వలన ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని, అధికారులు అప్రమత్తంగా ఉండి పోలింగ్ కేంద్రాలను ప్రశాంతంగా జరపాలని వారు అన్నారు.

## ముగిసిన నవోదయ ప్రవేశ పరీక్ష

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రెండు రెవెన్యూ డివిజన్ కేంద్రాలలో మామునూరు, చొప్పదండి నవోదయ వి ద్యాలయాలలో ఆరవ తరగతిలో ప్రవేశం పొం దుట కొరకు ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. రాజేందర్ తెలియజేశా రు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూపాలపల్లిలో 253 మంది దరఖాస్తు చేసుకోగా 181 మంది హాజరైనట్లు 72 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాటారం నందు 198 మంది దరఖాస్తు చే సుకోగా 133 మంది హాజరైనట్లు 65 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వా రు తెలియజేశారు. పరీక్షా కేంద్రాల్లో పటిష్టమైన పోలీసు బందోబస్తుతో 144 సెక్షన్‌తో, వైద్య శిబిరాలు ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పన ఏ ర్పాటు చేసినట్లు వారు తెలియజేశారు. పరీక్షా కేంద్రాల వద్ద సిట్టింగ్ స్క్వా డ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీరి వెంట ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి సామల రమే ష్, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లు లక్ష్మీప్రసన్న, సోమలింగం, క్లస్టర్ లెవెల్ అబ్జర్వర్ క్యాతం శ్రీధర్, పరీక్షల సహాయకులు కుసుమ కృష్ణమోహన్, చల్ల కిషన్ రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి: ఝాన్సిరెడ్డి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** పంచాయ తీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మైలారం, చీమలబాయి తండా, విస్నూర్, విష్ణుపురం, తీగారం, కోతులబాధ, ఈరవెన్ను, తి రుమలగిరి, నర్సింగాపురం తండా గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తుందని, గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలని సూ చించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మా ర్కెట్ చైర్‌పర్సన్ మంజుల భాస్కర్, సర్పంచ్ అభ్యర్థి చెరిపెల్లి సంధ్య, కాం గ్రెస్ అభ్యర్థులు లక్ష్మి, రజిత, రజిత, అనూష, కుమారస్వామి, సోమయ్య, మల్లారెడ్డి, కుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## జనగామ బస్టాండ్‌లో చైన్ స్నాచింగ్

**ప్రజాపక్షం / జనగామ :** జనగామలో బస్టాండ్‌లో శనివారం చైన్‌స్నాచింగ్ జరిగింది. బచ్చన్నపేట మండలంలోని రామచంద్రాపూరం గ్రామానికి చెందిన పైసా కష్టమ్మ బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడి మూడు తులాల బంగారం దొంగిలించారు. పోలీసులు సిసి కెమెరాల ఆదారంగా దొంగల్ని గుర్తించే పనిలో పడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. బచ్చన్నపేట మండలం రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన కిష్టమ్మ తన భర్త బాలయ్య చేయి విరగడంతో చికిత్స నిమిత్తం హాస్పటల్‌కు వచ్చింది. కట్టుకట్టించుకొని తిరి వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. మూడు తులాల బంగారం దొంగిలించగా కిష్టమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బస్టాండ్, బస్టాండ్ చౌరస్తా చుట్టుపక్కల ఉన్న సిసి కెమెరాలను కంట్రోల్ రూంలో వీక్షించారు. చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన వారిని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. కిష్టమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# సమర్థంగా పంచాయతీ ఎన్నికలు

### వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/దుగ్గొండి/నల్లబెల్లి/గీసుగొండ /సంగెం:** రెండవ విడతలో ఆదివారం నిర్వహించునున్న గ్రామపంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలు2025లో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గీసుకొండ మండలంలోని గీసుగొండ జెడ్‌పిహెచ్‌ఎస్, సంగెం మండల కేంద్రంలోని జెడ్‌పిహెచ్‌ఎస్, దుగ్గొండి మండల కేంద్రంలోని జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలల్లో, నల్లబెల్లి మండలంలోని సుమంగళీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ప్రతి కౌంటర్‌ను కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే జోనల్, రూట్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. రూట్, జోనల్, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని అన్నారు. పోలింగ్ సిబ్బంది చెక్ లిస్ట్ ప్రకారం తమకు అందజేసే సామాగ్రిని జాగ్రత్తగా క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, అదనపు సామాగ్రి ఆర్.ఓ జోనల్ అధికారుల వద్ద ఉంటుందని అవసరమైన వారు ఆయా అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఫామ్ 9 ప్రకారం సిబ్బంది తప్పనిసరిగా బ్యాలెట్ బాక్స్ చెక్ చేసుకోవాలని, పోలింగ్ , కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం అందించిన సామాగ్రిని జాగ్రత్తగా సీల్ చేసి డిపాజిట్ చేయాలన్నారు. సిబ్బందికి సందేహాలు ఉంటే డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ప్రత్యేకంగా ట్రైనింగ్ కూడా ఏర్పాటు చేశామని వాటి ద్వారా సందేహాలను నివృత్తి చేసుకొని ఎలాంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సిఇఒ రాం రెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, ఎం పి డి ఓ లు, తహసీల్దార్లు, ఇతర ఎన్నికల సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పేరు మార్పుతో కూలీలకు ఒరిగేదేమీ లేదు

### బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/ వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పూజ్య బాపు గ్రామీణ్ రోజ్ గార్ యోజనగా పేరు మార్చినంత మాత్రాన ఉపాధి కూలీలకు ఒరిగేదేమీ లేదని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు విమర్శించారు. 2006లో యూపీఏ ప్రభుత్వం పేదరికం నిర్మూలన వలసల నిరోధాన్ని అరికట్టేందుకు ఈ పథకాన్ని ప్రారంభిస్తే మోదీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులలో కోతలు విధిస్తూ నిర్వీర్యం చేస్తున్నదన్నారు. ఉపాధి హామీ పథకానికి 2.70 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని, సంవత్సరంలో 200 రోజులు పనులు కలిగించాలని, రోజుకు కనీస కూలి రూ. 700 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం పథకం పేరు మార్చితే కార్మికులకు ఎలాంటి ప్రయోజనంలేదన్నారు. సంవత్సరంలో 125రోజుల పని దినాలు, రోజుకు కనీసకూలి 240రూపాయలకు సవరిస్తూ కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం కార్మికులకు నిరాశే మిగిల్చిందన్నారు. పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి సంవత్సరం లక్షలాది జాబ్ కార్డులను తొలగిస్తున్నారన్నారు. దేశంలో ఉపాధి హామీ పథకం కింద సంవత్సరంలో సగటున 50 రోజులు మాత్రమే పనికలిపించినట్టు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ పార్లమెంటులో చెప్పడంతో ఉపాధి కూలీలకు కల్పిస్తున్న పనితీరు అర్థమవుతున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడి ఉపాధి పథకానికి నిధులు పెంచి గ్రామాలతో పాటు పట్టణాలలో కూడా పనులు కల్పించాలన్నారు. లేనిచో కార్మికుల పోరాటాలు ఉధృతమైతాయనిహెచ్చరించారు.

## నర్సంపేట నుంచే క్లీన్ స్వీప్‌కు శ్రీకారం

### ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**ప్రజాపక్షం/నెక్కొండ:** రెండు మూడు విడతల్లో రాష్ట్రాన్ని కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేయాలంటే ఆరంభం నర్సంపేట నియోజకవర్గం నెక్కొండ నుండే జరగాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్పష్టం చేశారు. టిఆర్ఎస్‌గా మొదలై బిఆర్ఎస్‌గా మారిన పార్టీ ప్రజా వ్యతిరేక పాలనతో ఇప్పటికే భూస్థాపితం అయ్యిందని, స్థానిక సంస్థల ఎన్నికలే ఇందుకు తుది ముద్ర వేయబోతున్నాయని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. నెక్కొండ మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థుల తరుపున ప్రచారం నిర్వహించిన మాధవరెడ్డి అభ్యర్థుల తరుపున ప్రచారం నిర్వహించిన మాధవరెడ్డి, ప్రజల సమస్యలను పట్టించుకోని గత పాలకులకు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే రైతు భరోసా, రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహలక్ష్మి , ఉద్యోగ భర్తీలతో ప్రజల నమ్మకం తిరిగి తెచ్చిందన్నారు. గ్రామ పాలనను మరల ప్రజల చేతుల్లో పెట్టాలంటే కాంగ్రెస్ అభ్యర్థులే గెలవాలని, అప్పుడే గ్రామాలకు నిజమైన అభివృద్ధి వస్తుందని పిలుపునిచ్చారు. టిపిసిసి సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ పంచాయతీ కాంగ్రెస్ అభ్యర్థి పెండ్యాల హరిప్రసాద్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, నెక్కొండ మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు బక్కి అశోక్, కుసుమ చెన్నకేశవులు, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఈదునూరి సాయికృష్ణ, నర్సంపేట న్యాయస్థాన ఎజిపి బండి శివకుమార్, రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, కొల్లు వెంకట సుబ్బారెడ్డి, చల్ల రఘోత్తం రెడ్డి, కొణిజేటి భిక్షపతి, చల్లా శ్రీపాల్ రెడ్డి, మెరుగు విజయ స్వామి, చల్లా పాపిరెడ్డి, గంధం సుధాకర్, ఈదునూరి ప్రభాకర్, పలు గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు పాల్గొన్నారు.

## పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో కలెక్టర్ పరిశీలన



**ప్రజాపక్షం/హనుమకొండ:** హసన్‌పర్తి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను కలెక్టర్ పరిశీలించారు. మండల పరిధిలో ఎన్ని గ్రామ పంచాయతీలలో పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, పోలింగ్ కేంద్రాల వారిగా కేటాయించిన పిఓలు, ఓపిఓలు వచ్చారని, పోలింగ్ సామగ్రి పంపిణీ నిర్వహణకు ఏర్పాట్లు, రూట్ల వారీగా వాహనాల ఏర్పాట్లు, ఎన్నికల సిబ్బందికి భోజన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి వాటికి సంబంధించిన వివరాలను ఎంపిడిఒ సుమన వాణి, మండల ప్రత్యేకాధికారి సంజీవరెడ్డిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వారిగా బ్యాలెట్ పేపర్లు అన్ని సరిగా ఉన్నాయా లేదా చెక్ చేశారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రిజర్వ్‌లో ఉన్న పోలింగ్ సిబ్బందితో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రెండో విడతలో హనుమకొండ జిల్లాలో హసన్ పర్తి, ధర్మసాగర్, ఐనవోలు, వేలేరు, పరకాల మండలాల్లో ఆదివారం పోలింగ్ జరగనుందని తెలిపారు. ఈ ఐదు మండలాల్లో 73 గ్రామపంచాయతీలు, 694 వార్డులున్నాయని పేర్కొన్నారు. రెండో విడత మండలాల్లో ఐదు గ్రామపంచాయతీలు సర్పంచ్, వార్డు, ఉపసర్పంచ్ స్థానాలు అన్నీ కలిపి ఏకగ్రీవమయ్యాయని, ఒక గ్రామంలో సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైందని అన్నారు. రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో జిల్లా లోని 67 సర్పంచి స్థానాలకు , 570 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. రెండో విడతలోని పెద్ద గ్రామపంచాయతీలలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఆలస్యం జరగకుండా త్వరగా పూర్తిచేసే విధంగా ఎక్కువ కౌంటింగ్ టేంటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రెండు వేలకు పైగా ఓటర్లు ఉన్న ప్రతి గ్రామపంచాయతీలో ఓట్ల లెక్కింపునకు మూడు కౌంటింగ్ టేంటింగ్ వేసి ఓట్ల లెక్కింపును చెపట్టనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడో విడత ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందన్నారు. ఏకగ్రీవ గ్రామపంచాయతీలతోపాటు మొదటి విడత ఎన్నికలు పూర్తయిన మండలాల్లోనూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందన్నారు . ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున విజయోత్సవ ర్యాలీలు, సమావేశాలకు అనుమతి లేదన్నారు. రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో ఐదు మండలాల్లో 18 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించామని, అక్కడ మైక్రో అబ్జర్వర్ విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. రెండో విడత పై ప్రత్యేక దృష్టిని సారించామని, పెద్ద గ్రామాలైన ధర్మసాగర్, నాగారం గ్రామాలలో ఎక్కువ పెట్టాలని, ధర్మసాగర్ లో ఏడు తో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు.

**ఓటు హక్కును ఓటర్లు వినియోగించుకోవాలి**

హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఓటు హక్కు అనేది రాజ్యాంగం ప్రసాదించిన హక్కు అని, ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని, పోలింగ్ కేంద్రాలలో టెంట్లు, తాగునీరు, దివ్యాంగుల కోసం వీల్ చైర్ ఏర్పాటు చేస్తున్నామని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, బిఎల్వో లు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈనెల 14వ తేదీన (ఆదివారం ) ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ఉంటుందని, మధ్యాహ్నం రెండు గంటల తర్వాత కౌంటింగ్ ప్రారంభించి సర్పంచ్, వార్డు స్థానాల ఫలితాలను ఎన్నికల అధికారులు ప్రకటిస్తారు.ఎన్నికలనేపథ్యంలో పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

# రెండో విడతకు సర్వం సిద్ధం




**ప్రజాపక్షం / జనగామ :** గ్రామ పంచాయతీ రెండో విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. బ్యాలెట్ బాక్స్‌లు, పేపర్లలో పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. గొడవలు జరిగే అవకాశం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు అదనపు బలగాలతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం 710 పోలింగ్ కేంద్రాలే ఏర్పాటు చేయగా లక్షా 10వేల 120 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. జనగామలో మొదటి విడత పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 110 పంచాయతీలకు ఎన్నికలు జరగగా 10 పంచాయతీలు ఏకగ్రీవం కావడంతో వంద పంచాయతీలకు పోలింగ్ జరిగింది. రెండో విడతలో 79 పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా ఆరు పంచాయతీలు, 155 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 73 పంచాయతీలకు పోలింగ్ జరగనుండగా సర్పంచ్ పదవి కోసం 251 మంది వార్డు సభ్యుల కోసం 1465 మంది పోటీ పడుతున్నారు. ఇందు కోసం అధికారులు 710 పోలింగ్ కేంద్రాలే ఏర్పాటు చేశారు. 853 పిఓలు, 1039 మంది ఓపిఓలు ఏర్పాటు చేయగా డిస్ట్రిబూషన్ కోసం 4 రూట్లు ఏర్పాటు చేశారు. ఎన్నికలు జరిగే జనగామ, బచ్చన్నపేట, నర్మెట,న తరిగొప్పుల మండలాల్లో లక్షా 10వేల 120 మంది ఓటర్లు ఉండగా అందులో 54వేల 344 మంది మహిళ ఓటర్లు, 55వేల 775 మంద పురుష ఓటర్లు ఉన్నారు. మొదటి విడతలో 87.33 శాతం పోలింగ్ జరగగా రెండో విడతలో 90 శాతానికి పైగా పోలింగ్ జరుగుతుందని అధికారులు అంచనా. రెండో విడత పోలింగ్ సందర్భంగా బ్యాలెట్ బాక్స్‌ల పంపిణీ పూర్తి అయ్యింది. జనగామలోని సోషల్ వేల్ఫేర్ పాఠశాల, కళాశాల నుండి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేశారు. జల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ దగ్గర ఉండి సామాగ్రిని పంపిణీ చేయించారు. నాలుగు రూట్లుగా చేసి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేయగా సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం 1 గంటల వరకు జరగనుంది. మొదటి విడతలో జరిగిన లోపాలను సమీక్షించుకొని రెండో విడతలో భారీ బందోబస్తు చేశారు. జనగామ మండలంలోని పెంబర్తి, శామీర్‌పేట, వడ్లకొండ, ఓబుల్‌కేశవాపూర్ గ్రామాల్లో, బచ్చన్నపేట మండలంలోని పలు గ్రామాలతో పాటు నర్మెట, తరిగొప్పుల మండల కేంద్రాల్లో గొడవలు జరిగే అవకాశాలు ఉన్నాయని పోలీస్‌లు ముందు పసిగట్టినట్లు తెలుస్తుంది. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ పలు చోట్ల ఎన్నికలు జరిగాయి. ఈ క్రమంలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వయించడం కోసం పోలీస్‌లు కట్టుదిట్టమైన ఏర్పాట్లే చేస్తున్నారు.

**మొదటి విడతలో కాంగ్రెస్ హవా..మరి రెండో విడతలో..**

మొదటి విడతలో 110 పంచాయతీలకు ఎన్నికలు జరగగా 10 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. అవి కాంగ్రెస్ కాతాల్లోనే చేరాయి. వంద పంచాయతీలకు పోలింగ్ జరగగా 64 గ్రామాల్లో కాంగ్రెస్ బలపరిచిన వారు గెలుపొందగా బిఆర్ఎస్ 21 స్థానాలకే పరిమితమైంది. మిగతా చోట్ల స్వతంత్రులు గెలుపొందగా అందులోనూ కాంగ్రెస్‌కు అనుకూలమైన వారే ఎక్కువగా ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ ముందంజలో ఉండగా రెండో విడతలో ఎవరికి అనుకూలంగా ఉంటుందన్నది చూడాలి.

## ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం చిట్యాల మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో 14 న జరుగనున్న పోలింగ్ నిర్వహణకు పంపిణీ చేస్తున్న మెటీరియల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండో విడత జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చిట్యాల, భూపాలపల్లి, ్ధపాలపల్లి, పలిమెల మండలాల్లో 82728 మంది ఓటర్లు తమ హక్కు వినియోగించుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో వయో వృద్ధులు, దివ్యాంగ్గుల కొరకు వీల్ ఛైర్లు అందుబాటులో ఉంచాలని సంక్షేమ అధికారికి సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో మెటీరియల్ తీసుకున్న పిఓ, ఓపిఓలు మెటీరియల్ జాగ్రత్తగా పరిశీలించాలని, ఏదేని కొరత ఉన్నట్లు గమనిస్తే తక్షణమే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. శనివారం సాయంత్రం వరకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని 14వ తేదీన పోలింగ్ నిర్వహణకు ఓటింగ్ కంపార్ట్ మెంట్ వంటి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి మల్లేశ్వరి, ఎంపిడిఓ జయశ్రీ, తహసీల్దార్ ఇమామ్ బాబా తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధి కోసం కాంగ్రెస్ నిరంతర కృషి



ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** గ్రామాలు అభివృద్ధి కావాలనుకుంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని కోలుకొండ, చిన్నమడూర్, అప్పిరెడ్డిపల్లి, పలు గ్రామాలలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. గ్రామాలలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు, పల్లె దావఖానాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## భార్యకు ఉరి... భర్త ఆత్మహత్య

### ఎస్ఐకి వీడియో షేర్ చేసిన రామాచారి

### జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘటన





**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండలంలో ఘోర ఘటన చోటుచేసుకుంది. భార్య తనను టార్చర్ పెడుతోందని ఉరి వేశాడు. ఎస్ఐకి తన వేదనను వివరిస్తూ వీడియో రిలీజ్ చేయడమే కా కుండా తానూ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. గణపురం మండలంలోని సీతరాంపురం గ్రామానికి బాలాజీ రామాచారి వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో భార్యభర్తల మధ్య మనస్పర్థాలు వచ్చాయి. దీంతో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో భార్య సంధ్య తన తల్లి గారింటి వద్ద ఉంటోంది. 11వ తేదీన రామాచారి భార్య సంధ్య ఓ టు వేయడానికి సీతరాంపురం వచ్చింది. ఆమె శుక్రవా రం అర్ధరాత్రి పక్కా ప్లాన్ ప్రకారం ఆమెకు ఉరి వేసి హత్య చేశా డు. ఆ పైన అతడు కూడా ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సంధ్యను ఉరి వేసిన అనంతరం రామాచారి వీడియో విడుదల చేయడమే కాకుండా వాట్సప్ స్టేటస్ కూడా పెట్టుకున్నాడు. ఆ వీడియోలో ఆయన తన ఆవేదనంతా వెల్లగక్కాడు. తన భార్యతో ఇబ్బంది పడుతున్నానని, దీంతోనే తాను భార్యకు ఉరి వేసినట్లు చెప్పుకొచ్చారు. అనంతరం ఆయన కూడా ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# క్రీడ



# మెస్సీ విగ్రహావిష్కరణ

ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా' ప్రారంభమైంది. శనివారం మెస్సీ కోల్‌కతాకు చేరుకున్నాడు. ఆయనతో పాటు అతడి ఇంటర్ మియామీ జట్టు సహచరులు రోడ్రిగో డిపాల్, లూయిస్ సూవారెజ్ ఇండియాకు వచ్చారు. మెస్సీని చూడటానికి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. తాజాగా కోల్‌కతాలో 70 అడుగుల మెస్సి విగ్రహావిష్కరణ జరిగింది. ఉదయం లేక్ టౌన్‌లో తన 70 అడుగుల విగ్రహాన్ని బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్‌తో కలిసి మెస్సి వర్చువల్‌గా ఆవిష్కరించాడు. భద్రతా కారణాల రీత్యా అతడు అక్కడికి వెళ్లలేకపోయాడు.

## విగ్రహా ఏర్పాటుపై హర్షం

తన 70 అడుగుల భారీ విగ్రహంపై మెస్సీ ఎంతో సంతోషం వ్యక్తం చేసినట్లు పశ్చిమ బెంగాల్ మంత్రి, శ్రీభూమి స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షుడు సుజిత్ బోస్ తెలిపారు. ఈ 70 అడుగుల విగ్రహం ఫుట్‌బాల్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఫిఫా వరల్డ్‌ప్ ట్రోఫీని చేతబట్టుకున్న మెస్సీ రూపంలో ఈ విగ్రహాన్ని రూపొందించారు. 2022 ప్రపంచ కప్ విజయానికి ఇది ప్రతీకగా నిలుస్తోంది. 'మేం మెస్సి మేనేజర్‌తో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నాం. ఈ విగ్రహ నిర్మాణానికి మెస్సి యాజమాన్యం ముందు అనుమతి ఇచ్చింది. ఈ విగ్రహంపై మెస్సి ఎంతో సంతృప్తిగా ఉన్నాడు. ఎంతో సంతోషం వ్యక్తం చేశాడు. 70 అడుగుల ఎత్తుతో ఇంత భారీ మెస్సీ విగ్రహం ప్రపంచంలో మరెక్కడా లేదు. ఈ నిర్మాణాన్ని కేవలం 40 రోజుల్లో పూర్తి చేశాం. కోల్‌కతాకు మెస్సీ వస్తుండటంతో అభిమానుల్లో అపూర్వమైన ఉత్సాహం నెలకొంది' మంత్రి సుజిత్ బోస్ అన్నారు.





## భారత ఆల్‌రౌండర్‌కు బిగ్ షాక్..

### ఐపిఎల్‌లో నిషేధం తప్పదా!

ఐపిఎల్ వేలం సమీపిస్తున్న వేళ భారత క్రికెటర్ దీపక్ హుడాకు బిగ్ షాక్. వేలంలో ఫ్రాంచైజీల దృష్టిని ఆకర్షించాలనుకున్న హుడాకు బిసిసిఐ పెద్ద ఝలక్ ఇచ్చింది. అతడి పేరును అనుమానాస్పద బౌలింగ్ యాక్షన్ కలిగిన క్రికెటర్ల జాబితాలోంచి తొలగించలేదు. డిసెంబర్ 16న వేలం ఉన్నందున.. హుడా బౌలింగ్ అనుమానాస్పందంగా ఉందని ఫ్రాంచైజీలకు బిసిసిఐ సమాచారమిచ్చింది. ఒకవేళ వేలంలో అతడిని ఎవరు కొన్నా బౌలింగ్ మాత్రం చేయించవద్దని స్పష్టం చేసింది. పార్ట్‌టైమ్ ఆఫ్ స్పిన్నర్ అయిన దీపక్ హుడా పద్దెనిమిదో సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆడాడు. అయితే.. అతడి బౌలింగ్ యాక్షన్‌పై బిసిసిఐ సందేహాలు వెలిబుచ్చిన నేపథ్యంలో ఏడు మ్యాచుల్లో ఆడినప్పటికీ బంతి అందుకోలేదు. కానీ, ఇటీవల దేశవాళీలో మాత్రం ఆరు ఓవర్లు వేశాడీ ఆల్‌రౌండర్. రంజీ ట్రోఫీలో ఒక ఓవర్, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఐదు ఓవర్లు వేశాడు హుడా. చివరిసారిగా డిసెంబర్ 8న జార్ఖండ్‌తో మ్యాచ్‌లో మూడు ఓవర్లు బౌలింగ్ చేశాడతడు. హుడా యాక్షన్ అనుమానాస్పదంగా ఉన్నందున అతడు ఇకపై బౌలింగ్ చేయవద్దని బిసిసిఐ ఆదేశించనుంది. జమ్ముకశ్మీర్‌కు చెందిన అబిద్ ముష్తాక్ కూడా అనుమానాస్పద బౌలింగ్ యాక్షన్ కలిగిన క్రికెటర్ల జాబితాలో ఉన్నాడు. ఇప్పటివరకూ హుడా 10 వన్డేలు, 21 టీ20ల్లో టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాడు. ఐపిఎల్ 19వ సీజన్ వేలంలో అతడు రూ.75 లక్షలకు పేరు నమోదు చేసుకున్నాడు.

## కోహ్లీ రికార్డుపై కన్నేసిన అభిషేక్ శర్మ



టీమ్ఇండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ భారీ రికార్డుపై కన్నేశాడు. టీ20ల్లో ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా కోహ్లీ పేరిట ఉన్న రికార్డును అభిషేక్ బ్రేక్ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. 2016లో సూపర్‌ఫామ్‌లో ఉన్న విరాట్ 31 మ్యాచ్‌ల్లో 89.66 సగటుతో 1,614 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు, 14 అర్ధ సెంచరీలున్నాయి. అభిషేక్ మరో 81 పరుగులు చేస్తే కోహ్లీ రికార్డును బద్దలు కొడతాడు. ఈ ఏడాది అభిషేక్ శర్మ ఇప్పటివరకు 39 టీ20 మ్యాచ్‌లు ఆడి 1,533 రన్స్ చేశాడు. ఇందులో మూడు శతకాలు, 9 అర్ధ శతకాలున్నాయి. సఫారీలతో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్ మొదటి రెండు మ్యాచ్‌ల్లో అభిషేక్ దూకుడుగా ఆడినా భారీ స్కోర్లు చేయలేకపోయాడు. రెండు మ్యాచ్‌ల్లో కలిపి 34 రన్స్ మాత్రమే చేశాడు. ఆదివారం (డిసెంబరు 14) భారత్, సౌతాఫ్రికా మధ్య ధర్మశాలలో మూడో టీ20 జరగనుంది. ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ భారీ ఇన్నింగ్స్ ఆడితే కోహ్లీ రికార్డు బ్రేక్ కావడం ఖాయం. ఇక, సిరీస్ విషయానికొస్తే.. తొలి మ్యాచ్‌లో భారత్ నెగ్గగా.. రెండో టీ20లో సౌతాఫ్రికా గెలిచింది. ధర్మశాల మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్‌లో ఆధిక్యం సాధించాలని ఇరుజట్లు పట్టుదలతో ఉన్నాయి.

ఫోకస్




## నిన్న అమెరికా... నేడు మెక్సికో..

భారత్‌పై 50 శాతం టారిఫ్‌లు విధింపు




భారత్‌పై అధిక టారిఫ్‌లు విధించడంలో అమెరికాను అనుసరిస్తున్నది మెక్సికో. భారత్‌సహా పలు ఆసియా దేశాలపై 50 శాతం వరకూ దిగుమతి సుంగాలు విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇది బహుశా అమెరికా ఒత్తిడి కారణంగా, మెక్సికన్ ప్రథమ మహిళా ప్రెసిడెంట్ క్లాడియా షీన్‌బమ్ తీసుకున్న చర్యకావచ్చని నిపుణులు భావిస్తున్నారు. కాగా, ఈ నిర్ణయం, భారత ఆటోమొబైల్ రంగంపై తీవ్ర ప్రభావం చూపనుంది. మెక్సికో ప్రకనను అనుసరించి కార్లు, వాహనాల విడిభాగాలు, దుస్తులు, బొమ్మలు, స్టీలు, ప్లాస్టిక్, ఫర్నిచర్, పాదరక్షలు, అల్యూమినియం, గ్లాస్, పేపర్, సబ్బులు, మోటార్ సైకిళ్లు, కాస్మెటిక్స్ తదితర వస్తువులపై దిగుమతుల సుంకం పెరిగింది. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 2023–24లో 8.4 బిలియన్ కాలర్లుకాగా, కొత్త టారిఫ్‌తో ఈ విలువ తగ్గే అవకాశాలు ఉన్నాయి. దీని వల్ల కార్ల దిగుమతి సుంకం 20 శాతం నుండి 50 శాతానికి పెరుగుతుంది. భారత్ నుంచి మెక్సికోకు కార్ల ఎగుమతులు సుమారు ఒక బిలియన్ డాలర్లు. భవిష్యత్తులో కార్ల భారత్ నుంచి కార్ల ఎగుమతులు తగ్గవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. మొత్తం భారతీయ కార్ల ఎగుమతుల్లో 50 శాతం వాటా ఉన్న వోక్స్ వ్యాగన్ (విడబ్ల్యూ)పై మెక్సికో టారిఫ్ పెంపు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆ తర్వాతి స్థానాల్లో హ్యుందాయ్, నిస్సాన్, సుజికి (మారుతి) తదితర ఆటోమొబైల్ ఉత్పత్తి కంపెనీలు ఉన్నాయి. కాగా, టారిఫ్ పెంపుదల వెనుక అమెరికా ఒత్తిడి కీలక పాత్ర పోషించినట్లు అనుమానాలున్నాయి. చైనాతో వ్యాపారాన్ని తగ్గించమని మెక్సికోపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ ఒత్తిడి తెచ్చారు. యుఎస్‌ఎంసిఎ ఒప్పందం రీవ్యూ ముందు అమెరికా ఆంక్షల నుంచి రాయితీలు పొందేందుకు మెక్సికో ఈ నిర్ణయం తీసుకున్నట్టు నిపుణులు చెబుతున్నారు. అయితే, దేశీయ పరిశ్రమలకు రక్షణ కల్పించడానికే విదేశీ వాహనాలపై దిగుమతులపై సుంకాన్ని పెంచినట్టు మెక్సికో చెప్పన్నది. కాగా, ఈ నిర్ణయం వల్ల దేశంలో ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని మెక్సికో వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బిఎస్ఇ/ క్లోజింగ్): సెన్సెక్స్ 85,267.66 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 85,712.37 పాయింట్లు. నష్టం 444.71 పాయింట్లు).
**జాతీయ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్):** నిఫ్టీ పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 26,186.45 పాయింట్లు. నష్టం 139.50 పాయింట్లు)

## బులియన్ మార్కెట్లు

బంగారానికి డిమాండ్ తగ్గడం లేదు. గతంలో మాదిరి పరుగులు తీయకపోయినప్పటికీ, స్థిరమైన ధరల పెరుగుదల కొనసాగుతున్నది. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డాలర్‌కు రూపాయి మారకం విలువ క్షీణత వంటి అంశాలు పెట్టుబడిదారులను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. ఫలితంగా రక్షణాత్మక విధానాలను అనుసరిస్తూ, వారు బంగారంపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లోని సంప్రదాయాలు కూడా బంగారం ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి. శనివారం నాటికి గ్రాము బంగారం 24 క్యారెట్లురూ. 13,009 నుంచి రూ.13,418కు, అదే విధంగా 22 క్యారెట్లు 11,926 నుంచి రూ. 12,300కు, 18 క్యారెట్లు రూ. 9.809ల నుంచి రూ.10,064లకు చేరింది. వచ్చే వారం కూడా బులియన్ మార్కెట్లలో భారీ మార్పులు ఉండకపోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## మళ్లీ నేపాల్‌లో భారత కరెన్సీ చెల్లుబాటు!




భారత ప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇవ్వడంతో, రూ.100 కంటే ఎక్కువ విలువ గల భారత కరెన్సీ నోట్లను నేపాల్‌లో మళ్లీ చలామణి చేయడానికి నేపాల్ సిద్ధమవుతోంది. దాదాపు పది సంవత్సరాల తర్వాత ఈ మార్పు జరుగుతోంది. అంతర్జాతీయ మీడియా సమాచారాన్ని అనుసరించి, నేపాల్ జాతీయ బ్యాంక్ త్వరలోనే నేపాల్ గెజిట్‌లో నోటిఫికేషన్ విడుదల చేసి, బ్యాంకులు–ఆర్థిక సంస్థలకు మార్గదర్శకాలు జారీ చేయనుంది. భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) నవంబర్ 28న విదేశీ కరెన్సీ నిబంధనలను సవరించి, డిసెంబర్ 2న గెజిట్‌లో ప్రచురించింది. భారత్–నేపాల్ మధ్య ప్రయాణించే వ్యక్తులు రూ.100 లోపు డినామినేషన్‌గల నోట్లను పరిమితి లేకుండా తీసుకువెళ్లవచ్చు. రూ.100 పైబడిన నోట్లను కలిపి గరిష్ఠంగా రూ.25,000 వరకు తీసుకువెళ్లవచ్చు లేదా తీసుకురావచ్చు. కాగా, నేపాల్ నిబంధనల ప్రకారం, అక్కడి పౌరులు రూ.5,000 వరకు భారత్‌కు తీసుకువెళ్లవచ్చు. ఈ నిర్ణయం వల్ల భారత్‌లో పనిచేసే నేపాలీ వలస కార్మికులకు నగదు సమస్యలు తగ్గుతాయి. విద్యార్థులు, యాత్రీకులు, వైద్య అవసరాల కోసం వెళ్లేవారు, పర్యాటకులకు సౌలభ్యంగా ఉంటుంది. గతంలో రూ.500, రూ.1000 నోట్లు తీసుకువెళ్లినందుకు జైలు శిక్షలు, జరిమానాలు ఎదుర్కొన్న సమస్యలకు ఈ నిర్ణయం ముగింపు పలకనుంది. భారత పర్యాటకులు ఎక్కువగా ఖర్చు చేయగలగడంతో కాసినోలు, హోటళ్లు, సరిహద్దు పట్టణాల వ్యాపారాలకు ఊతం. కరెన్సీ నిబంధనల పట్ల అవగాహన లేక అరెస్టవుతున్న వారి సంఖ్య గణనీయంగా పడిపోతుంది. అయితే రూ.25,000 పరిమితి ఇంకా ఖర్చును కొంత మేర నియంత్రించవచ్చని వ్యాపారులు చెబుతున్నారు. 2015లో నేపాలీలకు రూ.500, రూ.1000 నోట్లు రూ.25,000 వరకు అనుమతి ఉండేది. అయితే, 2016లో భారత్ పెద్ద నోట్లను రద్దు (డీమోనిటైజేషన్) చేసింది. కాగా, 2019లో నేపాల్ రూ.100 పైబడిన భారత నోట్లను నిషేధించింది. ఇటీవల క్యూఆర్ కోడ్ డిజిటల్ చెల్లింపులు ప్రారంభమైనా, దూర ప్రాంతాల్లో నెట్ సమస్యల వల్ల అవి పూర్తిగా ఉపయోగపడటం లేదు. ఫలితంగా భారత్‌లోని నేపాలీలతోపాటు, నేపాల్‌కు వెళ్లే భారత పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇప్పుడు భారత కరెన్సీ అక్కడ చెలామణి కానుంది కాబట్టి, సమస్యలు కొంత వరకైనా తగ్గుతాయి.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

## గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయండి


### సిపిఐ జాతీయ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/చింతకాని:** గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సిపిఐ జాతీయ నాయకులు మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు పేర్కొన్నారు. చింతకాని మండలంలో నూతనంగా ఎన్నికైన సిపిఐ సర్పంచ్‌లు శనివారం సిపిఐ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావును ఖమ్మం మమత మెడికల్ కళాశాలలో కలిసి ఆశీస్సులు పొందారు. చిన్నమండవ, నాగిలిగొండ, నేరడ, రాఘవాపురం, బస్వాపురం సర్పంచ్‌లు పర్సా రామచంద్రరావు, ఏపూరి పద్మ, దూసరి నేతాజీ, కాంపల్లి కోటమ్మ, ఆవుల నర్సింహారావు లు పువ్వాడ ను శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పువ్వాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పని చేస్తే ప్రజలే తిరిగి మనల్ని గెలిపిస్తారని అభివృద్ధే ఎజెండాగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లిఖార్జునరావు, జిల్లా సమితి సభ్యులు దూసరి శ్రీరాములు, రాసాల మోహన్‌రావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శులు మార్గం శ్రీను, అబ్బూరి మహేష్, నాయకులు పదిమల వెంకటనర్సయ్య, కొల్లి రవి,బొడ్డు కొండలరావు, అమర్లపుడి వెంకన్న, దొబ్బల కోటేశ్వరరావు,తుపాకుల సైదులు,షేక్ దస్తగిరి,జి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎఫ్.సి.ఎల్ శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

### ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రభుత్వ సెలవుల్లో పాఠశాలను నిర్వహిస్తున్న ఆర్ఎఫ్.సి.ఎల్ శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రీతం మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులే, ప్రభు త్వ సెలవు దినాల్లో పాఠశాలను నిర్వహిస్తూ, విద్యార్థులకు అసలు ఏం సందేశం ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు. విద్యార్థులు ఉల్లాసంగా ,ఉత్సాహంగా ,ఆనందంగా గడపడానికి ప్రభుత్వ సెలవు దినం ఉన్నప్పటికీని, కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతుల పేరిట పాఠశాలలను నడుపుతున్నారని,నియమ నిబంధనలు పాటించకుండా, జీవోలను తుంగలో తొక్కుతూ సెలవు దినం రోజున కూడా పాఠశాలలను నడుపుతూ, విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆయన అన్నారు. విద్యార్థుల మానసిక స్థితిగతులను పట్టించుకోకుండాజిపిఏలే లక్ష్యంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల స్వలాభంకోసంవిద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, ఇలాంటి పాఠశాలలపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు గుండేటి తరుణ్, జశ్వంత్,అభిలాష్ , సజన్, కార్తీక్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అండ కమ్యూనిస్టు ప్రజా ప్రతినిధులు

### సుజాతనగర్ మండలంలో ఎమ్మెల్యే కూనంనేని విస్తృత పర్యటన



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజలకు అండగా ఉండేది కమ్యూనిస్టులే అని, గ్రామపంచాయితీ ఎన్నికల్లో భాగంగా మండలంలో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను అత్యధిగ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు తెలిపారు. స్థానిక సంస్థల మూడో విడత ఎన్నికలను పురస్కరించుకుని శనివారం సుజాతనగర్ మండలంలోని జామ్లా తండా, బేతంపూడి తండా, కోయగూడెం, కొత్త అంజనాపురం, పాత అంజనాపురం, సింగభూపాలెం, రాఘవాపురం, మాలబంజర, సేతంపేట బంజర, సీతంపేట, గరీబ్‌పేట గ్రామ పంచాయితీల్లో విస్తృతంగా పర్యటించారు.కూనంనేని మాట్లాడుతూ పేదలు, రైతులు, రైతు కూలీలతో పాటు అన్ని వర్గాలకు చెందిన ప్రజలకు కమ్యూనిస్టు పార్టీయే అండని చెప్పారు. ఆపద, దౌర్జన్యం, దోపిడీ, పెత్తందారీ విధానం ఉన్న చోట కమ్యూనిస్టులు వాటిపై పోరాటాలు సాగిస్తూ ప్రజలకు మేలు చేస్తారని చెప్పారు. అలాంటి కమ్యూనిస్టులను గెలిపించుకోవడం ద్వారా గ్రామాల్లోని సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని తెలిపారు. అనునిత్యం ప్రజలను వెన్నంటి ఉండి వారి కష్టాలు, సమస్యలపై స్పందించేది కమ్యూనిస్టు పార్టీ ప్రజాప్రతినిధులే అని ఈనెల 17న జరగనున్న గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం సిపిఐ సీనియర్ నాయకులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు కొమారి రామయ్య ఐదవ వర్ధంతి సందర్భంగా నాయకులగూడెం వద్ద ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్య లు భూక్యా దస్రు, మండల కార్యదర్శి కొమారి హన్మంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కుల రాములు, తాళ్ల వెంకటేశ్వర్లు, తాళ్లూరి పాపారావు, తాళ్లూరి ధర్మారావు, మండల నాయకులు మూడు గణేష్, వీర్ల మల్లేష్, దుర్గా ప్రసాద్, బొడ్డు శేషవరావు, గడ్డం రాజేందర్, బానోత అనీల్, భాగం కృష్ణ, లావుడియా గోపి, భూక్యా శ్రీను, బండి రమేష్, దొడ్డ వెంకన్న, మిత్రపక్షాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతాం.. ప్రజాసేవకే సిపిఐ అంకితం




### రాయగూడెంలో విస్తృత ప్రచారం

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు, ఆళ్లపల్లి మండల మాజీ వైస్ ఎంపిపి రేసు ఎల్లయ్య ఆధ్వర్యంలో ఆళ్లపల్లి పంచాయితీ సిపిఐ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మెస్సు మమత గెలుపు లక్ష్యంగా రాయగూడెం గ్రామంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా రేసు ఎల్లయ్య మాట్లాడుతూ నాటి నుండి నేటి వరకు ఎర్రజెండా పార్టీల ఆదరించిన వారు రాయగూడెం గ్రామస్తులని, ఈ ఎలక్షన్‌లో కూడా వారి అమూల్యమైన ఓటు మెస్సు మమత బ్యాట్ గుర్తుపై వేసి అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. సర్పంచ్ అభ్యర్థి మెస్సు మమత రాయగూడెం గ్రామస్తులతో మమేకమై, ఆప్యాయంగా పలకరిస్తూ, తమ బ్యాట్ గుర్తును చూపించి, ఈ ఎలక్షన్‌లో తనను గెలిపిస్తే మళ్లీ మళ్లీ రాయిగూడెం వస్తానని, సంక్షేమ పథకాలు రాయగూడెం గ్రామస్తులు అందరికీ అందేలా చేస్తానని వారు ఈసందర్భంగా రాయగూడెం గ్రామస్తులకు మాట ఇచ్చారు. ఈకార్యక్రమంలో ముక్తార్, ముక్తార్ పాషా, కుంట సహదేవ్, మద్దెల వెంకటేశ్వర్లు, రామకృష్ణ, దీకొండ మల్లేష్, పరమ ఇమానేయులు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రచారంలో దూసుకుపోతున్న సర్పంచ్ అభ్యర్థి వజ్జ ఉమా

పెద్ద వెంకటాపురం గ్రామ పంచాయితీ స్థానిక సంస్థల ప్రచారంలో సిపిఐ సర్పంచ్ అభ్యర్థి వజ్జఉమా దూసుకుపోతుంది. పెద్ద వెంకటాపురం గ్రామ పంచాయితీ సిపిఐ సర్పంచ్ అభ్యర్థి వజ్జ ఉమా గెలుపు లక్ష్యంగా పెద్ద వెంకటాపురం, బూసరాయి గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు, ఆళ్లపల్లి మండల మాజీ వైస్ ఎంపిపి రేసు ఎల్లయ్య పెద్ద వెంకటాపురం గ్రామ ప్రజలకు చేసిన కృషి ఎజెండాగా, పెద్ద వెంకటాపురం బాసవారి గుంపుకు రేసు ఎల్లయ్య అంటే అపారమైన నమ్మకం, ఆ నమ్మకమే పెద్ద వెంకటాపురం గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సిపిఐ పార్టీ గెలుపుకు దోహదపడే విషయంగా పలువురు తెలుపుతున్నారు. వజ్జ చిరంజీవి కూడా సేవా దృక్పథం కలవాడని, ప్రచార కార్యక్రమంలో సిపిఐ పార్టీ కార్యకర్తలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### నాగమణిని గెలిపించండి

**ప్రజాపక్షం/పెనుబల్లి:**ప్రభుత్వం నుండి అందవలసిన పథకాల కోసం ప్రశ్నించి, సాధించి నిజాయితీ పాలన అందించాలంటే లింగగుడెం పంచాయతీ సిపిఐ బలపరచిన అభ్యర్థి వట్టం నాగమణిని గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నరసింహరావు, సిపిఐ జిల్లా నాయకురాలు సీతామహాలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని లింగగుడెం పంచాయతీ లో ప్రచారం పాల్గొని మాట్లాడుతూ సిపిఐ బలపరిచిన అభ్యర్థి వట్టం నాగమణి కి ఓటు వేసి గెలిపించాలని కోరారు. లింగగుడెం పంచాయతీ పరిధిలోని ఇంటింటికి తిరిగి ప్రచారంలో సర్పంచ్ గా గెలిపించి గ్రామ పంచాయతీ సేవ చేసే భాగ్యం కల్పించాలని ప్రజలను కోరారు. సిసి రోడ్లు, డ్రైనేజిలు, మంచినీటి సదుపాయం వంటి అభివృద్ధి పనులు చేస్తామని సమస్యలు పరిష్కరిస్తామని, గ్రామంలోని పారిశుద్ధ్యం నిర్మూలించి గ్రామంలోని సమస్యలను పరిష్కరించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతానని ప్రజలకు వివరిస్తూ గెలుపే లక్ష్యంగా ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఈ ఎన్నికల్లో నిజాయితీకి, నిబద్దతకు, అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వట్టం నాగమణి కోరారు. ప్రచారం లో సిపిఐ మండల కార్యదర్శి కొమ్మినేని సుధాకర్, కారం రాములు, మధు తదితరులు పాల్గొన్నారు



**ప్రజాపక్షం/ఇల్లందు: తిలక్ నగర్** పంచాయితీ అభ్యర్థి ధనసరి స్రవంతి గెలుపుకై కాంగ్రెస్, సిపిఐ శ్రేణులు తిలక్‌నగర్ గ్రామ పంచాయితీలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే సారయ్య మాట్లాడుతూ సిపిఐ, కాంగ్రెస్ బలపరుస్తున్న అభ్యర్థి ధనసరి స్రవంతిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తిలక్‌నగర్ గ్రామ పంచాయితీలో కొంత భాగం ఓసి నిర్వాసిత ప్రజలకు రావాల్సిన ప్యాకేజీని అధికార పార్టీకి, సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటియూసికి మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. మాయ మాటలు చెప్పే పార్టీలను నమ్మి మోసపోవద్దన్నారు.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంధం నాగయ్య, దేవరకొండ శంకర్, మండల పట్టణ కార్యదర్శులు బొప్పిశెట్టి సత్యనారాయణ, బాస శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు ఎట్టి హరికృష్ణ,ధనసరి రాజు, శ్రీకాంత్, రమణాల లక్ష్మయ్య, హరీష్, లక్ష్మీ నాథ్ పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## వనదుర్గమ్మను దర్శించుకున్న ఎలక్షన్ అబ్జర్వర్

ప్రత్యేక పూజలు నిర్వహించి, సత్కరించిన ఆలయ సిబ్బంది, అర్చకులు



ప్రజాపక్షం/పాపన్నపేట:రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రమైన పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గా మాతను శనివారం ఎలక్షన్ అబ్జర్వర్ భారతి లక్పతి నాయక్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు, సిబ్బంది వారిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాపరెడ్డి, అర్చకులు శంకర శర్మ తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిని కలిసిన పరిమండల్ సర్పంచ్



ప్రజాపక్షం/మామడ :మొదటి విడత రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలలో విజయం సాధించిన మామడ మండలం పరిమండల్ గ్రామ సర్పంచ్ జక్కుల లయశ్రీ మల్లేష్ బిజెఎల్పి నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి గెలిచిన అభ్యర్థులను అభినందించారు.గ్రామానికి సేవ చేసి మంచి పేరు సంపాదించుకోవాలని సూచించారు.జక్కుల లయశ్రీ మల్లేష్ మాట్లాడుతూ మాపై ఉంచిన నమ్మకానికి మావెంట ఉండి నడిపించిన మహేశన్నకు,గ్రామ ప్రజలకు పాదాభివందనాలు తెలియజేశారు.ఇందులో మెడిసమ్మ రాజు,బాపురెడ్డి,ఉపసర్పంచ్ సంధ్యారాణి రవి,మాజీ ఉపసర్పంచ్ ధర్మన్న,రిత్విక్,నవ్య రజినీకాంత్,వనజ శ్రీనివాస్,సంజీవ్,రాజేందర్, గంగన్న,మహేందర్,రజినికాంత్,రవి,చిన్న భీమన్న,చిన్న భీమేష్,మల్లయ్య,మల్లేష్,రతయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్లను భయపెడితే కఠిన చర్యలు



ప్రజాపక్షం/ కన్నేపల్లి/ బెల్లంపల్లి :ఎన్నికల్లో ఓటర్లను భయపెడితే చట్టపరమైన చర్యలు తప్పవని మంచిర్యాల డిసిపి భాస్కర్ హెచ్చరించారు. కన్నేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామమైన నాయకంపేటలో శనివారం పోలీసుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా పోటీ చేస్తున్న అభ్యర్థులు, గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎవరైనా ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా, ప్రలోభపెట్టినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఇటువంటి చర్యలకు పాల్పడితే వారిని అనర్హులుగా ప్రకటిస్తామని తెలిపారు. మద్యం, డబ్బు పంపిణీ చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనవసర గొడవలకు వెళ్లి కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. అనంతరం గ్రామంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎసిపి ప్రకాష్, బెల్లంపల్లి ఎసిపి రవికుమార్, తాండూర్ సిఐ రాజకుమార్, కన్నేపల్లి ఎస్ఐ భాస్కర్ రావు, హాజీపూర్ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

## డిఆర్‌పి సెంటర్‌లలో ఎస్‌పి సందర్శన



ప్రజాపక్షం/సంగారెడ్డి : నేడు జిల్లా వ్యాప్తంగా 10 మండలాలలో జరగనున్న రెండవ విడత ఎన్నికలలో భాగంగా శనివారం నాడు జహీరాబాద్ ,మొగుడం పల్లి డిఆర్‌పి సెంటర్లను జిల్లా ఎస్‌పిపరితోష్ ఫంకజ్ ఎన్నికల విదులకు వెళుతున్న సిబ్బంది రూట్ మొబైలు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పిఫంకజ్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు అన్ని రకాల భద్రత ఏర్పాట్లను చేసినట్లు వివరించారు. ఎన్నికల విధులలో సిబ్బంది చేయవలసినా చేయకూడని విధుల గురించి ముఖ్యమైన అంశాలను ప్రస్తావిస్తూ డిఆర్‌పి సెంటర్ నుండి బయలుదేరి తిరిగి రేపు డిఆర్‌పి సెంటర్‌కు వచ్చే వరకు పోలింగ్ సిబ్బందికి బ్యాలెట్ బ్యాక్స్‌లకు రక్షణను కల్పించాలని పోలింగ్ కేంద్రానికి చేరుకున్న తరువాత పోలింగ్ కేంద్రానికి అన్ని దారులలో 100 మీటర్ల దూరంలో వైట్ లైన్ ,సున్నపు మగ్గు చేయించుకోవాలని 100 మీటర్స్ లోపల ఎలాంటి ప్రచారాలకు అనుమతించకూడదని అన్నారు. ఎ న్నికల విధులలో అప్రమత్తంగా ఉండి ఏచిన్న సమస్యల తల్లెత్తెన వెంటనే సీనియర్ అధికారులకు సమాచారం అందించేలే , ఎలాంటి తొందర పా టు నిర్ణయాలు తీసుకోకూడదన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా పారదర్శకం గా జరిగేందుకు అన్ని శాఖలతో సమన్వయంతో పని చేయాలని సిబ్బంది కి సూచించడం జరిగింది. ఈ విజిటింగ్‌లో ఎస్‌పివెంట జహీరాబాద్ డిఎ స్‌పి సైదా నాయక్, జహీరాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్‌లు శివలింగం ఉన్నారు.

## గల్ఫ్ దేశాల్లో ఉపాధికి అవగాహన




ప్రజాపక్షం/ఖానాపూర్:ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లేవారికి ఉద్యోగ మెలకువలు ప్రయాణ జాగ్రత్తల కోసం ఖానాపూర్ పట్టణంలో ముందస్తు ప్రయాణ అవగాహన శిక్షణ (ప్రీ డిపార్చర్ ట్రైనింగ్ అండ్ ఒరియెంటేషన్,పిడిఒటి) ఆధ్వర్యంలో శనివారం ప్రవాసి మిత్ర లేబర్ యునియన్ అవగాహన కార్యక్రమం నిర్వహించింది వారు మాట్లాడుతూ గల్ఫ్ దేశాలకు వెళ్ళేవారి సంఖ్య పెరుగుతుందని,అవగాహన లేకపోవడంతో వారంతా అక్కడ ఇబ్బందులు పడుతున్నారన్నారు.ధ్రువపత్రాలు,ప్రభుత్వ అనుమతితో నడిచే రిక్రూట్మెంట్ లను నమ్మాలని,గల్ఫ్ లో ఇబ్బందులు ఎదురైతే భారత రాయబార కార్యాలయాలు సంప్రదించే విధానాలను వివరించారు.గల్ఫ్ పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు.గల్ఫ్ పట్ల సందేహాలకు సిఎం ప్రవాసి ప్రజావాణిలో వినతిపత్రాలు సమర్పించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నారై అడ్వైసరి రాష్ట్ర సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి,స్వదేశ్ పరికిపండ్ల,ఢిల్లి కెనడియన్ హైగ్ కమిషన్ రిటైర్డు అధికారి డాక్టర్ సంపత్ కుమార్,ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సాయిండ్ల రాజయ్య,డాక్టర్ సంపంత్ కుమార్,యూనియన్ కో ఆర్డినేటర్ రాజ్ కుమార్,మల్లేష్,సంతోష్,వకిల్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## పటాన్ చెరు కేంద్రంగా జోనల్ కార్యాలయం :ఎమ్మెల్యే

ప్రజాపక్షం/సంగారెడ్డి : పటాన్‌చెరు నియోజకవర్గంలో జిహెచ్‌ఎంసి డివిజన్లను జనాభా ఓటర్ల ప్రాతిపదికన పునర్విభజన జరిపించాలని పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి బల్దియా కమిషనర్ ఆర్ వి. కర్ణన్ కోరారు. అమీన్పూర్ ,తెల్లాపూర్, మున్సిపాలిటీల్లో డివిజన్ల సంఖ్య పెంచడంతో పాటు ప్రజలకు సౌకర్యంగా ఉండేలా పటాన్‌చెరును కేంద్రంగా తీసుకుని జోనల్ కార్యాలయం ఏర్పాటు చేయాలని నివేధికలో సూచించారు.

# కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు

మెదక్‌లో149 పంచాయతీలు, 1290 వార్డులకు ఎన్నికలు * 1034 పోలింగ్ కేంద్రాలు,1,76,167 మంది ఓటర్లు

పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు



ప్రజాపక్షం/మెదక్ :రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మెదక్ జిల్లాలోని తూప్రాన్,మెదక్ డివిజన్ల పరిధిలో ఉన్న 8 మండలాల్లో ఆదివారం ఎన్నికలు జరుగనున్నాయి. మనోహరబాద్, తూప్రాన్, చేగుంట, శంకరంపేట్(ఆర్), నార్సింగి, రామాయంపేట్, నిజాంపేట్, మెదక్ మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. తూప్రాన్, మెదక్ డివిజన్ల పరిధిలో 149 గ్రామపంచాయతీలు, 1290 వార్డులు ఉన్నాయి.149 పంచాయతీలకు గాను 7 గ్రామాలకు సర్పంచ్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన 142 పంచాయతీలకు ఎన్నికలు జరుగనున్నాయి.544 మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మొత్తం 1290 వార్డు స్థానాలు ఉండగా 254 మంది వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మనోహరాబాద్ మండలంలోని రెండు వార్డులకు నామినేషన్లు రాలేదు. మిగిలిన 1034 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. 2592 మంది వార్డు సభ్యులు పోటీలో ఉన్నారు. పంచాయతీ ఎన్నికలకు 1034 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 8 మండలాల్లో మొత్తం 1,76,167 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 84,695 మంది పురుషులు ఉండగా, 91,470 మంది మహిళ ఓటర్లు,ఇతరులు 02 ఉన్నారు. ఈ ఎన్నికల్లో మహిళ ఓటర్లు కీలకం కానున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేస్తూ పోలీసు యంత్రాంగం గట్టి బందోబస్తు ను ఏర్పాటు చేసింది.

**రెండో విడత ఎన్నికల పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు పూర్తి :జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రాహుల్ రాజ్**

జిల్లాలో రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వాహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రం లోని బాలుర జూనియర్ కాలేజ్ గ్రౌండ్ ప్రాంగణంలో 14వ తేదీన జరుగనున్న పోలింగ్ నిర్వహణకు పంపిణీ చేస్తున్న ఎన్నికల సామగ్రిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండో విడత జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు తమ హక్కు వినియోగించుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో వయో వృద్ధులు, దివ్యాన్గుల కొరకు వీల్ చైర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో మెటీరియల్ తీసుకున్న పిఓ, ఓపిఓలు మెటీరియల్ జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంటకు పూర్తి అవుతుందని, తదుపరి 2 గంటల నుండి లెక్కింపు ప్రారంభించాలన్నారు. లెక్కింపు పూర్తి అయిన తదుపరి సాధారణ పరిశీలకుల అనుమతితో గెలుపొందిన అభ్యర్థులను ప్రకటించాలని స్పష్టం చేశారు.పోలింగ్ నిర్వహణ, తదుపరి ఓట్లు లెక్కింపులో ఎలాంటి పొరపాటుకు అవకాశం లేకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు మేరకు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఓటరు నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించాలని ఆయన సూచించారు.

## పోలింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించిన ఆర్‌డిఒ




ప్రజాపక్షం/రామాయంపేట:రెండవ విడ త పంచాయతి ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. రామాయంపేట మండలంలో 16 గ్రామ పంచాయతి లకు ఆదివారం పోలింగ్ జరుగనుంది. మెదక్ ఆర్‌డిఒ రమాదేవి శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ ఆఫీసర్లకు సామాగ్రిని పంపిణీ చేశారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని, వంద శాతం ఓటింగ్ జరిగే విదంగా కృషి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. 17మంది రిటర్నింగ్ అధికారులు, 138 మంది ప్రిసైడింగ్ అధికారులు, ఐదుగురు జోనల్ అధికారులు,55 మంది రిజర్వ్ సిబ్బంది పాల్గొంటున్నట్లు తెలిపారు. తూప్రాన్ డిఎస్‌పి నరేందర్‌గౌడ్ పోలీసు సిబ్బందికి ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలును వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత చేపట్టినట్లు వివరించారు.

## రానున్నది మన ప్రభుత్వమే

సంగారెడ్డి ఎమ్మెల్యే ప్రభాకర్



ప్రజాపక్షం/సంగారెడ్డి : రానున్నది మన ప్రభుత్వమే నని సంగారెడ్డి నియోజకవర్గ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే చింతాప్రభాకర్ ధీమా వ్యక్తం చేసారు. రెండు సంవత్సరాల తరువాత ప్రజల ఆశీర్వాదంతో మన ప్రభుత్వమేనని బిఆర్‌ఎస్ పార్టీ తిరిగిరానుందని ఎమ్మెల్యే తెలిపారు. తాజాగా ఎన్నికైన నూతన సర్పంచ్ సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిశారు. నూతనంఆ ఎన్నికైన సర్పంచ్‌లకు ఎమ్మెల్యే చింతాప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. వారిని శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు. ఎమ్మెల్యే చింతప్రభాకర్ ను కలిసిన వారిలో వెల్టూర్ ,గిర్మాపూర్, బొబ్బిలి గామ, అనంతసాగర్, ఏటిగడ్డ సంఘం , మునిదేవునిపల్లి , శివన్న గూడెం, నూతన సర్పంచులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతాప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అద్భుతంగా పనిచేసి బిర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవడంపై వారిని ఎమ్మెల్యే అభినందించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి పని చేసిన విధానమే తిరిగి విజయం సాధించేందుకు దోహదం చేస్తుందన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో బారీ మెజార్టీతో తిరిగి ప్రభుత్వాన్ని స్థాపించనున్నామని తెలిపారు. ప్రజల ఆశీర్వాదమే మాకు బలం అని అన్నారు. రానున్నదిమన ప్రభుత్వమే అని వారు ధీమా వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధికి తన పూర్తి మద్దతు సహకారం ఉంటుందని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ జెడాపిటిసి కొండల్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు పార్టీ నాయకులు ,కార్యకర్తలు ఉన్నారు.

## శాంతియుత ఎన్నికల నిర్వహణే ప్రధాన లక్ష్యం

ఎస్‌పి జానకి షర్మిల..



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :నేడు జిల్లాలో జరుగనున్న రెండవ విడత పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా,నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు 800 పోలీస్ అధికారులు,సిబ్బందితో భారీ బందోబస్తుతో పాటు అన్ని రకాల భద్రతా చర్యలను పకడ్బందీగా చేపట్టామని జిల్లా ఎస్‌పి జానకి షర్మిల తెలిపారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులకు,సిబ్బందికి ప్రత్యేక దిశానిర్దేశాలు జారీ చేశారు.ప్రతి గ్రామంలో శాంతిభద్రతలు క్షుణ్ణంగా పర్యవేక్షించేలా ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేసినట్లు,ఎన్నికల కేంద్రాలను క్రిటికల్,సాధారణ,అత్యంత సున్నిత ప్రాంతాలుగా గుర్తించి,అదనపు బలగాలను మోహరించినట్లు వివరించారు.ఎన్నికల సమయంలో ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు తావు ఇవ్వకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు .ప్రజలు,అభ్యర్థులు,ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని,శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకారించాలని విజ్ఞప్తి చేశా రు.జిల్లాలోని అన్ని పోలీసు అధికారులకు,బందోబస్తు సిబ్బందికి తమ త మ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని,ప్రజాస్వామ్య పండుగ అయిన ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించే దిశగా కట్టుదిట్టంగా పని చేయాలని ఆదేశించారు.అడిషనల్ ఎస్పీ,ఉపేందర్ రెడ్డి,ఇన్స్పెక్టర్లు, ఆర్ .ఐలు ,ఎస్.ఐ లు,ఆర్ఎస్ ఐలు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల రెండో విడత ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ ఆదేశం..




ప్రజాపక్షం/నిర్మల్ :నిర్మల్ జిల్లాలో గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు,తప్పులకు తావు ఉండకూడదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను గట్టిగా ఆదేశించారు.ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా,నిష్పక్షపాతంగా జరగాలన్న లక్ష్యంతో ఆమె శనివారం నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మండలాల వారీగా ఏర్పాటు చేసిన కౌంటర్లను క్షుణ్ణంగా పరిశీలించి,ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి సామగ్రిని సక్రమంగా,ఎలాంటి గందరగోళం లేకుండా పంపిణీ చేయాలని సూచించారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది సమయానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, పోలింగ్ ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చే యాలని కలెక్టర్ ఆదేశించారు.ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియను ఖచ్చితంగా ప్రారంభించాలని, ఆమె సూచనలు చేశారు.పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు,ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం నివేదికలను కచ్చితంగా జిల్లా కేంద్రానికి పంపాలని అధికారులకు తెలిపారు.జిల్లాఎస్‌పిజానకీ షర్మిల ఈ సందర్భంగా మాట్లాడుతూ,సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అక్కడ అదనపు బలగాలను మోహరించామని,ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.అనంతరం,కలెక్టర్ అభిలాష అభినవ్ సోన్ మండల కేంద్రంలోని ఎంపిడిఒకార్యాలయంలో ఉన్న పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని కూడా తనిఖీ చేసి,ఎన్నికల విధులను అ త్యంత జాగ్రత్తగా,బాధ్యతగా నిర్వహించాలని అక్కడి అధికారులకు,సిబ్బందికి సూచించారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్‌డిఒ రత్నకళ్యాణి,డిఇఒ భోజన్న సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి వెల్లడి

డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించిన కలెక్టర్, అబ్జర్వర్




ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :గామ పంచాయతీ రెండవ విడత పోలింగ్ ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. పోలింగ్ నిర్వహణ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుండి పోలింగ్ సామాగ్రితో సిబ్బంది తరలింపు, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాలలో వసతులు, పోలీసు బందోబస్తు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, నిఘా బృందాల పనితీరు పర్యవేక్షణ తదితర అంశాలపై ఇప్పటికే అన్ని కసరత్తులు పూర్తిచేశామన్నారు. శనివారం గ్రామ పంచాయతీ రెండవ విడత ఎన్నికలు ఈనెల 14న జరుగనున్న నేపథ్యంలో కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఎన్నికల సాధారణపరిశీలకులు శ్యాం ప్రసాద్ లాల్ వేర్వేరుగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించారు. నిజామాబాద్ డివిజన్‌లోని ధర్పల్లి, డిచ్‌పల్లి, ఇందల్వాయి, మాక్లూర్, మోపాల్, నిజామాబాద్, సిరికొండ, ఆర్మూర్ డివిజన్‌లోని జక్రాన్‌పల్లి మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీలకు జరిగే ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సామాగ్రి పంపిణీ తీరు తెన్నులను కలెక్టర్ క్షేత్రస్తాయిలో పరిశీలించారు. ఇందల్వాయి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని తనిఖీ చేసి అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎలాంటి లోటుపాట్లు, గందర గోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందిందా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు. సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా, నిజామాబాద్, మాక్లూర్, మోపాల్ తదితర మండల పరిషత్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాం ప్రసాద్‌లాల్ సందర్శించారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో రెండవ విడతగా ఈనెల 14న పోలింగ్ నిర్వహించనున్న మండలాల్లో పోలింగ్, కౌంటింగ్ కోసం పక్కాగా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి సదుపాయాలను సరిచూసుకోవడం జరిగిందన్నారు. తాగునీరు, వీల్ చైర్ వంటి వసతులతో పాటు, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాల్సిందిగా ఆదేశించామని తెలిపారు. ప్రతి పిఎస్‌లో ఓటర్లకు సహకరించేలా బిఎల్ఒలతో కూడిన హెల్ప్ డెస్కులు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. 44 గంటల సైలెన్సు పీరియడ్‌లో పాటించాల్సిన నిబంధనలు అమలయ్యేలా నిఘా బృందాలు కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేస్తున్నాయని తెలిపారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలు ప్రకటించేలా కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేశామని అన్నారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు పూర్తి పారదర్శకంగా, సాఫీగా జరిగేలా 56 మంది సూక్ష్మ పరిశీలకులతో పాటు, 34 మంది జోనల్ అధికారులను నియమించి, అన్ని చర్యలు తీసుకున్నామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి భద్రత ఏర్పాట్లు చేపడుతున్నామని, 61 పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ చేయిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కాగా రెండవ విడతలో మొత్తం 196 సర్పంచ్ స్థానాలకు గాను నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యే నాటికి 38 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయని తెలిపారు. మిగతా 158 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా, 568 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారని వివరించారు. అదేవిధంగా మొత్తం వార్డు స్థానాలు 1760 ఉండగా, 5 వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదని, 674 వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయని, 1081 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని, 2634 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని అన్నారు. రెండవ విడతలో మొత్తం 1476 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,38,838 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం 1476 మంది ప్రిసైడింగ్ అధికారులను, 1937 మంది ఒపిఒలను నియమించామన్నారు. మొదటి విడత తరహాలోనే మలి విడత ఎన్నికలను కూడా ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు.

## నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం:కలెక్టర్



ప్రజాపక్షం/నిజాంసాగర్:మారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి, లింగంపేట్, నిజాంసాగర్ మండలాలు డిస్ట్రిబ్యూషన కేంద్రాలను కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శనివారం సందర్శించారు. 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఆదివారం డిసెంబర్ 14న ఉదయం 7 గం.ల నుండి మధ్యాహ్నం 1 గం.ల వరకు నిర్వహించబడతాయన్నారు. ఎల్లారెడ్డి డివిజన్‌లో మొత్తం 1654 వార్డులు, గాంధారిలో 45, లింగంపేట్ 41, మమ్మద్‌నగర్ 13, నాగిరెడ్డిపేట్ 27, నిజాంసాగర్ 14, పిట్లం 26, ఎల్లారెడ్డి 31 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 44 మంది సర్పంచులు ఏకగ్రీవం కాగా 153 పోలింగ్ కేంద్రాల్లో 506 మంది అభ్యర్థులకు ఎన్నికలు జరుగనున్నాయన్నారు. నేడు నిర్వహించే ఓట్లకు మొత్తం 189177 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 90739, స్త్రీలు 98435, ఇతరులు ముగ్గురు ఉన్నట్లు చెప్పారు. ఉదయం 7 గం.లకు పోలింగ్‌కు సిద్దంగా ఉండాలని, పోలింగ్ కొరకు అన్ని సిద్దంగా ఉంచినట్లు చెప్పారు. పోలింగ్ సిబ్బందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, బస్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీఓ పార్థ నరసింహారెడ్డి, ఎన్నికల అధికారులు ఉన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ఆర్జీ3 ఏరియాలో పర్యటించిన రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్



**ప్రజాపక్షం/రామగిరి :** తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ డాక్టర్ సి.సువర్ణ, శనివారం రామగుండం3 ఏరియా లో పర్యటించారు. రామగిరి అతిథి గృహం నందు రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు.అనంతరం ఓసిపి2 ఉపరితల గనిని సందర్శించి వ్యూ పెయింట్ నుండి క్వారీని పరిశీలించారు. తదుపరి మొక్కను నాటారు. సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం అవసరమైన అటవీశాఖ భూములకు సహాయ, సహకారాలు అందించాలని రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ కోరారు. ఈకార్యక్రమంలో అటవీ శాఖ సిసిఎఫ్ ప్రభాకర్, డిఎఫ్ఓ శివయ్య, జె.రాజశేఖర్, బలయ్య, ఇతర అధికారులు, ఫారెస్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి: ఇన్‌చార్జి కలెక్టర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. బోయినపల్లి, ఇల్లంతకుంట, తంగళ్ళపల్లి మండలాల్లో రెండో ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా ఇల్లంతకుంట జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని శనివారం ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడారు. బోయినపల్లి, ఇల్లంతకుంట, తంగళ్ళపల్లి మండలాల్లో ఈ నెల 14 వ తేదీన ఆదివారం 77 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు, 530 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించ నున్నారని వివరించారు. మూడు మండలాల్లో కలిపి మొత్తం ప్రిసైడింగ్ అధికారులు 910, ఓపీఓలు 1093 మంది విధులు నిర్వర్తించనున్నారని తెలిపారు. ఎస్ ఈ సీ నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇంక ఇతర సామగ్రి సరిచూసుకోవాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన వాహనాల్లోనే ఎన్నికల సామగ్రి తరలించాలని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఓటర్లు అందరూ తమ ఓటు హక్కు వినియోగించు కునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. మూడో ఫేజ్ ఎన్నికలు ముగిసే వరకూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు.

## గ్రామపంచాయతీ 2వ విడత పోలింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు: ఎస్పి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా 2వ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎస్పీ మహేష్ బిగితే తెలిపారు. తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్లలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులకు,సిబ్బందికి ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 2వ విడత ఎన్నికల నిర్వహణకు రూట్ మొబైల్స్ : 26 జోనల్ టీమ్స్ : 07 (ఇన్స్పెక్టర్ స్థాయి అధికారితో),క్విక్ రియాక్షన్ టీమ్స్ : 03,స్ట్రయికింగ్ ఫోర్స్:02 ఏర్పాటు చేసి మొత్తం 700 మంది పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది పోలింగ్ సమయంలో, కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా ఉంటూ ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ కేంద్రాలను వదిలి వెళ్లవద్దని సూచించారు. రూట్ మొబైల్ అధికారులు తమకు కేటాయించిన రూట్లలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద లేదా రూట్లలో ఎన్నికల ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చంద్రయ్య, సిఐ లు, ఎస్ఐ లు సిబ్బంది ఉన్నారు.

## 15న వ్యవసాయ మార్కెట్ బంద్

### వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి పి ప్రవీణ్ కుమార్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి మార్కెట్ యార్డు అడ్తిదారు బుద్దె చంద్రమౌళి (శ్రీ కనకదుర్గ కాటన్ కమిషన్ ఏజెంట్) పరమపదించినందున సంతాపక సూచకంగా అడ్తిదారులందరూ కలిసి మార్కెట్ యార్డ్ కార్యకలాపాలకు బంద్ ప్రకటించమని కోరినందున తేదీ: 15.12.2025 రోజున పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పత్తి క్రయవిక్రయలకు బంద్ ప్రకటించనైనదనీ ఉన్నత శ్రేణి మార్కెట్ కార్యదర్శి పి ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున రైతు సోదరులందరు కూడా గమనించాలని మార్కెట్ యార్డ్ మంగళవారం అనగా 16.12.2025 పునఃప్రారంభం అవుతుందని తెలిపారు.

## మద్యం పట్టివేత



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లగొల్లపల్లిలో ఓరాజకీయ పార్టీ మద్దతులో బరిలో నిలిచిన అభ్యర్థికి సంభందించిన మద్యం పోలీసులకు పట్టుబడింది. బొప్పాపురం నుండి కిష్టంపల్లి మీదుగా ఆటోలో వెళుతున్న నాలుగు కాటన్ల మద్యం ఆటోతో సహా మద్యంపట్టుకుని ఎఫ్ఎస్టీ టీం పోలీసుఠాణాకు తరలించారు.టీం మెంబర్స్ డిప్యూటి తహసీల్దార్ మురళీకృష్ణ,మండల రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రవణ్,మంగూరపు అశోక్ తదితరులున్నారు.

## పల్లెల్లో జోరు..పట్టణాల్లో బేజారు

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** పంచాయితీ ఎన్నికల సందర్భంగా పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది.మేజర్ గ్రామాలు ఇండిపెండెంట్ అభ్యర్థులు కాస్త గట్టిపోటీలోకే దిగడంతో ఎన్నికలు రసవత్తరంగా ఈ నెల 17న జరుగనున్నాయి.సమస్యాత్మక గ్రామాలపై అధికారులు దృష్టిపెట్టారు.పోలీసులు అప్రమత్తం చేస్తున్నారు.మూడోదశ ఎన్నికలకు అధికారులు సర్వసన్నద్ధం చేస్తున్నారు.పల్లెల్లో పంచాయితీ ఎన్నికల జోరు కొనసాగించింది.మండల కేంద్రంలో సర్పంచ్ అభ్యర్థి ఎస్సీ జనరల్ రావడం బీసీ వర్గాలకు తీవ్ర నిరాశకు గురిచేసినట్లైందని చెప్పవచ్చు. గొల్లపల్లి గ్రామంలో అయోమయంలో అశావాహలు ఉండటం సందిగ్ధంలో పడవేసింది.మిగితా గ్రామాలు ఎవరుగెలుస్తారో అప్పుడే నిర్థారణకు వచ్చి ఎవరికి వారు దీమా వక్తం చేయబం విస్మయం కలిగిస్తోందని ఓటర్లు అనుకుంటున్నారు.

# కరీంనగర్‌లోని ఐదు మండలాల్లో పోలింగ్

### పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేసిన పోలీసులు
### బరిలో 436 మంది సర్పంచ్ అభ్యర్థులు





**ప్రజాపక్షం/కరీంనగర్:** పంచాయతీ పోరులో నేడు జరుగనున్న రెండో విడత పోలింగ్ కు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేశారు. రెండో విడతలో జిల్లాలోని చిగురుమామిడి, మానకొండూరు, తిమ్మాపూర్, గన్నేరువరం, శంకరపట్నం మండలాలున్నాయి. ఈ మండలాల పరిధిలో 113 గ్రామపంచాతీలు, 1046 వార్డులున్నాయి. ఇందులో గన్నేరువరం మండలంలో రెండు సర్పంచ్ లు ఇప్పటికే ఏకగ్రీవం కాగా మిగిలిన 111 పంచాయతీలకు నేడు ఎన్నికలు నిర్వహించనున్నారు. అలాగే 1046 వార్డుల్లో 197 వార్డు సభ్యులు ఏకగ్రీవం కాగా మిగిలిన 849 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. రెండో విడత పోలింగ్ లో 111 పంచాయతీల్లో 436 మంది సర్పంచ్ అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరిక్షించుకోనున్నారు. అలాగే 849 వార్డుల్లో 2275 మంది వార్డు సభ్యులు బరిలో ఉన్నారు. ఈ విడతలో మొత్తం ఓటర్లు 1,84,761 మంది ఉన్నారు. ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగనుంది. అనంతరం కౌంటింగ్ ప్రారంభం కానుంది. కౌంటింగ్ అనంతరం ఫలితాలను ప్రకటించనున్నారు.

**పంచాయతీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి**
**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

మానకొండూర్, తిమ్మాపూర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన రెండవ విడతలో నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలు2025లో భాగంగా కరీంనగర్ జిల్లాలో 14న రెండవ విడత పోలింగ్ జరగనున్న నేపథ్యంలో తిమ్మాపూర్ మండలం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేశారు. అదేవిధంగా మానకొండూర్ మండలానికి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు.ఈ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శనివారం సందర్శించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ప్రతి కౌంటర్ ను, ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే జోనల్, రూట్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు జిల్లా కేంద్రానికి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. రూట్, జోనల్, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని అన్నారు.

**మానకొండూర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్**

మానకొండూర్ మండలం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను మానకొండూర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సందర్శించారు. డిస్ట్రిబ్యూషన్ కేందద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడి ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే జోనల్, రూట్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

**రెండో విడతకు పటిష్ఠ భద్రత ఏర్పాట్లు...**
**కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం**

రెండో విడత పోలింగ్ కు పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేసినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. పోలింగ్ జరుగుతున్న ఐదు మండలాల పరిధిలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) లోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలను విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మండలాల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమికూడటం లేదా సమావేశం కావడం పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు.

## ఎన్నికల విధులకు అధికారులు తప్పనిసరి హాజరుకావాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/సిద్ధిపేట/బెజ్జంకి:** ఎన్నికల విధులకు నియమించిన అధికారులందరు తప్పనిసరిగా హాజరు కావాలని ఎన్నికల అధికారి సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు.శనివారం బెజ్జంకి,చిన్నకోడూర్,సిద్ధిపేట రూరల్ మండలాల్లోని ఎన్నికల సామాగ్రి పంపిణీ స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల విధులకు నియమించిన అధికారులందరు తప్పనిసరిగా ఎన్నికల సామాగ్రి పంపిణీ స్వీకరణ కేంద్రంలో రిపోర్టు చేయాలని గైహజరు అయిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.బెజ్జంకి,చిన్నకోడూర్ మండలాల్లో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి లంచ్ ఏర్పాట్లు సరిగా లేనందున అసహనం వ్యక్తం చేశారు.ఏ ఒక్కరికి కూడా అసౌకర్యం కలగకుండ ఏర్పాట్లు చేయాని ఆదేశించారు.రాష్ట ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ అధికారులు ఉదయం 7 గంటలకు ఓటింగ్ మొదలవ్వాలని ప్రతి రెండు గంటలకు ఒక్కసారి ఓటింగ్ శాతాన్ని అందించాలని తెలిపారు.మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్ కొనసాగాలని 1 తర్వాత కూడా ఓటర్లు క్యూలైన్‌లో ఉన్న వారికే ఓటు వేయడానికి అనుమతించాలని తెలిపారు.2 గంటలకు కౌంటింగ్ ప్రారంభించాలని పోలింగ్ స్టేషన్‌లో ఏజెంట్,సిబ్బందికి ఫోన్ అనుమతి లేదని తెలిపారు.వీరి వెంట ఆర్డీవో రామ్మూర్తి,జడ్పీసిఈవో రమేష్,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య,ఆయా మండల ఎంపిడివోలు కడవెర్గు ప్రవీణ్,తహశీల్దార్‌లు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత సమాజానికి కాంగ్రెస్‌తోనే న్యాయం

### ఎంపి గడ్డం వంశీకృష్ణ



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** దేశంలోని దళిత సమాజానికి కాంగ్రెస్ పార్టీ ద్వారానే న్యాయం జరుగుతుందని,వారి విద్య హక్కు కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. శనివారం రోజున ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ)ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన అడ్వైజరీ కౌన్సిల్ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కీలక సమావేశానికి లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ,ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే,ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్,రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితర జాతీయ స్థాయి కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు.ఈ సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ కృష్ణ పాల్గొన్నారు. జై భీమ్ – జై సంవిధాన్ – జై కాంగ్రెస్ నినాదంతో జరిగిన ఈ సమావేశంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరంపై విస్తృతంగా చర్చ జరిగింది. దళితులు, వెనుకబడిన వర్గాల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని నేతలు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీ కృష్ణ మాట్లాడుతూ గత ఆరు నెలలుగా దేశవ్యాప్తంగా ఎస్సీ విభాగం సమావేశాలను రాహుల్ గాంధీ , రాజేంద్ర పాల్ గౌతం అత్యంత చురుకుగా నిర్వహిస్తూ దళిత సమాజాన్ని ఒక తాటిపైకితీసుకువస్తున్నారని, దళితుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఎస్సీ నేషనల్ కమిటీ లో తనను సభ్యుడిగా చేర్చినందుకు రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ దళిత సమాజానికి న్యాయం కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని, రాజ్యాంగం డాక్టర్ అంబేద్కర్ ఆశయాలే పార్టీకి మార్గదర్శకమని స్పష్టం చేశారని వంశీ కృష్ణ తెలిపారు. అలాగే, బీజేపీ–ఆర్ఎస్ఎస్ అనుసరిస్తున్న మను స్మృతి ఆధారిత భావజాలం దేశానికి హానికరమని రాహుల్ గాంధీ హెచ్చరించారని చెప్పారు. అంబేద్కర్ ఆలోచనలను ఆధారంగా చేసుకుని దేశవ్యాప్తంగా దళితులను ఐక్యపరుస్తూ ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చిన రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో, ప్రజాప్రతినిధిగా దళితుల సమస్యలపై దేశమంతటా తన వంతు బాధ్యతను పూర్తిగా నిర్వర్తిస్తానని ఎంపీ గడ్డం వంశీ కృష్ణ తెలిపారు.

## 'సుడా' కమర్షియల్ బిల్డింగ్, ఐడిఎస్‌ఎంటి పనులు పరిశీలించిన చైర్మన్



**ప్రజాపక్షం/కరీంనగర్:** సుడా కమర్షియల్ బిల్డింగ్ మరియు ఐడీఎస్ ఎంటి పనులను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పరిశీలించారు.సంక్రాంతి వరకు ఐడీఎస్ఎంటి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. సుడా కమర్షియల్ బిల్డింగ్ పనులు ఇంకా వేగవంతం చేసి మార్చి వరకు మొదటి దశ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. డిఈఈ రాజేంద్ర ప్రసాద్, కాంట్రాక్టర్లు ఉమేందర్ రావు, చిందం శ్రీనివాస్, అజ్మల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి అడ్లూరి



**ప్రజాపక్షం/ధర్మపురి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,దివ్యాన్గుల,వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని కమలాపూర్, తిమ్మాపూర్, రాయపట్నం గ్రామాలలో శనివారం నిర్వహించిన పంచాయతీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల అభివృద్ధి ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చుతున్న అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపిస్తే గ్రామాల అభివృద్ధికి మరింత బలం చేకూరుతుందని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు.తెలంగాణ రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజల నిత్యావసరాలు,జీవన ప్రమాణాలు, జీవన భద్రతను కేంద్రంగా చేసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు నేడు ప్రతీ కుటుంబానికి చేరుతున్నాయని చెప్పారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రూ.500 కే గృహిణులకు గ్యాస్ సిలిండర్ పథకం, రైతాంగానికి రైతుబంధు,రైతు భీమా,అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డుల జారీ,పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు,విద్యార్థులకు విద్యాధనవసతిధన రాయితీలు, నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్మెంట్ అవకాశాలు వంటి పథకాలు రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు అవుతున్నాయని వివరించారు. ధర్మపురి మండలంలోని ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.రోడ్లు,తాగునీరు, మౌలిక వసతుల విస్తరణ,వ్యవసాయం,పశుసంవర్ధక రంగాల అభివృద్ధికి ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్‌లో ఘనంగా పేరెంట్స్ క్రీడోత్సవ్



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో పేరెంట్స్ క్రీడోత్సవ్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా॥ వి.నరేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో తల్లిదండ్రుల పాత్ర చాలా అమూల్యమైనదని, వారు చేసే కృషి సమాజాభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందన్నారు. తల్లిదండ్రులకు రోజువారి కార్యకలాపాల నుండి ఉపశమనం కల్పించడానికి, వారి పిల్లలు చదువుతున్న పాఠశాలలో విద్యా విధానాలను అమలు పరిచే విధానాన్ని స్పష్టంగా తెలియజేయడానికి పేరెంట్స్ క్రీడోత్సవ్ పేరుతో పలు పోటీలను నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల ద్వారా విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని, వేడుకలలో భాగంగా తల్లిదండ్రులకు ఖోఖో, చెస్, క్యారమ్స్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్ మరియు తదితరల పోటీలను నిర్వహించారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి వార్షికోత్సవ వేడుకలలో అతిథులు చేతుల మీదుగా ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలి: డిసిపి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఆదివారం రోజున ధర్మారం మండలం లో జరగబోయే రెండవ విడుత గ్రామ పంచాయతీ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో, నిస్పక్షపాతంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి అన్నారు. శనివారం రోజున స్థానిక ధర్మారం గౌతమ్ బుద్ధ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బంది అందరూ, ఎన్నికల కమిషన్ కు లోబడి పని చేయాలని సూచించారు. ఎలక్షన్స్ సమయంలో పోలీసు అధికారులు ఎలక్షన్ రోజు, ఎలక్షన్ తర్వాత కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల పై పూర్తిగా అవగాహన కలిగి ఉండి, పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజు, పోలింగ్ కేంద్రాల దగ్గర పాటించాల్సిన నియమాలను తెలియజేశారు. పోలీస్ అధికారులు ఎలక్షన్ సమయంలో సమస్యలు సృష్టించే వారి పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజు పోలింగ్ ఎవ్వరినీ రానివ్వకూడదని పోలింగ్ కేంద్రాల 100 మీటర్ల లోపల వారు పోలింగ్ కేంద్రాలకు ఎట్టి పరిస్థితిలో సెల్ ఫోన్లు, ఇంక్ బాటిల్స్, ఇతర వస్తువులు తీసుకురాకుండా జాగ్రత్తగా తనిఖీ చేయాలని అన్నారు. ఏదైనా సమస్య వస్తే వెంటనే సంబంధిత అధికారులు సమాచారం అందించాలని అన్నారు. ఎన్నికల రోజు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మొబైల్ రూట్ లలో ఏదైనా సంఘటన జరిగితే క్షణాలలో రూట్ మొబైల్ టీమ్ లు అక్కడకు చేరుకొని సమస్యను పరిష్కరించగలగాలి తెలియజేశారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సమావేశం లో పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, గోదావరిఖని 2 టౌన్ సీఐ ప్రసాద్ రావు, గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్, ఎస్ ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## రెండవ విడత పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

### 172 గ్రాపపంచాయతీలకు 684 మంది అభ్యర్థులు
### 1371 వార్డులకు 3644 అభ్యర్థులు
### ఓటు హక్కును వినియోగించుకోనున్న 2.49.852 ఓటర్లు



**ప్రజాపక్షం/సిద్ధిపేట :** సిద్దిపేట జిల్లాలో రెండవ విడుత పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. జిల్లా పరిధిలోని 10 మండలాలు భూంపల్లిఅక్బర్‌పేట, బెజ్జంకి, చిన్నకోదూరు, దుబ్బాక, మిరుదొడ్డి, నంగునూరు, నారాయణరావుపేట, సిద్దిపేట రూరల్, సిద్దిపేట అర్బన్, తొగుట మండల పరిధిలోని 172 గ్రామపంచాయతీలకు పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశారు. 10 మండలాల పరిధిలో 182 గ్రామపంచాయతీలకు 10 గ్రామపంచాయతీలు ఏకగ్రీవమైనాయి. 1644 వార్డు సభ్యులకు 273 సభ్యులకు ఏకగ్రీవమైనాయి. 1371 వార్డు సభ్యులకు 3644 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 10 మండలాల పరిధిలో 2.49.882 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 1.27.954 మహిళలు, 1.21.927 పురుషలు, ఇతరులు ఒక్కను తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

**ఉదయం 7గంటల నుండి 1 వరకు పోలింగ్- 2గంటల నుండి కౌంటింగ్, విజేతల ప్రకటన,ఉప సర్పంచ్ ఎన్నిక**

సిద్ధిపేట జిల్లాలో రెండవ విడుతలో 172 గ్రామపంచాయతీలకు 218 మంది రిటర్నింగ్ అధికారులు, 1973 పోలింగ్ అధికార్లు, 2436 ఓపిఓలు, 21 మంది మైక్రో అబ్జర్వర్లు, 7 గురుని వెబ్ కాస్టింగ్, 28 మంది జోనల్ అధికారులు, 59 రూట్ అధికారులను నియమించారు. ఈ నెల 14న ఉదయం పోలింగ్ ప్రారంభమవుతుంది. పోలింగ్ ముందు వివిధ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్నారు. 14న ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత కౌంటింగ్ ప్రారంభించి, విజేతలను ప్రకటించనున్నారు. ముందుగా వార్డు సభ్యుల ఎన్నిక కౌంటింగ్ నిర్వహించి, అనంతరం సర్పంచ్‌ల కౌంటింగ్ నిర్వహించి విజేతలను ప్రకటించారు. ఆనంతరం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నారు.

**పోలింగ్‌కు భారీ బందోబస్తు**

సిద్దిపేట జిల్లా రెండవ విడుతలోని పంచాయతీ ఎన్నికలకు అక్బర్‌పేటభూంపల్లి బెజ్జంకి, చిన్నకోడూరు, దుబ్బాక, మిరుదొడ్డి, నంగునూరు. నారాయణరావుపేట, సిద్ధిపేట రూరల్, సిద్దిపేట అర్బన్ మండలాల్లో ఈనెల 14న శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయ్‌కుమార్ తెలిపారు.

# రీల్

## 'వైఫ్' చిత్ర టైటిల్ లాంచ్



అథిరా టాకీస్ బ్యానర్ పై సినిటారియ మీడియా వర్క్స్ సపోర్ట్‌తో శ్రీనివాస్ (బుజ్జి) దర్శకత్వంలో నరేన్ తేజ్, సువాన జంటగా నటిస్తూ ముదిత్‌కృష్ణ వర్మ సినిమాటోగ్రాఫర్ గా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం వైఫ్. సత్య కాశ్యప్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి నందమూరి హరి ఎడిటింగ్ చేశారు. ప్రముఖ దర్శకుల ఆధ్వర్యంలో వైఫ్ చిత్ర టైటిల్, ఫస్ట్ లుక్ లాంచ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ దర్శకుడు చంద్ర మహేష్ మాట్లాడుతూ.. ఈ చిత్రానికి సపోర్ట్‌గా నిలిచిన సినిటారియ మీడియా వర్క్స్ వెంకట సినిమాకు మరింత బలాన్ని అందిస్తారు. మ్యూజిక్ పరంగా కూడా మంచి సపోర్టు లభిస్తుంది. అటు భర్తకు ఇటు కుటుంబానికి బలంగా, పునాదిలా నిలబడే వైఫ్ టైటిల్ ఈ సినిమాకు మరింత బలాన్ని చేకూరుస్తుంది. ఈ సినిమాకు పని చేసిన అందరికీ మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను' అన్నారు. ప్రముఖ డైరెక్టర్ సముద్ర 'ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. అందరి జీవితాలలో వైఫ్ ఉంటారు. ఆ వైఫ్‌ను టైటిల్‌గా పెట్టారు. ఈ సినిమా కోసం ఎంతో మంది ప్రతిభావంతులు పనిచేస్తున్నారు. సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు.

## లుక్ అదిరింది..



మెగాస్టార్ చిరంజీవి మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు'. హిట్ మేకర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో కనిపించనున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై నిర్మాతలు సాహు గారపాటి, సుష్మిత కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు, శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. ప్రమోషన్స్ ఇప్పటికే హై గేర్‌లో ఉన్నాయి. రెండు పాటలు చార్ట్‌బస్టర్స్‌గా నిలిచాయి. వెంకటేష్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ సినిమా నుంచి ఆయన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ప్రత్యేకంగా రూపొందించిన వీడియో ద్వారా ఈ అప్డేట్‌ను విడుదల చేశారు. ఆ వీడియోలో సినిమా మొత్తం టీమ్ వెంకటేష్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ కనిపించారు. చివర్లో ఆయన ఫస్ట్ లుక్ రివిల్ కావడం హైలైట్‌గా నిలుస్తుంది. ఫస్ట్ లుక్‌లో వెంకటేష్ తనదైన చరిస్మాతో ముందుకు నడుస్తూ కనిపించారు. మోడరన్ దుస్తుల్లో ఆయన స్టైల్ ఆకట్టుకుంటుంది.

## విధాత ట్రైలర్ ఆవిష్కరణ

ఏంబిసి ప్రొడక్షన్ పతాకంపై భాస్కర్, కోటేశ్వర రావు, ప్రధాన పాత్రదారులుగా మణికంఠ రాజేంద్ర బాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించిన చిత్రం విధాత. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం డబ్బింగ్ కార్యక్ర



మాలు పూర్తి చేసుకుని తొలి కాపీ తో సిద్ధమైంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ ను నటుడు కాదంబరి కిరణ్, నిర్మాత సాయి వెంకట్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత భాస్కరాచారి మాట్లాడుతూ 'ఇది ఒక వైవిధ్య భరిత మైన చిత్రం. ఒక యదార్ధ సంఘటన ఆధారంగా ఈ చిత్రం రూపొందించడం జరిగింది. ఈ చిత్రంలో పాత్రలన్నీ చాలా సహజ సిద్ధంగా ఉంటాయి. సంగీత పరంగా కూడా మా చిత్రానికి మంచి మార్కులు ప్రేక్షకులు వేస్తారని ఆశిస్తున్నాను. ఈ చిత్రాన్ని అతి త్వరలో మీ ముందుకు తీసుకురానున్నాము అని అన్నారు. చిత్ర దర్శకుడు రాజేంద్ర మాట్లాడుతూ'మా నిర్మాత నా మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. ఈ చిత్రంలోని ప్రతి పాత్ర ఓ కొత్త కోణాన్ని వెలుగు చూస్తుంది. ఈ చిత్రం ప్రస్తుత పనులన్నీ పూర్తయ్యాయి. సెన్సార్‌కి సిద్ధమైంది. ఈ చిత్రం మాకు మా ప్రొడ్యూసర్‌కి మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నానని అన్నారు.

## 'మ్యాజిక్ మూవ్ మెంట్స్' టైటిల్ విడుదల



తల్లాడ సాయికృష్ణ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'మ్యాజిక్ మూవ్ మెంట్స్' (మీరు అనుకున్నది కాదు). ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు కె.దశరథ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ క్రియేషన్స్, శ్రీలక్ష్మి శ్రీనివాస ఫిలిమ్స్ బ్యానర్స్ పై తల్లాడ శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. వెంకట్ దుగ్గిరెడ్డి సహ నిర్మాత. ప్రస్తుతం చిత్రీకరణ తుది దశలో ఉన్న 'మ్యాజిక్ మూవ్ మెంట్స్' (మీరు అనుకున్నది కాదు) సినిమా టైటిల్ లాంచ్ ఈవెంట్ ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ ఏకాదంతాయ సిరి మాట్లాడుతూ.. చిన్న సినిమాలోకి హీరోయిన్స్‌ను తీసుకున్నా రంటే ఏదో గ్లామర్ షో చేయిస్తారు అనుకుంటారు. కానీ సాయికృష్ణ దర్శకుడిగా ఒక సిన్సియారిటీ చూపించారు. సినిమాను ఎంత ఫాస్ట్‌గా రూపొందించారంటే మేమంతా ఆశ్చర్యపోయాం. ఇంత స్పీడ్‌గా సినిమా చేయొచ్చా అనుకున్నాం. 'మ్యాజిక్ మూవ్ మెంట్స్' (మీరు అనుకున్నది కాదు) మూవీ మీ అందరినీ ఎంటర్ టైన్ చేస్తుందని నమ్ముతున్నాం అన్నారు. హీరో, దర్శకుడు తల్లాడ సాయికృష్ణ మాట్లాడుతూ సాయిబాబా ఆశీస్సులు ఇస్తున్న ఫొటో ఒకటి మా ఇంట్లో ఫ్రిడ్జ్ మీద ఉంది. ఆ ఫొటో చూసిన ఇన్స్పిరేషన్ తో 'మ్యాజిక్ మూవ్ మెంట్స్' (మీరు అనుకున్నది కాదు) సినిమా స్క్రిప్ట్ మొదలైంది. ఈ సినిమా ప్రారంభించేప్పటికి మా దగ్గర డబ్బులు లేవు. కానీ సినిమా చేయాలి, చేస్తామనే నమ్మకం పట్టుదల ఉన్నాయి. ఆ టైమ్‌లో మా వెంకట్ దుగ్గిరెడ్డి అన్న, తల్లాడ శ్రీనివాస్ ముందుకొచ్చారు. వీరిద్దరితో పాటు నన్ను ఎప్పుడూ సపోర్ట్ చేసే దశరథ్ గారు సమర్పకులుగా ఉండేందుకు అంగీకరించారు.

## అవకాశాలు తగ్గాయి



ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌కు హీరోయిన్‌గా పరిచయమైన కృతి శెట్టి మొదటి సినిమాతోనే మంచి హిట్ అందుకోవడంతో పాటూ ఆ సినిమాతో నటిగా పేరు కూడా సంపాదించుకుంది. ఉప్పెన అందించిన క్రేజ్ వల్ల వరుస అవకాశాలను అందుకున్న కృతి వాటితో ఏ మాత్రం కెరీర్‌లో పైకి ఎదగలేకపోయింది. దీంతో క్రమంగా అమ్మడికి తెలుగులో అవకాశాలు తగ్గాయి. ఈ నేపథ్యంలోనే కోలీవుడ్‌లో తన లక్‌ను టెస్ట్ చేసుకుందామని కృతి ట్రై చేసింది. అందులో భాగంగానే పలు సినిమాలను ఒప్పుకుని ఒకదాని తర్వాత ఒకటి పూర్తి చేస్తూ వచ్చి ఆఖరికి ఈ డిసెంబర్‌లోనే రెండు సినిమాలను రిలీజ్‌కు తీసుకొచ్చింది. అయితే ఎప్పుడెప్పుడు తన కోలీవుడ్ డెబ్యూ జరుగుతుందా అని ఎంతో ఎదురుచూసిన కృతికి ఎప్పటికప్పుడు అది వెనక్కి వెళ్తూనే ఉంది. కార్తీ హీరోగా కృతి చేసిన 'అన్నగారు వస్తారు' సినిమా అనుకోకుండా సడెన్‌గా వాయిదా పడగా, విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్ హీరోగా తెరకెక్కుతున్న లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ కూడా ఈ నెల 18 నుంచి వాయిదా పడింది. ఈ రెండు సినిమాలూ వాయిదా అయితే పడ్డాయి కానీ మళ్లీ ఎప్పుడు అవి రిలీజవుతాయనేది మాత్రం ఇంకా తెలియలేదు. మరి కృతి కోరుకుంటున్న కోలీవుడ్ డెబ్యూ ఎప్పుడు జరుగుతుందో చూడాలి.

## 'వి-చిత్ర' సెన్సార్ పూర్తి



సిస్ ఫిలిమ్స్ బ్యానర్‌పై జ్యోతి అపూర్వ ప్రధాన పాత్రలో రవి రావణ్ రుద్ర, శ్రేయ తివారి హీరో హీరోయిన్‌గా 'బేబి' శ్రీ హర్షిణి, మీనావాసు ప్రత్యేక పాత్రలో సైఫుద్దీన్ మాలిక్ నిర్మాణ దర్శకత్వంలో విడుదలకు సిద్ధంగా ఉన్న చిత్రం 'విచిత్ర' త్వరలో పేక్షకుల ముందుకు రానుండి తల్లి కూతుళ్ళ సెంటిమెంట్ హృదయాలను హత్తుకునే కథ కథనం తో చక్కటి ఫ్యామిలీ ఎంటర్టైనర్ తెరకెక్కిన విచిత్ర' ఇటీవలే సెన్సార్ పనులు పూర్తి చేసుకొని విడుదలకి సిద్ధమవుతుంది.ఈ సందర్భంగా ఈ చిత్రం దర్శక నిర్మాత సైఫుద్దీన్ మాలిక్ మాట్లాడుతూ ఒక ఆత్మీయమైన ఒక తల్లి కూతుళ్ళ సెంటిమెంట్ తో రూపొందిన చిత్రం 'విచిత్ర ' ప్రతి కుటుంబం తల్లి ప్రేమ, త్యాగం, బంధం గురించి ఆలోచించేలా చేసే హృదయాన్ని తాకే చిత్రం 'విచిత్ర' ఈ చిత్రాన్ని 2026లో విడుదలకి సిద్ధం చేస్తున్నాం అన్నారు. అలాగే మ్యూజిక్ డైరెక్టర్ నిజాని అంజన్ ఇచ్చిన పాటలు ప్రతి ఒక్కరికి ఆకట్టుకుంటాయి ముఖ్యంగా తల్లి సెంటిమెంట్ చిత్ర పాడిన సాంగ్ మరియు ఐటమ్ సాంగ్ ప్రత్యేక ఆకర్షనగా నిలుస్తాయి అని దర్శకనిర్మాత సైఫుద్దీన్ మాలిక్ తెలిపారు.

## 'దండోరా' టైటిల్ సాంగ్ రిలీజ్



'నిను మోసినా నను మోసినా
అమ్మ పేగు ఒకటేనన్నా
నిను కోసినా నను కోసినా
రాలే రగతం ఎరుపేనన్నా
చిన్నా పెద్దా తేడా ఎట్లొచ్చేరా
నన్ను తొక్కే హక్కు ఎవడిచ్చేరా
ముట్టుకుంటే మైల ఎట్టయ్యేరా
కొట్టి కొట్టి గుండె డప్పయ్యేరా
దండోరా.. దండోరా. అనే సాగే 'దండోరా...' మూవీ టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. మార్క్ కె రాబిన్ సంగీత సారథ్యం వహిస్తోన్న ఈ సినిమాలోని, ఈ పాటను కాసర్ల శ్యామ్ రాశారు. ఆంథోని దాసన్, మార్క్ కె.రాబిన్ పాటను పాడారు. సమాజంలో అట్టడుగు వర్గాల ప్రజల బాధలను తెలియజేసేలా సాగే ఈ పాట చాలా ఎమోషనల్‌గా, హార్ట్ టచింగ్గా ఉంది. తరాలు మారుతున్నాయి. చంద్రుడిపైకి మనిషి అడుగు పెట్టిన ఎన్నో ఏళ్ల వుతుంది. అయినా కూడా ఈ అసమానతలు మాత్రం తగ్గటం లేదనేది ఈ పాటలోని భావం.



వైవిధ్యమైన చిత్రం కలర్ ఫోటో, బ్లాక్‌బస్టర్ మూవీ 'బెదురులంక 2012' చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్టైన్మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని రూపొందిస్తోన్న తాజా చిత్రం 'దండోరా'. శివాజీ, నవదీప్, నందు, రవి కృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు పాత్రధారులు. మురళీకాంత్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రం డిసెంబర్ 25న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ఒట్టేసి చెప్పండి

(మొదటి పేజీ తరువాయి)

చెందిన కల్లూరి బాలరాజు అభ్యర్థి గ్రామంలో ఓట్ల కోసం రూ.10 లక్షలకు పైగా ఖర్చుచేయగా, 448 ఓట్లతో బాలరాజు ఓడిపోయాడు. ఇంత డబ్బు పంచిన మెజారిటీ రాకపోవడంతో బాలరాజు దంపతులు ఒకరు చేతిలో దేవుడు ఫోటో పట్టుకొని, అతని భార్య పురుగుల మందు డబ్బాతో ఇంటింటికి తిరిగి ఎన్నికల ముందు ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వాలని, నిజాయితీగా నాకు ఓటు వేసిన వారు అవసరం లేదని, వేయనివారు కచ్చితంగా తీసుకున్న డబ్బును తిరిగి ఇవ్వాలంటూ గ్రామస్థులతో బాలరాజు శుక్రవారం వాగ్వాదం చేశాడు. యాభై లేదా వంద ఓట్ల తేడాతో ఓడిపోతే ఏమైనా అనుకోవచ్చు కానీ ఇంత డబ్బు పంచినా ప్రత్యర్థి అయినా జక్కుల పరమేశ్ భారీ ఎత్తున మెజారిటీ ఎలా వచ్చిందంటూ గ్రామస్థులతో బాలరాజు దంపతులు దిగారు. గ్రామస్తులు సైతం బాలరాజు దంపతులకు ఎదురు వాగ్వాదానికి దిగారు. మీ ఇంటికి ఏమైనా డబ్బులు ఇవ్వమని వచ్చామా అంటూ గట్టిగానే నిలదీశారు. గ్రామంలోని ప్రజలు ఇటువంటి సంఘటనలు ప్రతి ఓటర్ కు ఒక కనువిప్పు కావాలని, ఓట్ల ముందు డబ్బులు తీసుకుని ఓటు వేస్తే ఇలాంటి పరిస్థితులే గ్రామ ప్రజలకు ఎదురవుతాయని, ప్రతి ఒక్కరూ నీతి నిజాయితీగా ఓటు వేసి సమాజ నిర్మాణం కోసం పాటుపడాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.



**మహబూబాబాద్ జిల్లాలో సేమ్ సీన్ :**

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థి కుటుంబ సభ్యులు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ మీరు మాకు ఓటు వేయకపోవడంతోనే మేము ఓడిపోయాం. మాకు ఓటు వేస్తే ఓటు వేసినట్లు ప్రమాణం చేయాలి. ఓటు వేయని పక్షంలో మా డబ్బులు మాకు తిరిగి ఇవ్వండి అంటూ ఇంటింటికీ తిరుగుతూ పంపిణీ చేసిన డబ్బులను తిరిగి వసూలు చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా సోమ్లా తండాలో చోటు చేసుకుంది. ఎన్నికలకు ముందు రోజు తండాలోని ఓటర్లకు ఓటుకు రూ.1500 చొప్పున, ఇంటికి ఒక కోడిని కాంగ్రెస్ మద్దతుదారు పంచారు. కాంగ్రెస్ రెబల్ రూ.2000 పంపిణీ చేశారు. ఎన్నికల్లో 17 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి ఇస్లావత్ సుజాత బాలాజీ గెలుపొందారు. ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి భూక్యా కౌసల్య, భర్త ధల్ సింగ్, కుమారుడు సందీప్‌లు జెండా పట్టుకొని ఇంటింటికీ తిరుగుతూ మీరు ఓటు వేయకపోవడం వల్లనే మేం ఓడిపోయాం. మాకు ఓటు వేసినట్లు కుల దైవం జెండా పట్టుకొని ప్రమాణం చేయండి. ప్రమాణం చేయని పక్షంలో మేం పంపిణీ చేసిన డబ్బులు మాకు ఇవ్వండి అంటూ తిరిగి డబ్బులు వసూలు చేశారు. ఇక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి అక్కడి నుంచి అందరినీ చెదరగొట్టారు. కానీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థి మాత్రం మరోలా సమాధానం ఇస్తున్నారు. తాను గుడి వెళ్లేందుకు సిద్ధమయ్యానని అందుకే ఇంటింటికీ వెళ్లి డబ్బులు అడుగుతున్నానని అన్నారు.

## వాక్చాతుర్యంతో.. యుద్ధాలు గెలవలేం



**పాకిస్థాన్‌కు సిడిఎస్ జనరల్ అనిల్‌చౌహాన్ చురక**

**దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో 'కంబైన్డ్ గ్రాడ్యుయేట్ పరేడ్'**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశం యొక్క భవిష్యత్తు పోరాట శక్తి ఉమ్మడితనం, ఆత్మ నిర్భరత, ఆవిష్కరణ అనే మూడు స్తంభాల ద్వారా నడపబడుతున్నదని, దానినే 'జై' (జెఏఐ)గా దిచీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) జనరల్ అనిల్ చౌహాన్ అభివర్ణించారు. ఆయన శనివారం ఇక్కడకు సమీపంలోని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో కంబైన్డ్ గ్రాడ్యుయేట్ పరేడ్ (సిడిపి)ని సమీక్షించిన జనరల్ చౌహాన్ ఏ దేశం పేరును కూడా ప్రస్తావించకుండా సంస్థాగత దుర్బలత్వం, ప్రతిచర్యాత్మక సర్దుబాట్లను సూచించే పరిణామాలు మనచుట్టూ తరచుగా కనిపిస్తున్నాయని అన్నారు. 'వాక్చాతుర్యంతో యుద్ధాలను గెలవలేం. కానీ మన చుట్టూ ఉద్దేశపూర్వకంగా ఉండటం ద్వారా సంస్థాగత, ప్రతిచర్యాత్మక సర్దుబాటును సూచించే పరిణామాలను మనం తరచూ చూస్తుంటాం. దీనికి విరుద్ధంగా భారతదేశం యొక్క బలమైన సంస్థలు, ప్రజాస్వామ్య స్థిరత్వం, అచంచలమైన వృత్తి నైపుణ్యం మన సాయుధ దళాలపై ఆధారపడి ఉంటుంది' అని అనిల్ చౌహాన్ చెప్పారు. సాయుధ దళాల దశల పరివర్తన సమయంలో భారత వైమానిక దళంలోకి ప్రవేశిస్తున్నట్లు సిడిఎస్ అనిల్ చౌహాన్ కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అధికారులకు తెలిపారు. సమగ్ర నిర్మాణాలు, ఉమ్మడి కార్యకలాపాలు రక్షణలో జాతీయపు ఆత్మనిర్భరత (స్వావలంభన) భవిష్యత్తు సైనిక బలాన్ని రూపొందిస్తున్నాయని సిడిఎస్ చెప్పారు. కొత్తగా నియమితులైన అధికారుల ముందున్న ప్రయాణం 'జై హింద్' అనే మొదటి పదం ద్వారా మార్గనిర్దేశనం చేయబడుతుందని ఆయన తెలిపారు. ఐక్యత అంటే ఒక దేశంగా, ఆత్మనిర్భరత కోసం ఒకటిగా పోరాడటాన్ని సూచిస్తుంది. భారతదేశం కోసం కాకుండా ప్రపంచం కోసం తయారు చేయబడిన విశ్వసనీయ వేదికలు, వ్యవస్థలను సూచిస్తుంది. ఆవిష్కరణలు ముందుకు సాగడానికి ధైర్యంగా ఉండటాన్ని సూచిస్తాయని జనరల్ అనిల్‌చౌహాన్ అన్నారు. భారతదేశ భవిష్యత్తు పోరాటశక్తికి ఈ మూడు స్తంభాలు ఒక ఆకృతిని ఇస్తాయని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా జనరల్ అనిల్ చౌహాన్ 216 కోర్సు యొక్క కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌ను సమీక్షించారు. ఈ కార్యక్రమం భారత వైమానిక దళం (ఐఎఎఫ్) లోని వివిధ విభాగాలలోని ఫ్లైట్ కేడెట్‌ల ప్రీ కమిషనింగ్ శిక్షణ విజయవంతంగా పూర్తి కావడానికి గుర్తుగా ఉంది. ఈ కార్యక్రమంలో ఆకాశ్ గంగా బృందం, ఎయిర్ వారియర్ డ్రిల్ టీమ్( ఏడబ్ల్యాడి టి) ప్రదర్శన కూడా ఉంది. ఇది యుద్ధవిన్యాసాల ప్రారంభానికి గుర్తుగా ఉంది. సారంగ్ హెలికాప్టర్ డిస్ప్లే, సూర్యకిరణ్ ఏరో బ్యాటిక్ టీమ్ (ఎస్‌కెఎటి) వైమానిక ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి.



## టిఎన్‌జిఓస్ క్రికెట్ పోటీల్లో ఎక్సైజ్ టీం విజయం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిఎన్‌జిఓస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగుల మధ్య నిర్వహించినటువంటి పలు రకాల పోటీల్లో క్రికెట్ విభాగంలో తెలంగాణ ఎక్సైజ్ శాఖ విజయం సాధించింది. క్రికెట్‌తో పాటు మహిళా కానిస్టేబుల్ కూడా పలు పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ మధ్యలో 15 ఓవర్ల క్రికెట్ మ్యాచ్ జరిగింది. తొలతగా బ్యాటింగ్ నిర్వహించిన వాటర్ వర్క్స్ 15 ఓవర్లలో 128 పరుగులు చేశారు. అనంతరం 15 అవర్లలో ఎక్సైజ్ క్రికెట్ జట్టు విజయాన్ని సాధించి టిఎన్‌జిఓస్ కప్పును అందుకోవడానికి అర్హత సాధించారు. ఈ క్రీడలను పరిశీలించడానికి ఎస్‌టిఎఫ్‌బి టీం లీడర్ ఎక్సైజ్ ఇఎస్ ప్రదీప్ రావుతో పాటు ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది గ్రౌండ్‌లో క్రీడాకారులను అభినందించారు.

## కొత్త నిబంధనలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఇలాంటి నిర్ణయం తీసుకునే అధికారం,హక్కు ఒక ప్రభుత్వ యంత్రాంగానికి లేదన్న ప్రధానాంశంతో మసాచ్యుసెట్స్ జిల్లా కోర్టును ఆశ్రయించాయి. న్యూయార్క్ అటార్నీ జనరల్ లెటిషియా జేమ్స్ సహా మరో 18 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ ఒక కూటమిగా ఏర్పడి ఈ దావాలు వేశారు. అరిజోనా, కాలిఫోర్నియా, కొలరాడో, కనెక్టికట్, డెలవార్, హవాయ్, ఇల్లినోయిస్, మేరీలాండ్, మసాచ్యుసెట్స్, మిచిగన్, మిన్నెసోటే, నార్త్ కరోలినా, న్యూజెర్సీ, ఓరెగాన్, రోడే ఐలాండ్, వెర్మోంట్, వాషింగ్టన్, విస్కాన్సిన్‌లకు చెందిన అటార్నీ జనరల్స్ ఈ దావాలు వేశారు. వీసాలు కోరుతూ దరఖాస్తులు చేసుకునే కొత్త వారికి ఒకేసారి భారీ ఎత్తున లక్ష డాలర్లు ఫీజు చెల్లించాలనే నిబంధన కార్మికుల కొరతకు దారితీస్తుందని, దీనివల్ల రాష్ట్రాల సామర్థ్యం కుంటుబడుతుందని అటార్నీ జనరల్స్ తమ పిటిషన్‌లో వాదించారు. న్యూయార్క్‌లో 16 గ్రామీణ కౌంటీలు ఉన్నాయి, ప్రస్తుతం ప్రతి 10,000 మందికి నాలుగు ప్రాథమిక వైద్య ఫిజీషియన్లు ఉన్నారు. ఇక న్యూయార్క్ ఆసుపత్రులలో ఇప్పటికే నర్సుల కొరత ఉంది. 2030 నాటికి ఈ కొరత 40,000కు పెరుగుతుంది. అమెరికన్ మెడికల్ అసోసియేషన్ అంచనాల ప్రకారం 2036 నాటికి అమెరికాలో 86,000 మంది ఫిజీషియన్ల కొరత ఏర్పడుతుంది. హెచ్1 బి వీసాలను సమస్యాత్మకంగా మారిస్తే ఈ కొరత భర్తీ చేయడం కష్టం.అమెరికా వ్యాప్తంగా 930 కాలేజీలు, యూనివర్సిటీలలో ఉద్యోగులు హెచ్1 బి వీసాలపైనే పనిచేస్తున్నారు. న్యూయార్క్ స్టేట్ యూనివర్సిటీలో 693 మంది ఉద్యోగులు హెచ్1బి వీసాలపై పనిచేస్తున్నారు. అనేకమంత్రి గ్రా మీణ, పట్టణ ప్రాంతాలలో కూడా విద్యార్థులు వారే ఉన్నారు. టెక్నాలజీ, ఇండస్ట్రీ, ఫైనాన్స్ వంటి కీలక రంగాలలో కూడా హెచ్1బి వీసా దారులే ఉన్నారు. ఈ రంగాలలో 13,000 మంది కీలక బాధ్యతల్లో ఉన్నారు. చాలా నైపుణ్యంతో కూడుకున్న విదేశీ వృత్తినిపుణులను హెచ్1 బి వీసాల కింద అనుమిస్తారని, ఎక్కువగా భారతీయులే ఈ వీసాలను ఉపయోగిస్తారని, వారికి ఈ ఫీజు ధర అందుబాటులో లేకుండాపోయిందని కోర్టుకు తెలియజేశారు. ఈ కొత్త విధానంవల్ల వృత్తినిపులు దేశంలోకి వచ్చే అవకాశం ఉండదని, ఇది కొరతకు దారితీస్తుందని తెలిపారు. నైపుణ్యంగల వైద్యులు, నర్సులు, ఉపాధ్యాయులు, ఇతర కార్మికులు ఈ వీసాల కింద వచ్చి దేశవ్యాప్తంగా సేవలు అందిస్తున్నారని, కొత్త ఆంక్షలవల్ల విద్యా, వైద్య, సాంకేతిక రంగాలు నష్టపోతాయని అటార్నీ జనరల్స్ కూటమి పేర్కొంది. ట్రంప్ యంత్రాంగం అక్రమంగా ఈ విధానంపై దాడిచేసి విచ్ఛిన్నం చేస్తోందని, మరింత సంక్లిష్టంగా మార్చిందని, న్యూయార్క్‌లో ఆరోగ్యరంగం సమస్యలో పడుతుందని తెలిపారు. పిల్లల విద్యా వ్యవస్థ విచ్ఛిన్నమవుతుందని కోర్టు దృష్టికి తెచ్చారు. 'ఈ గందరగోళం సర్దుమణిగే వరకూ పోరాటం చేస్తా' అని అటార్నీ జనరల్ జేమ్స్ చెప్పారు. ఈ ఏడాది సెప్టెంబరులో ట్రంప్ లక్ష డాలర్లు కొత్త వీసా ధర చెల్లింపు విధానం ప్రకటించారు.

## దారుణ స్థితి

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగుల శక్తి సామర్థ్యాలను అతిగా వినియోగించుకోవడం వల్ల 60 ఏండ్లకు రావాల్సిన అనారోగ్య సమస్యలు 3 ఏండ్లకే వస్తున్నాయంది. ఐటీ, హెల్త్ బీమాలను ఏళ్లతరబడి చెల్లించిన వాళ్లకు చివరికి అవి లేకుండాపోతున్నాయని చెప్పింది. సాఫ్ట్ వేర్ ఉద్యోగులకు సామాజిక భద్రత, ఆరోగ్య భద్రతల కోసం చట్టాలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పింది. జీవన విధానానికి విరుద్ధంగా విధులను నిర్వహించే సాఫ్ట్ వేర్ ఉద్యోగుల హక్కుల రక్షణ కోసం రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు చట్టాలు చేయాలంది.
అగ్రిమెంట్ కండిషన్స్కు విరుద్ధంగా రాజీనామా చేస్తున్నందుకు రూ.5.9 లక్షల పరిహారం చెల్లించాలని ఐటీ కంపెనీ డిమాండ్ చేయడంపై లేబర్ డిపార్ట్మెంట్కు ఫిర్యాదు చేసే చర్యలు లేవంటూ సాఫ్ట్వేర్ ఉద్యోగి రాజేశ్ వేసిన పిటిష్న జస్టిస్ నగేశ్ భీమపాక పైవిధంగా తీర్పు చెప్పారు. కాంట్రాక్ట్ చట్టంలోని సెక్షన్ 27 ప్రకారం ఒక వ్యక్తిని చట్టబద్ధమైన వృత్తి, వ్యాపారం, వాణిజ్యం చేపట్టకుండా నిరోధించేందుకు వీల్లేదన్నారు. పిటిషనర్ 2019లో ఉద్యోగంలో చేరినపుడు అగ్రిమెంట్ పేప్ప సంతకం చేశారని, 2022 వరకు ఉద్యోగం చేశారని, అందుకు అనుగుణంగా అగ్రిమెంట్‌ను పెంచారని తప్పుపట్టారు. దీనిపై కార్మికశాఖ చట్టాలను అమలు గురించి చర్యలు తీసుకోవాలన్నారు. విజయా బ్యాంక్ వర్సెస్ ప్రశాంత్ బి. నర్నవారె కేసులో సుప్రీం కోర్టు తీర్పును ప్రస్తావించారు. ఈ కేసులో పిటిషనర్ చెల్లించాలన్న పరిహారాన్ని కంపెనీ ఏ ప్రాతిపదికన నిర్ణయించిందో తేల్చాలని కార్మిక శాఖను ఆదేశించారు. పిటిషనర్ రాజీనామాను ఆమోదించాలంటూ కంపనీకి ఆదేశించారు. ఉద్యోగుల హక్కులు హరించే అధికారం ఎవరికీ లేదన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల సామాజిక భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు వీరి అంశాలపై అధ్యయం చేయాలని సూచన చేశారు. వాళ్ల హక్కుల రక్షణకు చట్టాలు రూపొందించాలన్నారు. చట్టబద్ధ ఆరోగ్య రక్షణ, ఏకపక్షంగా ఉద్యోగులను తొలగించడంపై ప్రభుత్వాలు చట్టాలు చేయాలన్నారు. విదేశీ మారక ద్రవ్యానికి తోడ్పడుతున్న మధ్య తరగతి పన్ను చెల్లింపుదారులకు సామాజిక భద్రత కల్పన ఎంతో అవసరమన్నారు. కాంట్రాక్ట్ చట్టంలోని సెక్షన్ 27 ప్రకారం అగ్రిమెంట్ అమలుకు వీల్లేదన్నారు. 2019లో పిటిషనర్ విధుల్లో చేరారు. 2022 వరకు పనిచేశారు. ఎప్పటికప్పుడు అగ్రిమెంట్ను పెంచుకుంటూ చట్ట నిబంధనలను తప్పించుకునే ప్రయత్నం కంపెనీ చేసిందని తప్పుపట్టారు. ఐటీ కంపెనీలు కార్మిక చట్టాలను అమలు చేస్తున్నాయో లేదో లేబర్ డిపార్ట్మెంట్ ఆఫీసర్లు సమీక్ష చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కేసులో కంపెనీ ఏ ప్రాతిపదికన కంపెనీ పరిహారం నిర్ణయించిందో తేల్చాలని కార్మికశాఖను ఆదేశించారు. పిటిషనర్ రాజీనామాను ఆమోదించాలని ఐటీ కంపెనీని ఆదేశించారు.

## రెండు ద్విచక్రవాహనాలు ఢీ

### ముగ్గురి దుర్మరణం.. ఇద్దరికి తీవ్ర గాయాలు

**కియోంజార్ :** కియోంజార్ జిల్లాలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశాలోని కియోంజార్ జిల్లాలో చందపాసి–పాండపద రోడ్డుపై రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అసనాబహలి గ్రామానికి చెందిన దుశాసన బారిక్(40), బాలబద్రాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ సేనాపతి (25), మనోజ్‌కుమార్ దలే(25)ను మృతులుగా గుర్తించారు. రాజునాయక్, రాహుల్‌నాయక్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని జిల్లాప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. రెండు ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com